అనసూయాదేవి:
కథ.

కర్త

శ్రీ ఉమర్ అలీషాకవి



శ్రీ ఉమర్ అలీషాకవి గ్రంథప్రచురణ సంఘమువారిచేఁ

బ్రకటింపఁబడినది.

పిఠాపురము

1951

 [వెల రు 2-0-0

[illegible]

రెండవ కూర్పు


1000 ప్రతులు


రాజమహేంద్రవరము

సరస్వతీ పవర్ ప్రెస్ సందు

శ్రీ అడ్డేపల్లి నాగేశ్వరరావుగారిచే

ముద్రితము.





శ్రీ ఉమర్ అలీషాకవిగారి జీవిత సంగ్రహము

శ్రీ ఉమర్ ఆలీషాకవిగారు పీఠికాపురమున క్రీ. శ. 1885 వ సం॥ లో జన్మించిరి. వీరి తండ్రిగారు మహర్షి మొహియుద్దీన్ భాషా గురువర్యులు. వీరి జనని చాన్బియాంబ.

వీరి తండ్రిగారు అరబ్బి, పారశీక, సంస్కృతాంధ్ర పండితులు, ఆధ్యాత్మిక విద్యాపీఠాచార్యులు, ఆత్మవిద్యాపారంగతులు. వీరి కుటుంబము పూర్వమునుండియు భాషాపాండిత్యమునకు, ఆధ్యాత్మికవిద్యా సంపత్తికిని ప్రఖ్యాతిగాంచినది. శ్రీ కవిగారు చిన్ననాడె సంస్కృతాంధ్రములు విశేషముగా నభ్యసించిరి. తదుపరి అరబ్బి, పారశీకాంగ్లభాషలు నేర్చిరి. వీరు ఆంగ్లమున వ్రాయుట, మాట్లాడుట యెఱుంగుదురు. కాని ఆంగ్ల పద్య కావ్యములందు ఎంతమాత్రము వీరికి ప్రవేశము లేదు. వీరు సహజ కవులు. వీరి 14 వ వర్షమున తెనుగున ధారాళముగా కవిత్వముఁ జెప్పిరి. వీరి 18 వ యేట 'మణిమాల' యను నాటకము వ్రాసి అచ్చొత్తించిరి. అది షేక్స్పియర్ మహాకవి నాటకమువలె నున్నదని అప్పటి పత్రికలు కొనియాడినవి. వీరి కనేకచోట్ల ఉద్యోగము లిచ్చెదమని ఆహ్వానించినను వాటి నంగీకరింపక భాషాసేవ దేశసేవఁ జేయుచు తమ జీవితమును గడిపిరి. వీరు 1934 వ సంవత్సరము డిశంబరు నెలలో అఖిల భారత శాసనసభకు సభ్యులైరి. ఆ పదవి వీరి మరణమువరకు నుండెను.

వీరికి International Academy of America వారు 1936 సంవత్సరమున Doctor of Literature బిరుద మొసగిరి. శ్రీ కవిగారు వంశపారంపర్యముగా వచ్చుచున్న అధ్యాత్మిక విద్యాపీఠమునకు అచార్యులై పదవారువేల జనమును శిష్యులుగా నొనర్చిరి.

వీరి యోగికజ్ఞానమును కొనియాడుచు జ్ఞానసభాసభ్యులు వీరికి బ్రహ్మర్షి బిరుద మొసంగిరి. వీరి సతీమణి అక్బరు బీబీగారు వీరితో ఢిల్లీనగరము వెళ్ళి ది 5-4-45 తేదిని దివి నలంకరించిరి. ఆదినమున ఢిల్లీ శాసనసభ మూయబడెను. వీరు గతించినప్పుడు వీరికి అయిదుగురు కుమారులు యిరువురు కుమార్తెలు పెక్కురు పౌత్రపౌత్రీ లుండిరి.

శ్రీ కవిగారి జీవిత చరిత్ర ప్రత్యేక పుస్తకముగా వ్రాయబడుచున్నది. వీరు రచించిన సూఫీ వేదాంతగ్రంథమందు వీరి జీవితము సంగ్రహముగా నిట్లు వ్రాసిరి,

—♦ స్వీయము ♦—

క. ఆమొహియుద్దీన్ బాద్షా
నామ మహాయోగి కగ్రనందనుఁడను నా
నామహితాగమ హిత వి
ద్యామత "ఉమ్రాలిషా" మహాకవి నేనున్.

సీ. రచియించినాఁడ విభ్రాజితదివ్యప్ర
బంధముల్ పది కావ్య బంధములుగ
వ్రాసినాఁడను కల్పనాసక్త మతి పది
నాటకంబులను కర్ణాటఫక్కి
కూర్చినాఁడను కళాకోవిదుల్ కొనియాడ
నవలలు పది నవ నవల లనఁగ
తెలిగించినాఁడ నుద్దీపితాఖండ పా
రసి కావ్యములు పది రసికులలర

తే. రసము పెంపార నవధానక్రమమునందు
ఆశువులయందు పాటలయందు కవిత
చెప్పినాఁడ నుపన్యాస సీమ లెక్క
యువని "ఉమ్రాలిషాకవి" యనఁగ నేను.

ఉ. రాజులఁ జూచితిన్ సుకవిరాజుల నోర్చితిఁ జేతుమ్రోయ రా
రాజుల నోలగంబుల విరాజితపండిత సత్కవీంద్ర వి
భ్రాజిత మాలవీబిరుద పట్టములందితి యూనివర్సిటిన్
దేజముమీఱ సభ్యుఁడనయితిన్ మతబోధకుఁడైతిఁ గ్రమ్మఱన్.

ఉ. వ్యాసములున్ విమర్శనలు భావకవిత్వరసైక చారు వి
న్యాసములున్ మతాంతరమహాపరివర్తన తత్త్వరూపకో
పాసనముల్ పురాణములు వ్రాసితి భారతభూమి నే నుప
న్యాసము లిచ్చుచున్ దిరిగినాఁడను "ఉమ్రలిషా" కవీంద్రుఁడన్.

ఉ. వేలు రచించి విద్యలను బెట్టి గడించితి పారితోషికా
ద్యాళిని వేయినూట పదియార్లను సింహతలాటముల్ మహా
ఖిలిత సత్కలోకనక విశ్రుతముల్ జయభేరిమ్రోయ హిం
దూల వనీసటత్కృకవి తండము లేమిటి లెక్క మాకడన్.

సీ. సాధించితిని యోగసాధనంబులు హేమా
గము పెక్కు పటని చక్కాడియాడి;
బోధించితిని జ్ఞానసాధనక్రమములు
చెవినిల్లుగాఁ జెసి చెప్పిచెప్పి;
సవరించితిని పెద్దసారస్వతంబును
శబ్దశాస్త్రంబులు జదివిచదివి;
చూపించితిని రాజ్యలోపంబు లాంగ్ల ప్ర
భుత్వంబు మూంగర మోపి మోపి,

తే. ఇప్పుడప్పుడె వలుబడియేండ్లపైన
దాఁటిపోయెను వయసు నీనాఁటికైన
శాంతి గలుగదు నీకశాభ్యాంతమంచు
జీవితము తెన్ను సుడిబోవు నావబోలు.

మ. వను నీజ్ఞానమహాసభాసదులు నానందాన నర్తించి 'ఆ
దిని మీపూర్వపితామహుల్ గురువులై దివ్యత్వమేపారఁగా
ఘనవిజ్ఞానకళాప్రవృత్తి ప్రజహృత్కాంతారముల్ నింపి రా
మని మీ రాకృతి బోధసేయఁదగు 'ఉగ్రమాలీష' భాషాగతిన్.'

మ. అని నెయ్యంబునఁ గోరఁగావిని మహాహర్షంబు సంధిల్ల నా
నని యీ జ్ఞానమహాసభాకథన మత్యంతంబు కష్టంబు పే
దిని సంసారనిమగ్నమానసులు వర్ధింపంగ సాధ్యంబు గా
దని యున్నంత తెలుంగ సేతునని నే నారంభమున్ జేసితిన్.

ఉ. భారతదేశ శాసనసభా సభ్యత్వపదంబుఁ జేం వేఁ
గోరఁగ జ్ఞాన సభ్యులు నకుంఠితదీక్ష జగంబు మెచ్చఁగా
భూరితప స్సమాధి తమ బుద్ధిని నిల్పి జయంబుఁ దెచ్చినా
రారయ జ్ఞానశక్తికి సజాండము కంపిలుచుండు జూచితే.

చ. కవిత తెలుంగనట్టి పృథు కాలము వ్రాసితి పుస్తకంబు లా
కవిత తెలింగి వ్రాయుటకు గంటము రాదు నుపన్యసించు నా
దినముల విద్యతోఁ గలసి తృప్తిఘటించెడు వాని నిప్పుడో
అవము నుపన్యసించుటకు లజ్జఘటించెడు నేమిచెప్పుదున్.

శా. ఢిల్లీ హైందవకాలేజిసభ సూక్తిన్ బ్రాతివిధ్యంబు సం
ధిల్లన్ జేసి సుహృత్సతోజ్జ్వలకళాధౌర్యంబు రాజిల్ల వి
ద్వల్లోకంబున రాజకీయ సకల నాట్యాసారపారంగతిం
జెల్లన్ వేట్కను నిర్వహించుమను నే నీగ్రంథమున్ *వ్రాసితిన్.

ఉ. ఏను హిమాలయంబుపయి కెక్కి తపస్వులఁ జూచి వారి వి
జ్ఞానములన్ గ్రహించి విజనంబగుచోట రచించినాఁడ నా
నా నవ కావ్యమార్గము లనంతముగా హృదయాంతరంగ వి
జ్ఞానము విశ్వరూపముగఁ గన్పడునట్లు దృశంబు మార్చుచున్.

శా. నాలోనున్నవి నేనుజూచినవి విజ్ఞానంబులై లోకమం
దాలోకింపఁగ రాని యీ యమరవిద్యాతత్త్వమర్మంబు లం
దేలోటున్ జనియింప దీశ్వర రహస్యైకైక మీమార్గ మే
మేలా దాచెదమంచుఁ జెప్పితిమి మీరద్ధాత్ములై తేరఁగన్.

కం. మా తాతయు మా తండ్రియు
ఖ్యాతిని ఆ శైలలీ మహాగురువర వి
ద్యాతత్త్వము నేర్చిరి త
ద్రీతుల వివరింతు యోగరీతులు తెలియన్.

— ఆ గ్బ రాం బ —

శా. ఆ ఢిల్లీనగరాంగ్ల శాసనసభాధ్యక్షత్వ మర్థింపఁ డం
చాడన్ నేను కృతార్థుఁడై జనిన నాకై వచ్చి ప్రాణంబులన్
వీడెన్ నాసతి ఆగ్బరాంబిక చలత్ విద్యుల్లతిన్ బోలె ; యీ
నాఁడే నత్రులు 'గోరి' పై విడుచుచు న్వర్తింతు నిర్జీవినై.

ఉ. ఏను రచించినట్టి కృతు లెన్నఁటినో విని తల్లి ; తండ్రి నా
నా నవనాటక ప్రకరణంబులు నాఁడగ జూచినారు, ఢి
ల్లీ నగ రాంగ్లభాంతమహీధవ శాసనసభ్య సత్పదం
బానఁగగాంచి 'ఆగ్బ' రమరాలయమేఁగె వెలుంగుచుక్కలై.

* సూఫీవేదాంతదర్శనము.

శా. ఎన్నోబాధలు బొందుచుండియు [illegible] ధర్మాచర[illegible] యా
పుణ్యంపుఁగని అగ్బారేఁగ [illegible] నా
ర్థి న్నిఁద్రించఁగ బోయిన ట్లిఁక [illegible] స్వాంత సం
ఛన్నాస్మన్నినిషిద్ధజీవిత మహాహా ఔన్నినా ప్రాంజలిన్.

సీ. ఏమాట చెప్పిన నెదురాఁడగా లేదు
పరమసాధ్వీత్వంబు బరలుకతన
ప్రాణాల నర్పించి పరిచర్యలను జేసె
పరమహర్షంబు మంఁచరను నిలువ
కలిమిలేములను నొక్కటిగాఁ గణియించె
నిత్యకల్యాణంబు నెలకొనఁగ
ఏవురు కొడుకుల నిద్దరు కూఁతుల
ననిశంగా డివించు నాత్మశాంతి

తే. ప్రతిదినంబు చదువు ఖురాన్న మాజు
కాచశీలాన వలువది వత్సరములు
ధరణి జీవించి స్వర్గాన కరిగె అగ్బ
రాంబ దివిజాలు నీరాజనంబులిడఁగ.

ఉం. పరమపవిత్ర యీ కలది పండితురాలు నితాంత సత్యసం
భరిత రసాత్మక ప్రకృతి వడ్డికిబారెడు ప్రేమమూర్తి సుం
దర సముపాసితం బయిన ధర్మపథంబును సంతరించి యీ
శ్వరునెద నగ్బరాంబ కడు ప్రార్థనసేయుచు నెల్లవేళలన్.

శా. పల్లెన్ బుట్టిన ఢిల్లిలో బ్రిటిషుసామ్రాజ్యంబు పాలించు వా
రెల్లన్ వచ్చి సమాధిజేసిరి భవన్మృత్యున్ విచారించి యో
ఫుల్లాబ్జానన ‘అగ్బరాంబిక’ భవత్పుణ్యంబు దేశాల రా
జిల్లన్ విచ్చిన కుండఁబోలె కస నే జీరాడుచున్నా నిటన్.

చం. హృదయము ముక్కలౌనటుల నేడ్చుచుఁ గన్నులనీరు కాల్వలై
చెదరఁగ నిమ్నలోకములఁ జేరుటకంటె సమాధితోంటి నీ
సదనము జేరు మార్గము విచారణజేయుట లెస్స యైహి కా
స్పద విభవానుషంగ భవబంధము వాసిన నిన్ను చూడఁగన్.

శ్రీ కవిగారు యిస్లాం మతస్థులు. వీరి మాతృభాష ఉర్దూ. ఆంధ్రభాష మాతృభాషగా కానివారు తెలుగున సరసకవిత్వముఁ జెప్పినవారు ఈ కవిగారొక్కరే. వీరు రచియించిన మహాభారత కౌరవరంగ మను నాటకమున —

" నాటకముల్ ప్రబంధము అనంతముగా రచియించి వాణి కా
వ్యాటవి భావవీధుల విహార మొనర్చి జయధ్వజంబు వా
గ్వాటిని నిల్పినట్టి జనవిశ్రుతు ఉంరలీషా కవీంద్రుడున్... "

అని వ్రాసిరి.

వీరు రచించిన గ్రంథము లేబదివర కున్నవి. శ్రీ కవిగారు తమ శిష్యులకు దర్శన మిచ్చుటకై నరసాపురము (పశ్చిమగోదావరిజిల్లా) వెళ్ళి అచ్చట ది 23 జనవరి 1945 వ నాటి సాయంత్రము 5 గంటలకు దివి నలంకరించిరి. వీరి భౌతికదేహమును పిఠాపురముఁ దెచ్చి 24 వ తేదీ సాయంత్రము రైలుస్టేషను వద్ద నున్న వారి ఆరామములో సమాధి చేసిరి.

పీఠిక

శ్రీ ఉమర్ అలీషా కవిగారి సతీమణి అక్బర్ బీబీగారు ఒక మహా పతివ్రత చరిత్ర వ్రాయుమని కవిగారిని కోరగా. వారు 'అనసూయాదేవి' చరిత్రను నాటకముగా 1918 వ సంవత్సరమున వ్రాసి ముగించిరి. శ్రీ కవిగారు ఆధ్యాత్మిక విజ్ఞాన మహాసభ (జ్ఞానసభ) కు ఆచార్యులై ధర్మము ప్రబోధించుచుండిరి. వారి శిష్యులలో పెక్కురు జ్ఞానసభాసభ్యులకై ఒక నాటకము వ్రాయుమని కోరగా 'కళ' నాటకము 1932 వ సంవత్సరమున వ్రాసిరి. ఇది శ్రీ కవిగారు వ్రాసిన నాటకములలో ఆఖరిది. పెక్కు ఇతర గ్రంథములతోపాటు ఈ నాటకములకు కూడా వారి జీవిత కాలమున అచ్చుపడు భాగ్యము లేకపోయినది. 'కళ' నాటకము 1941 వ సంవత్సరమున ఢిల్లీ ఆంధ్ర సంఘమువారు Sir A. P. పాత్రోగారి ఆధ్వర్యమున ఢిల్లీలో ప్రదర్శించిరి. ఇందు పాటలు ప్రత్యేకముగా వ్రాయబడినవి. వాని సందర్భానుసారముగా వానిని చేర్చి ప్రకటించినాము.

అనసూయాదేవి, కళ, ఈ రెండు నాటకములు ఒకే సంపుటిగా ప్రకటించినాము. ఈ గ్రంథము ముద్రణకై ఈ దిగువ పేర్కొనిన జ్ఞాన సభాసభ్యులు ధనసహాయము చేసిరి.

శ్రీమతి అల్లూరి సత్తెయ్యమ్మగారు
శ్రీ తమిరి నారాయణమూర్తిగారు
శ్రీమతి కపిలవాయి రమణమ్మగారు, వారికుటుంబము.
శ్రీమతి భూడావర్జుల వీరభద్రమ్మగారు
శ్రీ ఈవస వీరాస్వామిగారు

వీ రెల్లరకు మా కృతజ్ఞతాభివందనములు.

ఈ గ్రంథ ప్రచురణయందు తోడ్పడిన శ్రీ కవిగారి బాల్య స్నేహితు లగు కవిరాజహంస శ్రీ వోలేటి పార్వతీశ్వర కవిగారికి మా కృతజ్ఞతా పూర్వకము లగు వందనములు.

శ్రీ సరస్వతీ ముద్రాక్షరశాలాధిపతు లగు శ్రీ అద్దేపల్లి నాగేశ్వర రావుగారు ఓర్పుతో శ్రద్ధాభక్తులతో ఈ గ్రంథములు ముద్రించి యిచ్చిరి. వీరికిని మా అభివందనములు.

పి ఠా పు ర ము
19 — 6 — 1951

మ దీ న్ క బీ ర్ షా
వారణాశి సత్యనారాయణ శాస్త్రి

కా ర్య ద ర్శు లు
శ్రీ ఉ మ ర్ అ లీ షా క వి
గ్రంథ ప్రచురణ సంఘము.

—

ఇందు వచ్చు పాత్రలు

పురుషులు

1. అత్రి
2 బ్రహ్మ
3. విష్ణు
4. మహేశ్వరుడు
5. నారదుడు
6 భైరవుడు
7. విటుడు
8 శిష్యులు

స్త్రీలు

1. అనసూయ
2 గంగ
3. సర్మిక
4. లక్ష్మి
5. సరస్వతి
6. పార్వతి
7. విలాసిని
8. నాట్యాంగనలు

అద్వితీయ పరబ్రహ్మ మధ్నిగాగ
అందు మొదటితరంగమై యలరి వెలయు
నా మహాత్మ్యపుస్వామి నే నాత్మయందు
దలతు నైహికాముష్మిక ఫలములకును



భక్తి ఆ శైలలి గురువరుని దలచి
శ్రీ మొహియుదీన్‌బాషా మహామహుండు
సతపవిత చాన్బియాంబ నా పితరులగుట
వారి పదములు కర్పింతు వందనములు.

అనసూయాదేవి



నాంది

చం. ఎవనివిశాలరూప మణు ♦ వేని నజాండమునింపి కాలమై
కవి కవితల్ రచించుటకుఁ ♦ గాని యతీంద్రియమ్మై రసాత్మక
ప్రవిమల ప్రేమసాగర త ♦ రంగ సుధా సముపాసితంబునై
తవులునో, వాని తేజము స ♦ తం బిడుఁగావుత మీ కభీష్టముల్.

సూత్రధారుఁడు — (ప్రవేశించి) నటీ యిటు రమ్ము.

నటి — (ప్రవేశించి) నాథా! ఏమి సెలవు.

సూత్ర — ఈదినమున మనమేదేని యొకమహానాటకము ప్రదర్శింపవలయును.

నటి — అందుకేనా యీ మహాజనము వచ్చి నిరీక్షించుచున్నారు!— కాని —

ఉ. నాటకముల్ కవీశ్వరు ల ♦ నంతముగా రచియించినారు నా
నాటికి వానిరమ్యతయు ♦ నాదరణంబును జారిపోయె నే
నాటక మాడినన్ జనులు ♦ నవ్వుదురో యవె వన్నె కెక్కు; ప
య్యాటలు నాట్యరంగముల ♦ నాఁచికొనెన్ మఱి చెప్పనేటికిన్.

సూత్ర — అగు నగు నది కాలపరివర్తనము. కాని,

తే. గీ. బెళుకురా ళ్ళున్న రత్నాల ♦ వెలలు పోవు
కులట లున్నఁ బతివ్రతా ♦ కులము పోదు
దొరువులున్నఁ బుష్కరిణుల ♦ పరువుపోదు
ప్రహసనము లున్న నాటక ♦ ప్రతిభపోదు.

నటి — ఇవ్వు డేనాటక మాడి యీ మహాజనుల రంజింపఁ జేయు వలయును?

సూత్ర — తే. గీ. పాపములఁ బాపఁగల పతి ♦ వ్రతలకథలు
సుధలఁగురియఁ బ్రదర్శించి ♦ చూపి రూప
కప్రకృష్టత నిలుపు మా ♦ కమలనయన
ప్రహసనంబుల వంచింప ♦ వలెన వేరె?

నటి — అట్టిరూపక మేమున్నది?

సూత్ర — లేక యేమి? వింటివిగదా!

ఉ. అత్రి మహాతపోమహితుఁ ♦ డై యనసూయఁ బతివ్రతాలసత్
గాత్రినిఁ గూడియుండఁ ♦ ద్రిజగంబుల పాలకులౌ త్రిమూర్తులన్
బుత్రులఁ జేసి యామె తన ♦ పూతసతీత్వముచాటె నట్టి చా
రిత్రము నాటకంబు ఉమ ♦ రే యలిపాకవి వ్రాసె నెచ్చెలీ.

నటి — మహాభాగ్యము.

ప్ర థ మా ం క ము

••••○◯○••••

రంగము — అత్ర్యాశ్రమము

(అనసూయ చెలికత్తెలతోఁ బ్రవేశించి యుండును.)

అన — చెలులారా! ఈవన మెంత మనోహరముగ నున్నదో చూచితిరా!

సీ. పృథువారిపూర వ్యా • రిత వద్మినీ సము
జ్జ్వల సరోవరము లా • వంకఁజూడు
లలిత సస్యశ్యామ • లంబై ప్రసూన సం
ఛాదితంబైన యా • చక్కఁజూడు
నానావిహంగ వి • తాన మంజుల కల
స్వన సుధా ధామ మా • వైపుఁజూడు
వివిధమృగార్భ క • వితతి మేపుచుఁబోవు
జంతుసంతాన మా • పొంతఁజూడు

తే. గీ. ఆలమందలు బట్టియ • లవిగొ చూడు
అడవినెమ్మిలు కోయిల • లవిగొ చూడు
అబ్జములఁ దుమ్మెదలరొద • లవిగొ చూడు
హాయి నిడు గంధవాహంబు • లవిగొ చూడు.

చెలి — చెలీ! అనసూయా! నీవును, త్రిలోకపూజ్యుఁడైన నీభర్త అత్రియును నెందున్న నాప్రదేశము పవిత్రమును, రమణీయమును గాక మరెట్లుండును!

తే. గీ. పృథుతపోధనుఁ డత్రి వ • విత్రచరిత
నీవును సతీమతల్లివై • యొసఁగె దమ్మ

మీకు లంకచోటును బచ్చ ♦ తోరణములు
సత్యకళ్యాణములకును ♦ నెలవు గాదె!

అన — ఇవి మీ ప్రియవచనములు.

చలి — అనసూయా! మన మాకాసారతీరమున, ఆపొన్నగున్నల మాటున, ఆ లతావితానములచెంతకుఁ బోయి హాయిగా పాటలు పాడుకొందము రమ్ము.

అన — నడువుఁడు.

చలి — ఏలా! ఇచ్చట లేని యందమచ్చటఁ గలదా? అంతదవ్వు పోయి వనకుంతములతో మన అనసూయ యేమైన వియ్యము లంద వలసియున్నదా?

అన — (తనలో) నాకు బిడ్డలు లేరని యీచెలికత్తె నన్నెత్తిపొడుచుచున్నది. అగు నది నిజము.

చలి — అది గాదు. ఇది మనోజ్ఞమైన వసంతకాలము. మానవ జీవితములో నిట్టిపవిత్రసమయములెన్నో అన్నప్పుడు రానేరవు. కావున మనమందర మాప్రదేశమునఁ గూర్చుండి హాయిగా పాటలు పాడుకొని యానందింతము; రండు.

అన — ఆనందము ముందు హృదయములో నుండవలయును. లేకున్న నీప్రకృతిసౌందర్యము లెన్ని యున్న నేమి ప్రయోజనము.

చలి — అది గాదు. ఈహృదయ మెటు మరలించిన నట్లు మారు నను తాత్త్వికుల దృక్పథ మనృతము గాదు.

అన — అగును గాని, అట్టివినోదములు వెలిబుచ్చుకాలము మనకు చిన్ననాఁడే కూకటివేణితో సాగి కాలగర్భమునఁ గలసి యంతరించిపోయినది. ఇఁక మన కాయానందము స్వప్నప్రాయము.

చలి — కావచ్చును. కాని, యిది యొకరయానందము.

అన — అగును. కాలనాథుఁడు వయస్సను కుంచెతో మనశరీర

ఫలకమునం బెన్నెన్ని మార్పులు, ఎన్నెన్ని రంగులు, ఎన్నెన్ని కళలు దిద్ది యౌవనమును నిత్యస్థాయిగా ప్రసాదించినావు! కాని యిదియును మార్చివేయును.

చెలి — నిన్ను మార్చినాఁడేమో! [illegible] నేను చిన్ననాఁడున్న పూవపిందెవలె నేఁటికి నొక్కలాగే యున్నాను.

అన — అట్లనఁ జెల్లదు. మరాళము! నిన్నటికోరకము నేఁడు లతాంతములై విరిసి సౌరభముల వెదజల్లుచున్నది.

చెలి — అగును. నీవీవనములోఁ బ్రవేశించునప్పు డున్న యానంద మిప్పుడు లేదు.

అన — (స్వ) ఈమె నామనోగతము నెంత సెల్లు గ్రహించినది!

చెలి — ఈయనసూయ సంతతి లేదని లోలోన విచారించుచున్నది. సరే. (ప్ర) అనసూయా! నీవిట కూర్చుండుము. మేము నాట్యము చేసి యీవసంతుని నలరించెదము. (అని నాట్యము సేయుచు)

తే. గీ. బ్రతికినన్నాళ్ళు హాయిగాఁ ♦ బాట లాట
లందుఁ గాలంబు గడిపి దే ♦ హంబు విడిచి
పోవుటే లెస్స; లేమి ని ♦ ర్లోప కేడ్చి
బెంగలను గ్రుంగి క్రుంగి జీ ♦ వింపరాదు.

2 చెలి — అగు నావంకఁ జూడుము.

తే. గీ. తాటిచెట్టును జువ్వి పా ♦ దపము నిండు
మైత్రిఁ గౌఁగిలించినది; యా ♦ మాద్కి మగువ
ప్రియునిఁ దమిఁగూడి వింత జీ ♦ వితముతోడ
కులుకుచుండును కలిమిలే ♦ ముల సహించి.

1 చెలి — అందఱికన్న నాఁడువాండ్ర దే నిషిద్ధజీవనమని తోఁచు చున్నది.

అన — అట్లనఁ జెల్లదు. సతికిఁ బతితోడిదే లోకము.

చెలి — అట్టులైన వారికి లోకమే లేదు.

తే. గీ. జాబిపంక్తులను గొఱుకుచు ♦ రామచిలుక;
మావిచివురుల మెసవి జొం ♦ పములదాగు
కోకిలంబును; సుమముల ♦ కొఱకు నెమకు
భ్రమరము; వసంతవీధి మా ♦ ర్గశ్రమంబు
దీర్చుకొని యేఁగి మదనుని ♦ గూర్చి పాడి
విశ్వమోహనరాగంబు ♦ వెలువరించి
విశ్వమంతయుఁ గరగించి ♦ వినుతిఁ గాంచు
అట్టియానంద మున్నదే ♦ యతివలకును?

అన — అది యానంద మని యెట్లుచెప్పఁ గలము. అందుఁగూడ బానిసత్వ మున్నది.

తే. గీ. కేకి పురి విప్పి యాడుచు ♦ నాకసమున
మేఘమాలికకై చూడ్కి ♦ మెలపు నదిగో
చాతకము పయోధరముల ♦ సడి యెఱింగి
తెక్క లల్లార్చి వానకై ♦ మ్రొక్కుఁ గంటె!
సరసిలోపల వికసించు ♦ సారసంబు
సౌరభంబుల విలిచి ♦ భాస్కరుని బిలుచు
ఎవరు హృదయేశునెదను నే ♦ వింపకుంద్రు?

అత్రి — (ప్రవేశించి) అదిగో అనసూయ చెలికత్తెలతో నిందు విహరించు చున్నది.

అన — (సమీపించి) నాథా! మీపాదపద్మములకు మీ దాసినగు నేను నమస్కరించుచున్నాను.

చెలి — స్వామీ! నమస్కారములు.

అత్రి — అనసూయా? నేను వచ్చి నీకా యాటపాటల కంత రాయము కల్పింపలేదు గదా!

అన — లేదు.

సీ. వీణ వాయించిన ♦ గానంబు చేసిన
ప్రియ నీవు మనసార ♦ వినుటకొఱకె;
కథలు చెప్పిన, సుధా ♦ మధురోక్తి నెకసెక్క-
మాడిన నీ వల ♦ రారుకొఱకె;
తూగుటుయ్యాలలపైఁ ♦ దూఁగిన, విరిసరుల్
గ్రుచ్చిన మది నీవు ♦ మెచ్చుకొఱకె;
దాఁగుడుమూతలఁ ♦ దరులఁ గొమ్మచ్చులు
నాడ, నాతోడ నీ ♦ వాడుకొఱకె;
తే. గీ. అద్దమునఁ దోచు ప్రతిబింబ ♦ మట్లు సతము
నేను నీలోన లీనమై ♦ నిన్ను చూతు
నిన్ను నాలో లయ మొనర్చి ♦ నిన్ను చూతు
నీవె తక్క నాకేదిలే ♦ దీజగాన.

అత్రి — దేవీ! ప్రియురాలవైన నీశీల మతి పవిత్రమును, మహనీయము నైయున్నది.

అన — అది తమ దయావిశేషము (అని తలవంచును).

అత్రి — దేవీ! నీవు నేఁడేల ఖిన్నురాలవై యున్నావు?

సీ. పున్నమచంద్రుని ♦ బురుడించు మోమున
మిన్నని నవ్వువెన్నెల ♦ నినిచదీవు
గంగాఝరీ పము ♦ త్తుంగ తరంగ సం
గతులతో నీ పాటఁ ♦ గలపె దీవు

[illegible] ♦ [illegible]
[illegible] ♦ ప్రాపు నీవు
[illegible] ♦ [illegible]
బలుకుల వియ్యంబుఁ ♦ గలపె దీవు
తే. గీ. స్వచ్ఛమగు కులశీల సం ♦ పదలఁ బొదలి
బున్ని [illegible] ♦ బొమ్మ వీవు
[illegible] ♦ సాధ్వి వీవు
ఈవె అనసూయ! అనసూయ ♦ వే నిజంబు.

దేవీ! నీవగవునకుఁ గారణమేమి?

అన — నన్నీ చెలికత్తె లేమేమో యెకసెక్కెములు చేసినారు.

అత్రి — అది యేమి?

అన — నేనెంతో యానందముగా ఈవనమునఁ బ్రవేశించితిని.

అత్రి — సరే నీవెప్పుడు నానంద దేవతవే కదా!

అన — అంత నాచెలికత్తెలు మాటలలోఁ బెట్టి "యీవనశకుంతములతో నీవేమైన వియ్యములందుటకువచ్చితివా!" అని నన్ను యన్యాపదేశముగా నాకు బిడ్డలు లేరని యెగతాళి చేసినారు.

ఉ. పిల్లలు వాకిటన్ మనల ♦ వేడుకఁ జూడఁగ నోచుకొంటినో
యుల్లము తల్లడిల్లఁ బ్రియ ♦ నోమ్ముఖనాథుని గొడ్డురాలనై
వల్లభ! యీఁడుపుట్టునకు ♦ భాగ్యము బిడ్డలుగారె ప్రాయ మె
న్నాళ్లిటులుండు నీబ్రతుకు ♦ నన్ గతు లుండు నె యెన్నియుండినన్.

అత్రి — దేవీ! నీవు చెప్పినది నిక్కము. నాకును, ఈచింతయే చిరకాలమునుండి హృదయము వేధించుచున్నది. కాని యీదుర్గతి నన్ను కదా బాధించును?

అన — అట్లందురేల? నే నర్ధాంగిని గానా!

అత్రి — అర్ధాంగి పుణ్యము పంచుకొనుటకే గాని భర్తపాపము పంచుకొనుటకుఁ గాదు.

అన — సరే సంతానమహాపుణ్యము నన్నుఁగూడఁ బొందఁ జేయును గదా!

అత్రి — ఆహా! సందేహమేమి; నీయట్టిపవిత్ర చరిత్ర లట్లభావింతురు.

అన — నాథా! ఏమట్లంటిరి? ఆఁడుపుట్టువు పుట్టిన ఏ స్త్రీయైనను సుతులను బడయఁ గోరకుండునా!

అత్రి — అమాయకురాలా! అట్లు గడిదేరినవా రెందరు లేరు.

తే. గీ. సుతులఁ గని వారి సొంపును ♦ జూడలేక
చేతులారఁగఁ జంపి వే ♦ సినది గంగ
పాపభీతి యుండదు స్త్రీల ♦ కేపనైన
నిట్టి చేతురు స్వాతంత్ర్య ♦ మిచ్చిరేని.

చెలి — (స్వ) ఆహా! అత్రీ! స్త్రీస్వాతంత్ర్య వాదులపై నెంతదెబ్బ కొట్టితివి! నా వితండ వాదసిద్ధాంత మను మృద్భాండము నీవాగ్దండమున ఢం అని బ్రద్దలై పోయినది.

అత్రి — దేవీ అపత్యార్థమై మన మీశ్వరుని బ్రార్థింతము రమ్ము.

అన — చిత్తము. (హారతి వెలిఁగించి),

శా. ఆపద్బాంధవ దీనరక్షక త్రిలో ♦ కాధార సర్వాత్మకా
ఆపోరూప యనంతతేజ భవదీ ♦ యంబైన విజ్ఞానమే
రూపానన్ లభియించు మాకుఁగరుణా ♦ రూపుండవై చూపవే
శాపాడన్ వరమీయవే యిదుమలన్ ♦ గారింపవే యీశ్వరా.

అత్రి — దేవీ మనకు సంతతి కలుగువఱ కిచ్చటనే తపమాచరింతము.

రంగము — శ్మశానము

(భూతప్రేతాది రాక్షస పిశాచములు మధ్యమున పాపదేవతతో గంగ ప్రవేశించి యుండును.)

పాప దేవత — పాపం

గంగ — హాహాస్మి (అని మూర్ఛిల్లి లేచి) హతవిధీ నీవిధాన మనుల్లంఘ్యము, అప్రతిహతము, అనన్య సామాన్యము. అలోకవిపరీతమైన నీచర్యము లగ్నికంటె, విషముకంటె, కంటకావృతమహాంధకార దుర్గంధ పంక సంకలితకాల కూపాంతరముకంటె, దుస్సహము, దుర్భరము, భయావహము. నేనింక నిలువలేను. నాయొడలు కంపించి పోవుచున్నది. ఊపిరిపోవుచున్నది.

పాప — పాపం

గంగ — హాహాస్మి. అదే. అదే! పాపదేవత ఛాయారూపమున నావెన్నాడుచు పీడించుచున్నది. నన్ను పీల్చి పిప్పి చేయుచున్నది. జువ్విచెట్టు తాటిచెట్టును చుట్టి కబళించినట్టిపాపిని నానిలువెల్లఁగల్మషోపేతము గావించి యలయించు చున్నది. నేనింక భరింపలేను. ఆఁగలేను. నేల దొర్లిదొర్లి, కొండలెక్కి, బండలకుఁ దాకి, గోతులలోఁబడి నూతులలోనికి చావక సమయక వేగి విసిగి భూమి చుట్టి, గతి గానక, మతి చెడి వెతలపాలై ప్రాణత్యాగము చేసికొన నెంచి సముద్రమునఁ గూలినను నాకది మోకాలిబంటియే యగుచున్నది. ఇంక నేనేమి చేయుదును? నాకెయ్యది తెరవు? ఏది శరణ్యము? అయ్యో నాప్రాణములు కొట్టుకొనిపోవుచున్నవి.

మ. అమరత్వంబును, నాకలోకనిలయుం ♦ బాచంద్ర తారార్కమా
ర్గము, నానాకలుషాపహంబగు నదీ ♦ ప్రఖ్యాతియుం బోవు నిం
క మహాకాల జటాచ్ఛటాభరణ గం ♦ గాదేవి యాజన్మక
న్య మహాపూతచరిత్ర యంచు నను స ♦ న్మానింపఁబో రెవ్వరున్.

పాప — హుం.

గంగ — ఓక్షత్రకౌశికవాయురారా! నావిచిత్రచరిత్రమును చూచు చున్నారా! జహ్నుమహాపుత్రినైననేను సురశాపహతనై భిన్ననై దివ్యత్వంబు విసర్జించి మానవ స్త్రీజన్మంబున నవతరించి భారతకులప్రసూతుం డగుశంతనుని జెట్టబట్టి కాంచినసుతుల నేడ్వురను "అబ్బా! చెప్పం జాలను" అనుముద్దుబిడ్డల గొంతులు నులిమి,

ఉ. నిండిననీటిభాండముల ♦ నేలను మోదినరీతి బిడ్డలన్
జెండితిఁ బాపినైతి నిజ ♦ శీలముఁబూడిదలోనఁ బోసి యా
దండధరారిచేత యమ ♦ దండనపాలయితిన్ విముక్తి నా
కుండునె యీశ్వరుండు దయ ♦ నోమునె నన్నిఁక నెన్నఁడేనియున్.

పాప — హుం.

గంగ — హా! పాపము. తాపము. నేనింక జీవింపలేను. నాప్రాణములు మూర్ఛిల్లి పోవుచున్నవి.

శా. ఆసల్ వాసె, విశీర్ణమయ్యె తను వ ♦ త్యంతంబు జీవంబులుం
గాసిం జెందె శశంబు సింగవుగుహన్ ♦ బడ్డట్లు లీకాటిలో
వాసం బేర్పడె నీపిశాచములకున్ ♦ భక్షింపనా మాంసమున్
దోసిళ్ళన్ గొని త్రావ రక్తమిడుచుం ♦ దున్ నిత్య మర్ఘ్యంబుగన్.

పాప — హుం

గంగ — అమ్మా! అంత కన్నులెఱ్ఱఁజేసి నాపై నురుకఁజూచుట నీకుఁ జెల్లునా? అదిగో! పండ్లు కొఱుకుచున్నావు. వలదు. నీకిదే నమస్కరించుచున్నాను. పాపదేవతా! పొమ్ము. నన్ను విడనాడి పొమ్ము.

పాప — హుం.

గంగ —

తే. నావిషాదకథావిధా ♦ నంబుఁ జెప్ప
లేను, వ్రాయఁగ లేను, నా ♦ తోనె యీమ

హాగ్ని చల్లారవలయుఁ గా ♦ ష్టానుషంగ
మైన ధూమంబు శిఖ లీన ♦ మైన పగిది.

పాప — హాం.

గంగ — దుస్సహమైన యీపాపపిశాచవాలంకారములచే నామేను ముక్కలైపోవుచున్నది; నేనింక సహింపలేను. ఒడలంతయు దహించి కొనిపోవుచున్నది. ఆహా తాపము! తాపము! నాకింక నేదిశరణ్యము? ఏదికర్తవ్యము? ఓదుర్గా, ఓజగన్మాతా!

ఉ॥ భీతను పాపదేవతల ♦ వేదనకున్ విలపించు వేల్పుసం
జాతను, భూతలప్రణుత ♦ జాహ్నవిఁ బుణ్యనదీలలామ వి
ఖ్యాతను పాటిబోటిని గ ♦ దా ననుఁ గావఁగరాదె యోజగ
న్మాత! దయాప్రపూత! సుగ ♦ ణవ్రతసన్నుత దుర్గ మ్రొక్కెదన్.

(అని మూర్ఛిల్లును)

దుర్గ — (ప్రవేశించి)

తే. గీ. అఖిలకలుషంబు లుడుపు పు ♦ ణ్యాస్రవంతి
శివజటాజూట మెక్కిన ♦ సిద్ధకన్య
గగనమార్గానఁ గన్న యీ ♦ గంగ పాప
భీతయై యున్న నెవరికి ♦ భీతి గాదు.

ఈమె కురుకులపితామహుండగు శంతనుని బెండ్లియాడె యాతని వలనఁ గన్న యేడ్వురుపుత్రులను గొంపోయి గంగలోఁ గలపినది. ఆ యమానుషకృత్యమును జూచి నరసురయక్షరాక్షసాది జీవజాలంబులే కాక పంచభూతంబులు గూడ నేడ్చినవి. కాని, యీజగజంత కొకింత యేని గనికర ముదయింపలేదు. ఈపాపాణప్రాయ కీప్రాయశ్చిత్తము కావలసినదే. పాప మెవ్వాడును ననుభవింపక తీరదు.

తే. గీ. గర్భముల డింపుకొను జార ♦ కామినులును
కన్నబిడ్డలఁ జంపెడు ♦ కఠినురాండ్రు
పొందు యమబాధలకు మఱి ♦ మందు లేదు
పాపమున కెల్లరును భయ ♦ పడఁగవలయు.

గంగా! మూర్ఛిల్లితివేల లెమ్మా.

గంగ — (లేచి) నమస్కరించి (స్వ) సామాన్యజనదుర్లభమైన ఈ దుర్గ తన యవ్యాజకృపాకటాక్షమున సాక్షాత్కరించినది. నేనింక ధన్యనయ్యెదను (ప్ర) దేవీ! పార్వతీ!

చం. నగము శరీర మిచ్చి తన ♦ సామిని గొల్చిన లోకమాత, రే
బవలు వెలుంగు మంగళ భ ♦ వాని, భవార్తజనంబు పాలికిన్
భగవతి, నీదుపాదములు ♦ పట్టినఁ గట్టిడి కాలపాశముల్
తెగు నని వేదముల్ వలుకు ♦ దీన ననాథను నన్నుఁ బ్రోవవే.

పాప — హుం.

గంగ — (భయమునఁ గంపించి) దేవీ! రక్షింపుము. రక్షింపుము.

దుర్గ — (స్వగతము)

ఉ. స్వైరవిహారలైన నెఱ ♦ జాణలు భర్తలఁగూడి యాత్మసం
సారము లెంతొ దిద్దుకొని ♦ సంపదలన్ దులదూఁగజాల రే
పోరులొ పెంచి ఖేదముల ♦ ముంచి కుటుంబము కాపురంబులో
నీరముపోసికొందు రతి ♦ నిందలపాలయిపోదు రావలన్.

(ప్రకాశముగ) గంగా! భగినీ! నీకివ్వా డేమి కాలయును.

గంగ — ఈపాపదేవతలనుండి నాకు విముక్తిఁ గావింపుము, తల్లీ నీకిదే నమస్కరించుచున్నాను.

దుర్గ — ఓ భూత భేతాళాది పిశాచ సమూహములారా! ఓ పాప దేవతలారా! మీరెల్లరు పటాపంచలై తొలఁగిపొందు మీకిదే యాన!

భూతములు — హా! హా! హతోస్మి హతోస్మి పాహిమాం పాహి (అని పోవుదురు).

గంగ — ఆహా నేనింక చరితార్థనైతిని. ఈ శ్మశాన పిశాచము లన్నియు సూర్యరశ్మిచే మంచు తెర విడిపోయినట్లు మాయమై పోయినవి. నాపాపదేవత యీకాత్యాయినీ వరప్రసాదమున నేడు భస్మీభూతయైపోయి యుండవచ్చును.

పాప — హుం.

గంగ — హతోస్మి (అని దుర్గను కౌఁగలించుకొని) తల్లీ రక్షింపుము.

దుర్గ — గంగా! ఈదేవత నన్నుఁగూడ లక్ష్యపెట్టకున్నది.

గంగ — అయ్యో, ప్రణవస్వరూపిణివైన నిన్నే యీదేవత సరకుసేయ కున్నదియా?

తే. గీ. పాపకారిని ఘోరశా • పోపహతను
పాపపైశాచికక్రూర • వరితపాగ్ని
దగ్ధ నగు నాకుఁ గలదె క • ర్తవ్య మింక
నాశ లన్నియుఁ దెగి యుడు • గంటిపోయె.

దుర్గ — గంగా, సోదరీ! నీవిట్లు వాపోవవలదు. దేవతల సమారాధించి ప్రశాంతచిత్తవు కమ్ము (అని అంతర్ధానమై పోవును).

గంగ — (చేతులు మోడ్చి)

తే. గీ. దీనురాల ననాథను • దిక్కుమాలి
వేడుచుంటిని ముక్కోటి • వేల్పులార
వేల్పుటిల్లాండ్రులార! నా • వెతలఁ దీర్ప
రండు ప్రొక్కెద నిడెద నీ • రాజనములు.

[తెరపడును]

ద్వితీయాంకము

రంగము — కైలాసము

(బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు — సరస్వతి, లక్ష్మి, పార్వతులు — నారద వశిష్ఠులు ప్రవేశించి యుందురు.)

మహేశ్వ — నారదా! నీవు చెప్పిన అత్రి అనసూయల చరిత్రము మిగుల ప్రశంసనీయము.

విష్ణు — అగును.

ఉ. అత్రి మహాతపోమహితుఁ ♦ డైనను నాయనసూయ వానికిన్
క్షేత్రముగాపునన్ సిరుల ♦ చేఁ దులదూఁగి యిహంబు స్వర్గమ
ట్లాత్రముదక్కు సౌఖ్యముల ♦ హాయిగ వైదికకర్మ నిష్ఠుఁడై
చైత్రరథంబుఁ జేసె ముని ♦ సంతతికిన్ దనయిల్లు నిత్యమున్.

బ్రహ్మ — ప్రపంచమున నట్టిమహనీయులు లేకపోలేదు.

దౌవారికుఁడు — (ప్రవేశించి) దేవా! ద్వారమునొద్ద నొకయామె వచ్చి వేచియున్నది.

మహే — రమ్మని వచింపుము.

నర్మద — (ప్రవేశించి) దేవదేవులైన త్రిమూర్తులకును మహనీయులైన మహర్షులకును నమస్కారములు.

విష్ణు — నీపేరేమి?

నర్మ — నర్మద.

బ్రహ్మ — నీభర్త?

నర్మ — నేనవివాహితను.

మహే — తపస్వినీ!

మ. పడఁతుల్ పెండిలిగానివారలకుఁ ♦ గైవల్యంబు సిద్ధింపదన్
నుతులాలింపవె యొంటిమై నడవిలో ♦ నూఱేండ్లుపాసించినన్
బడయన్‌జాలరు మోక్షసంపదలు దాం ♦ పత్యంబునన్ గల్గు పె
క్కుడుమల్ ప్రాయికమైన దుఃఖములఁ బెం ♦ తే నొంది రాకుండినన్.

నర్మ — అయ్యో! నాకింకెయ్యది మార్గము.

వసిష్ఠుడు — తల్లీ! నీవు తిరిగి జగదభిముఖివై పోయి గృహస్థాశ్రమమును స్వీకరింపుము.

నర్మ — ఆ యిహాముత్రార్థఫలభోగమును నేనెట్లు స్వీకరింపఁగలను? అది వమనాన్నము గదా.

నార — అగును కాని స్త్రీలకు సన్యాసినీత్వము లేదు.

నర్మ — మాయామహితమైన సంసారమహాంధకారమున బడి పడఁతులందరు చావవలసినదేనా?

వసి — స్త్రీప్రకృతి భోజ్యము గాని, భోక్త గాదు.

నర్మ — సర్వక్రియానివృత్తి గలిగిన నేల జీవన్ముక్తి రానేరదు?

నార — స్త్రీలకు రాదు.

వసి — సాధ్వివై కైవల్యము చూరఁగొనవలయును.

నర్మ —

సీ. విషయేచ్ఛలను మున్గి ♦ విఱ్ఱవీగెడు ఘోర,
విశ్వసంసారంబు ♦ విడిచివిడిచి
ఎండవానల కాఁగి ♦ తిండితిప్పలుమాని
కష్టనిష్ఠురముల ♦ గడపిగడపి
సుఖదుఃఖముల రెంటి ♦ జోక్యంబు వర్జించి
నిర్వికల్పసమాధి ♦ నిలిచినిలిచి
ఊర్ధ్వదృష్టిని గగ ♦ నో పరిభాగంబు
కైవల్యపదమును ♦ గాంచికాంచి

తే. గీ. మనసు నిర్గుణార్చనకును ♦ మలపిమలపి
భావమునఁ గల వాంఛలఁ ♦ బాపిబాపి
చేసి యాత్మజిజ్ఞాసను ♦ జేసిచేసి
గడనఁ జేసిన తపమెల్లఁ ♦ జెడెనె నోహో,

వసి — నీవు పొరపడుచున్నావు.

మ. తపమన్నన్ వ్రతనిష్ఠలన్ సలిపి మం ♦ త్రధ్యానపూజావిధిన్
జపముల్ సేయుట గాదు గృహ్యమగు సం ♦ సారార్ణవంబీది యం
దుపవాసంబునొ భోగసంపదనొ యే ♦ దోరీతిఁ గాలంబు బు
చ్చి పరాత్మున్ భజియించుటే తపము స ♦ చ్ఛీలంబు చింతింపఁగన్.

నర్మ — పరమపూజ్యులైన మీయాదేశమును నేను శిరసావహించి తిరిగి భూలోకాభిముఖనై పోవుచున్నాను. నాకింకేమి గతి!

మహే — అనఁగా?

నర్మ — సర్వజ్ఞులైన మీరెఱుంగని దేమున్నది.

తే. గీ. తల్లి దండ్రి లేని ♦ తమ్ములు లేని య
నాథ నయ్యో నాకు ♦ నాథుఁ డెట్లు
వచ్చు? సొమ్ము లియ్య ♦ వచ్చినవారికే
పెండ్లి గాని నాకుఁ ♦ బెండ్లి యగునె?

నార — నర్మదా! నీవన్నది నిజము.

బ్రహ్మ — సృష్టిలో మానవులు వధూవరులై ధర్మార్థకామముల యథావిధి నెరవేర్ప వలయును గాని, యీ శుల్కదురాచారము లేల పెంచిరో తెలియదు. ఇంతకన్న మహాపాప మేమున్నది.

విష్ణు — స్వార్థపరులకుఁ బాపభీతి లేదుగదా!

మహే — నర్మదా! వరశుల్కకన్యాశుల్కముల బలిమిని గ్రహించిన వార లెట్టి యమదండనకుఁ బాల్పడి నరకాగ్నిం గాలుచున్నారో

[illegible] (అని [illegible]).

పర్వ — [illegible] మహేశ్వరా! వారనుభవించు[illegible] [illegible] మర్త్య [illegible] [illegible] [illegible].

నార — శంకరా! ఈరకమ విరాళకృద కేల చూపెదవు? ఆ వర కల్పములు పట్టు పాపాత్ముల కగపడును.

విష్ణు — వారనుభవించుచునే యున్నారు.

మహే — మీరింక కైలాసము విడిచి వెడలుడు. భూలోకమున నీకైవసు తొలుత [illegible] [illegible] [illegible]. నీకు ధన మక్కఱ లేదా

పర్వ — మహాప్రసాదము.

తే. గీ. [illegible] కబళింప • వచ్చునె; చిన్న
బుట్టచలె మంచుకొండను • మోయవచ్చు;
నూరి జెజ్జాన సేన్గులఁ • జొనుపవచ్చుఁ
గాని యువతి కన్న మత్తింటి • కాపురంబు.

(అని తిరోహిత యగుచున్నది)

తెరలో (మాంపాహి శంకరా మాంపాహి)

(అందఱును లేచి) యేమా యార్తనాదము!

విష్ణు — ఏమో తెలియదు.

బ్రహ్మ — నరకలోకము నుండి వినవచ్చుచున్నది.

విష్ణు — ఎవరో పాపాత్ములై యుండవచ్చును.

మహే — ఆ యార్తధ్వనులు చేయుచున్న దెవరో మా కెఱిఁగింపుడు.

గంగ — (తెరలో)

తే. సీ. తూలితల నెక్కి శిరజటా • జాలమునను
మునుఁగు కొనఁ దాల్చి దాగుదు • మూశిలాడి

విలపి విలపించుచుంట్టి నేనా • ఇలను నేను
గంగ యమునాదాని సరసాగ్ను • గాలుచుంటి.
దేవా! నన్ను నీ క్రమోలకు లాగికొనుము.

మహే — గంగా! నా త్రిశూలము నూతగాఁ జేసికొని నాయెదుటికి రమ్ము! నీకేమియును భయములేదు. (అని త్రిశూలము పంపును; గంగ పైకివచ్చి) దేవాదిదేవులారా నమస్కారము. జగజ్జనకులైన మీరంద ఱొక్కసారి దర్శనమిచ్చి రిక నా పాపపంకము లణగంటినవి. నేనింక ధన్యనయ్యెదను.

పాప — హుం.

గంగ — అయ్యో, యీపాపదేవత కైలాసమునకు వచ్చినను నావెంటాడించుట మానలేదు! ఏమి యీవికృతాకారము, ఏమి ఆరక్తసిక్తాంగకములతోడి భీభత్సరూపము. అయ్యో, ఎట్లు నాపైఁ బడఁ జూచుచున్నదో! ఎట్లు రూక్షారుణిశిలోలలోచనములతో జడిపించుచున్నదో! ఆఛాయారూపమైన మహాపిశాచము ఆఢాకిని ఆమూడుగాళ్ళ ముసలిముండ ముండవంటి తలతో, గరికపోచలవంటి శిరోజసూచికలతో వికారముగా త్రికాలములయం దొక్కనిముసమైన నన్నొడఁబాయక హుం హుమ్మని రోషభీషణ మహార్భాటములఁ జేసి నన్నుఁ బీడించుచునే యుండును. నాకింకేది కర్తవ్యము, ఏది శరణ్యము? ఓమహాదేవశంభో జగద్రక్షకా!

మ. గరళం బంగిటఁ బట్టినాఁడవు మహా • కాలుండవై; శూలివై
పురసంహారము జేసినాఁడవు; మరున్ • బూర్ణాహుతిన్ జేసినా
వరయన్ మూఁడవకన్ను విప్పి; చని రు • ద్రాస్థాణువై దక్షున
ధ్వరవిధ్వంస మొనర్చినాఁడవు నినున్ • వర్ణింపఁగా శక్యమే!

మహే — గంగా! నీకేమి కావలయును ?

గంగ — శంకరమహాదేవా! నా వెంటాడుచున్న యీపాపదేవతను నీ త్రిశూల ధారచే వారించి నన్నుఁ జరితార్థను జేయుము.

పాప — హుం.

గంగ — అదిగో.

మహే — అదియేమి గంగా?

గంగ — మహాదేవా! చెప్పఁజాలను.

దుర్గ — ఈమె శంతను సమాగమంబున సుతసప్తకమును గాంచి శమనున కర్పించినది. ఆపాతక మీరీతి నీమెను బాధించుచున్నది.

గంగ — అగును మహాదేవా! అగును.

పాప — హుం.

గంగ — అదిగో! ఎఱ్ఱగ నల్లగ కొఱ్ఱువలెఁ దలవిరియఁబోసికొని నోట నగ్నికణంబులు రాల భీకరాకారంబున వేయియేనుఁగులంత లావు, వెలగకాయయంత తలకాయ, చీపిరికన్నులు, మేఘగర్జనలవంటి యరపులు, మిక్కిలి మలీమసమైన రూపముతో వచ్చుచున్న ఆమహాకాళరాత్రి, ఆప్రళయకాల పుష్కలావర్తము, నేనుచూడను; ఆబాధపడలేను! నన్నది కొఱికి నాకడుపులో నిద్రించుచున్నది. హా! యమబాధ! బాధ! (అని మూర్ఛిల్లును)

మహే — గంగా! నీవేల భయకంపిత వయ్యెదవు? నాత్రిశూలముచే నీపాపదేవతను నఱుముఁజెద (అని ప్రయోగించును, పెద్దఅగ్నిమంటలు లేచును). గంగా! నీకు శాంతి చేకూరినదా! చూడు నీవెన్నాడుదేవత దగ్ధమైపోయినది.

గంగ — (లేచి) వది?

పాప — హుం.

గంగ — దేవా! అక్లే యున్నది.

విష్ణు — అగును.

మహే — ఇది మిగుల చిత్రముగ నున్నదే!

శా. అగ్నిన్ నీరము లార్చినన్, దపనుఁ డా ♦ యాకాశరంగస్థలిన్
భగ్నంబై ప్రళయంబు వచ్చినను, నీ ♦ బ్రహ్మాండముల్ విచ్చియు
ద్విగ్నంబుల్ దిగిభంబు లన్నియుఁ దమో ♦ విస్ఫూర్తి నల్లాడినన్
మగ్నంబందని నాత్రిశూల మకటా ♦ మాయించె దీభూతిమున్.

విష్ణు — శంకరా! నాచక్రమును ప్రయోగించి దీనినుక్కడంచి నీకమందానందమును సమకూర్చెద నుండుము. (అని ప్రయోగించును. అది తిరిగివచ్చి నిలుచును.)

గంగ — అయ్యో! నాకింకేమి శరణ్యము.

పావ — హుం.

గంగ — (మూర్ఛిల్లును).

విష్ణు — ఆహా! ఇది కడుంగడు చిత్రముగ నున్నది. అవక్ర పరాక్రమమున విక్రమించు చక్రము, దిక్చక్రముల నల్లలాడించి జీవనహారియైన చక్రము నేఁడెంత వాఁడిచెడి నేలఁగూలఁబడినది!

తే. గీ. ఉడు గణంబులు మింటిని ♦ విడువవచ్చు
పర్వతంబులు భూమిని ♦ వదలవచ్చు
అగ్నియుష్ణత్వమును బాసి ♦ యడఁగవచ్చు
కాని నాచక్రహాతి రిత్త ♦ గాదు నిజము.

అట్టిశక్తి నేఁడేమైపోయినది?

బ్రహ్మ — ఇదియేమి మాయయో ఇదమిత్థమని నిర్వచించుటకు సాధ్యము కాకున్నది. ఈవసిష్ఠాదుల కేమైనఁ దెలియునేమో.

వసి — సర్వజ్ఞుఁడును సర్వపాప నాశంకరుఁడైన యాశంకరుఁడును, సిథిలదానవలోక దారుణాగ్ని జ్వాలామాలికల నొక్కపెట్టునఁ జల్లార్చి లోకరక్షణార్థము బహువిధములఁ బదియవతారముల నెత్తి పదునాల్గు

భువనముల సంరక్షించు సౌజాత్మ్యశక్తి గాంచినను, చతుర్దశ భూవభోగతిరాశులయిన బ్రహ్మాండంబు లొక్కయుచ్ఛ్వాసవాయువుచే సృష్టించిన శివుడు తానింక మోహాంకించి యీమెపాపవిమోచన సేయ లేకపోయిన నింక నిది యొవరికి సాధ్యము?

ముగ్గురును — సాధ్యము గాదు.

నార — మీకు సాధ్యము గాదు.

ముగ్గురు — ఇంక నెవరికి సాధ్యము?

నార — కలదొకవ్యక్తి.

ముగ్గురు — నారదా? మాతో నెకసెక్కము లాడుచుంటివా?

నార — అటులైన నేను మాడిపోనా.

మహే — నామూఁడవకన్ను విప్పనిదేనా.

నార — వలదు. ఇక్కడ దక్షుఁడుగాని, మన్మధుఁడుగాని లేరు. ఒకవేళ నేఁక విప్పినను నీగంగను వెంటాడు పాపదేవతకు లక్ష్యములేదు.

విష్ణు — నారదా! ఇది యొవరివల్ల సాధ్యమగును?

నార — నేను మున్ను విన్నవించిన —

గంగ — (లేచి) నారదా! నాకది యొఱింగించి పుణ్యము గట్టుకొనుము. నారదా నీకుజోహారు సేయుదును.

బ్రహ్మ — అది యేదో చెప్పుము నారదా.

నార — అత్రియను నొక బ్రహ్మఋషి,

ముగ్గురు — అగును మే మెఱుంగుదుము.

నార — వాని యిల్లాలు అనసూయ,

మహే — అగును.

నార — ఆమె మహాపతివ్రత.

విష్ణు — అయిన నేమి?

నార — ఆమె తనపతివ్రతామాహాత్మ్యమున నీ గంగపాపవిమోచన మవలీలగాఁ జేయఁగలదు.

గంగ — నారదా! నిజమేనా నారదా! నాకేనో గతికల్పించుము. నీకిదే వేయివందనము లర్పించెదను నారదా!

బ్రహ్మ — ఏమి యీ నారదుని కల్లబొల్లులు! మాత్రమోలనే భయము దక్కి మాటాడుచున్నాఁడు.

నార — అట్లనఁజెల్లదు! నేను నిజమాడుచుంటిని.

విష్ణు — నిజమేనా ?

మహే — మావలనఁ గాని కార్యమా మానవమాత్ర సేయ సమర్థయగునా!

నార — ఆ సతిపాతివ్రత్య మహాత్మ్య మనిర్వచనీయము. అనుపమానము. అమోఘము. ఆమె సాధింపని పని యీచతుర్దశభువనములయం దుండఁ బోవదు. లేదు.

విష్ణు — అంత నిష్కర్షగఁ జెప్పనొప్పునా? యిది సాహసము గాదా.

నార — కాదు.

తే. గీ. సూర్యునిన్ దీపములు పెట్టి ♦ చూపినట్లు
నోటనాలుక కలదని ♦ నుడివినట్లు
ఆసతి పతివ్రతామహా ♦ త్మ్యంబు శుష్క
వాక్యములచేత వర్ణింప ♦ వశముగాదు.

ఆమె తేజ మట్టిది. అదియొక అపురూపమైన జ్యోతి.

బ్రహ్మ — ఏజ్యోతిర్మండలము తేజోజ్యోతిని గాంచి తలవంచుచున్నవో, చంద్రసూర్యాది తారాగణంబు లేపరతత్త్వ పదార్థము నవలోకించుటకై నిరంతరము నిజసత్త్వమునఁ బ్రదీపింపఁ బరిభ్రమించుచున్నవో, యేది సదసత్పదార్థములచే భేదింపఁబడక అవాఙ్మానస గోచరమై అగాధమై

అవ్యక్తమై వ్యక్తి స్వాతంత్ర్యముల కందరాని పరిపూర్ణ ప్రత్యగాత్మ స్వరూప స్వయంజ్యోతిరై ప్రకాశించుచున్నదో, అట్టి మా త్రిమూర్త్యాత్మకమైన శక్తిసన్నిధి చేదో పరకపాటి పతివ్రతను ఆమె మాహాత్మ్యమును తెగవర్ణింపుచుంటివి. ఇది నీకు మిగుల గర్హ్యమైన పనిసుమా.

తే. గీ. మణులరాశుల నల్లనిపూస ♦ మాట యేల
శరనిధులముందు సెలయేటి ♦ చాటు వేల
ఏమృగము కాలుమోపిన ♦ నేనుఁగడుగు
మించనోపు? నట్టుల మమ్ము ♦ మింతు రెవరు?

నార — నరే! నాకిచ్చట నధిక ప్రసంగమెందుకు? మీమాటలు మీకే తుద కుపసంహరించుకొనవలసి వచ్చును.

వసి — నారదా! ఏమి నీసాహసము. త్రిమూర్తులైన యీమహనీయుల కడ్డు దగిలి వాదించుటకు జంకకున్నాఁడవే. మహాపతివ్రతయైన గౌరి, ఆ లక్ష్మీసరస్వతుల నేలమరచితివి. వీరికన్న నాయనసూయ మిన్నయా?

నార — అగును.

సీ. పుట్టినింటికిఁ బతి ♦ పోమ్మనకుండఁగాఁ
బోయెను గౌరి వా ♦ పోయిపోయి
కనక కంకణములు ♦ ఘల్లు ఘల్లన లచ్చి
యిల్లిల్లు దిరుగాడు ♦ నిలువడి విడి
పలునోళ్ళలోఁ బడి ♦ పలురంగులై మాటి
రవ్వపాలయ్యె భా ♦ రతివధూటి
పుణ్యపాపంబుల ♦ మోయుచుఁ బొక్కుచు
పాంసులమై క్రింద ♦ పడియెధాత్రి

తే. గీ. ఇట్టులూహింపఁ బ్రతిసాధ్వి ♦ కేదొ లోటు
దోచుచుండెను; అనసూయ ♦ తోయజాక్షి
యందు నేలోటు పొడమద ♦ య్యతివమిన్న
మహిఁ బతివ్రతలకుఁ దల ♦ మానికంబు.

లక్ష్మి — నారదా! నీపొగడ్తల కేమి; ఇప్పుడు నర్మదా గర్వభంగ మైనదా?

సర — రేపు అనసూయా గర్వభంగము కూడ నగును.

నార — అది యసంభవము.

తే. గీ. ముక్కముక్కలుగా మిన్ను ♦ రక్కవచ్చు
దిక్కులన్నియు నొకమూలఁ ♦ ద్రొక్కవచ్చు
పంచభూతంబు లల్లలాఁ ♦ డించవచ్చు
కాని సాధ్వులఁ దాకన ♦ వ్వానితరము!

బ్రహ్మ — సరే చూచెదవుగాక!

సర — తప్పక ఆయనసూయా గర్వభంగము గావింపవలయును.

నార — వలదు; మీకే గర్వ భంగమైపోవును.

విష్ణు — నారదా! నోరుకట్టుము. ఇదె మేముపోయి అనసూయను పరీక్షించెదము.

తే. గీ. జపములను జేసి నర్మద ♦ స్వర్గపురిని
జేరలేక యధోగతి ♦ జారిపోయె
నార — కేవల పతివ్రతలఁ బరీ ♦ క్షింపఁ గోరి
మూడుమూర్తులు శిశువులై ♦ పోవఁగలరు.

సర — సరిసరి త్రిమూర్తులు శిశువులై పోదురా!

దుర్గ — నారదా! నీవు తారతమ్య పరిజ్ఞాన శూన్యుఁడవై దూరుచున్నావుసుమా!

నార — లేదు. నర్మదను మీరు స్వర్గపురినుండి నేలకుఁ ద్రోసివేసి నామని యుప్పొంగుచుండిరే గాని మహాపతివ్రత లానఁబెట్టిన దేవలోకమే వణఁకి వారిపాదములకు జోహారు సేయవలసివచ్చు ననుమాట మీకుఁ దెలియదు కాఁబోలును.

మహే — నీబీరములింక చాలించుము.

ఆకాశవాణి

తే. గీ. గంగ నీపాపచయ మింక ♦ గడవఁబోదు
కట్టి కుడువుము నీకింక ♦ గతులు లేవు
ఆమహాసాధ్వి అనసూయ ♦ నాశ్రయించి
జన్మతరియింపనేర్తు వా ♦ చక్కఁజనుము.

గంగ — ఆహా! ఆకాశవాణి యేమనుచున్నది (అని పై పద్యము చదివి) ఆ యనసూయాదేవినే ఆశ్రయింపు మనుచున్నది. నేనామెనే వెదకుచు పోయెదను.

తృ తీ యా ం క ము

•••○◯○•••

రంగము — శ్మశానము

(భైరవుడు ప్రవేశించి యుండును)

భైర — నేను భైరవుఁడను. ఇది భైరవాలయము.

ఈతఁడు పిశితాశనుఁడు. ఇచ్చట నిరంతరము బలులు, వధలు, జరుగుచుండును. మద్యము కడవలకొలది నైవేద్యము పెట్టఁబడుచున్నది. పౌరులీ మద్య మాంసములకై వచ్చి పెద్దబీభత్సము చేయుచుందురు.

(కల్లు మేకలు తీసికొని పురజనులు ప్రవేశింతురు)

పురజనులలో నొకఁడు — మానవులను దేవతలు నడుపుచుందురు. దేవతలలో భైరవుఁడు ఘనుఁడు. ఈతఁడు దేవదానవులకు అమృతము పంచి పెట్టునప్పుడు స్త్రీరూపము ధరించిన విష్ణువునకు శివునివలనఁ బుట్టిన కాలుఁడు.

ఈ కాలుఁడు లోకమారణము సేయుచుండ ప్రాణములకుఁ బ్రాణముల బలి ఇచ్చి మానవలోకమును కాపాడు తత్త్వము శాస్త్రీయులు కనిపెట్టినారు. యజ్ఞాదులకు హవిస్సువలె దీనికి మద్యము ప్రధానము. మద్య మాంసములకు మించిన మోక్షమే లేదు.

పుర — నిజము.

భైర — ఇదే తత్త్వసారము.

ఉ. మద్యము మాంసముల్ మెసవి ♦ మానినులన్ జతఁగూడి హాయిగా
వాద్యములన్, వినోదములఁ ♦ బాటల నాటల సంతసించి దు
ర్భేద్యములైన మానసిక ♦ వీధుల దుఃఖతమస్సు బాసి యా
యుద్యానమందు రేబవలు ♦ నుండుటె స్వర్గము వేఱయున్నదే!

పుర — లేదు.

భైర — (మద్యము ద్రావి)

తే. గీ. మధువె యమృతంబు శైలూషి ♦ మంజువదన
లెల్లదేవకన్యలు; గాన ♦ మే రసంబు
తంత్రినాదమె తేజంబు; ♦ తలవ వేశ్య
వాటికయె సుమ్ము కైలాస ♦ పట్టణమ్ము.

(నాట్యాంగనలు పాటలు పాడుచు నృత్యముసేయుదురు)

పాట

నేను చంచలను
నారసిక - తెలుఁగా - దరమా
సాంపారఁగ - సాంపార - సాంపార
సాంపారఁగ - నేను
నగవూ మోవి సొగసగువదనము
సిగపూతీవి - కావలెనా - కావలెనా

కావలెనా॥ సాంపా॥

పాటల తీరు ఆటలసోరు
నీకైననుదురు సాంపారఁగ

భైర — ఆహా! యేమి యీ కాంత యొయ్యారము! ఏమి యీ హావభావములు! ఎంతసొరు మీరుచున్నది! బలే! ఇందువదనా! బలే! యీ భైరవుని మెడలోని పూలదండ నీమెడలో నలంకరించుచున్నాను. ఈ భైరవుని పానపాత్రలో తియ్యని యాసవము నీకిదే తెచ్చి యిచ్చుచున్నాను (అని యిచ్చును).

తే.గీ. సొగసుకన్నులజిగి ♦ బిగువైనయురమును
మొగలిపువ్వవన్నె ♦ మిగులుమేను

భోగవిలసనంబు ♦ రాగంబుగల వెల
బోటి విటుల కొంగు ♦ మూటగాదె.

విటుఁడు (ప్రవేశించి) ఎవరో నా పేరె త్తుచున్నాఁడు. ఈవిలాసిని నా యుంపుడుకత్తె. నేఁడు భైరవు నర్చించుటకు వచ్చినది. దీనిని వెదకుచు నేను వచ్చితిని. ఇక్కడ మఱియొకనాటకము జరుగుచున్నది. దీనిని ప్రచ్ఛన్నముగా నిలిచి చూచెదను.

విలాసిని — (పాడుచు నాట్యము సేయును)

భైర — బలే! ఏమిసొగసు!

తే. గీ. విఱువుజూపులు నగుమోము ♦ కురల విరులు
నడుముసన్నంబు కుచభార ♦ ముడుగరాని
హారాయులు కంకణక్వాణనము ♦ లోలయునట్టి
యీమె విటనారిఁ జేరి య ♦ ర్థింతుఁ బ్రేమ.

విటుఁడు — "ఈమెవిటనారిజేరి యర్థింతు ప్రేమ" అనగా ఈవిలాసిని నా వేశ్యయని గ్రహించినాఁడు.

విలాసిని — (భైరవుని జూచి నవ్వి)

తే. గీ. జలజనేత్రలఁ బతుల లవ ♦ పరముకోలఁది
కోరుదురెకాని ప్రేమ యే ♦ కోశమందు
నుంచ రనుమాట కల్లఁగా ♦ నెంచరాదు
వానకై పట్టు గొడుగు కై ♦ వడిఁ దలంప.

విటు — ఆహా, ఏమి యీలాగనుచున్నది. యీమెమనస్సు నామీఁద నుండి తిరిగి పోయినదా యేమి! దీని కంతకు భైరవుఁడే కారణమై యుండును.

భైర — (స్వ) నేను బహుకాలము కామినీలంపటుఁడనై చరించుటచే రోగములచేత నా యొడలు కుళ్ళి అతుకులకుక్కినైపోయినది.

ఒకవంక కుసుమములు సలుపుచున్నను విలాసినీవాంఛావిభ్రాంతి నా స్వాంతమునందలి శాంతిని దూలించి యేలీలనైన నీ యెలనాగను గవయఁ గోరుచున్నది. (ప్ర) ఆహా!

పాట

పలవును మఱి నిలుపలేను బాల
కాలమేల వెళ్ళబుత్తువే విశాలఫాల ॥వ॥

విలా — రసికలోకవినుతా!

భైర — కాలమేల వెళ్ళబుత్తువే విశాలఫాల ॥వ॥

విలా — రసికలోకనుత!

భైర — విలాసభాసమానోల్లాసినీ శుభాంగి కాలమేల ॥వ॥

విటు — ఇంక నాయనుమానము తేలిపోయినది. నా విలాసిని నీ భైరవుఁడు హరించుటకుఁ జూచుచున్నాఁడు. ఇంక తడవు సేయక వీని తాళముపట్టవలయును. ఓసీ దురాత్మా! భైరవహతకా యిదే నాచేతఁ జిక్కితివి. నీవింకఁ బాఱిపోఁ జాలవు.

భైర — చెలీ ఒక్క ముద్దియ్యవా?

విటు — అరే నీకు నావిలాసిని ముద్దియ్యవలెనా! చూడు నీ వీపు బ్రద్దలుచేసి వేసెదను (అని తన్ని పాఱిపోవును).

విలా — ఓహో! ప్రమాదము వచ్చినది. నాయుంపుడుమగఁడు వచ్చినాఁడు.

విటు — విలాసినీ! నీసంగతి తెలసినది పద; నీశాస్తి ముందున్నది. (అని, యీడ్చుకొని పోవును).

భైర — (లేచి) హా! నిలువలేను. వ్రణములచే నిండియున్న యీ దేహము ఈవిటుఁడు కొట్టినదెబ్బలచే మఱింత విడిపోయి యమబాధపెట్టుచున్నది. ఇంక నేనేమి చేయుదు, ఏది దారి? ఈవిటుఁడు చేసిన వరాధ

వసుచే నాహృదయమును రక్తార్ణవమై పోయినది. హా! బాధ (అని నేలఁబడి) ఏదీ మద్యము (అని మూర్ఛిల్లును).

సర్వ — (ప్రవేశించి) ఇదే భూలోకము. నాచరితము నాకే విచిత్రముగ నున్నది.

మ. అపవర్గంబున కంతరాయ మని మా ♦ యామోహ సంసార ఘో
ర పయోరాశినిఁ దన్నివేసి యల స్వ ♦ ర్గద్వారముల్ వీడఁగాఁ
దపముల్ చేసితి యోగముల్ ఫలిపితిన్ ♦ ధన్యాత్మనై పోయినన్
నెపముల్ మోపి ధరిత్రిఁ దోసిరి సురల్ ♦ నిర్భాగ్యనై వచ్చితిన్.

ఇంక ముందేమున్నదో చెప్పఁజాలము. మిక్కిలి మలీమసమును, అసహనమును, భ్రాంతియును మునుఁగుదీసిన మిగుల వికారద్యోతకకమును, నైన యీప్రపంచక మహామాయా సంసారమున నొక పురుష వ్యక్తికి దాసినై సేవ సలుపక యున్న సతికి స్వర్గము లేదఁట! ఆహా! యీస్త్రీజాతి యెంత గర్హ్యమైనది. ఎంతతుచ్ఛమైనది. నేనిందుండను. నేనిప్పుడే దీనిని ముక్కముక్కలుగఁజేసి అగ్నిలో మాడ్చి గాలిలో నెగిరి నీళ్ళలోఁ గలసిపోయెదను. నాకిఁక స్వర్గ మక్కఱలేదు. నా కా శాశ్వతబ్రహ్మ పద మనావశ్యకము. నాకు కైలాసము కక్కిన అన్నమున కన్న పరమనీచమైనది. నేనెంత మోస పోయితిని! ఎంతకాలము తపమాచరించితిని. ఎన్నెన్ని కడ గండ్లు సహించితిని. తుదకు నాకథోగతి తప్పదయ్యెను. సరే! ఇంక మిగిలినది యాత్మహత్య. ఇది యకృత్యము కాని నేను పంచత్వము పొందకమున్నె యీస్త్రీయుపాధిని నేస్వామికో యొప్పగించి దీనినైచ్యము స్త్రీలోకమున కగపఱచెదను గాక. (అని రెండడుగులు నడచి ఆదేవహతకు లేమిచెప్పినారు. ప్రథమ దర్శనమగువాఁడే నీమగఁడని—పాపము శమించునుగాక! నాకు మగఁడేమిటి; నేను సర్వతంత్రస్వతంత్రను గానా; నా యంతరాత్మ మహా తపశ్శక్తిచే పూ

ర్తాండ మండలము వలె తేజో విరాజితమై ప్రదీపించుట లేదా! నేను మహా వీరాధివీరులవలె స్వర్గ ద్వారము బ్రద్దలుచేసికొని వెళ్ళలేనా! సరే! ఇంక నాకు స్వర్గము — యాచింపగా వచ్చెడు తుచ్ఛమైన స్వర్గము — స్త్రీ పురుష భేదములతో నిండి యీర్ష్యా గాఢాంధకారవికారద్యోతక మైన స్వర్గము నాకాలిగోరునకైన వలదు. లేదు. నాకా తలంపే లేదు. నాయంతట నేనే శుచినై నాయంతట నేనే పరిశుద్ధనై నాయంతట నేనే నా స్వర్గము నేనే నా మోక్షము నేనే కట్టుకొని నేనే యానందించెదను. నేనే నివసించెదను. నాకీ యుపాధి యక్కరలేదు. నాకీ మృతరూపకమైన స్త్రీత్వ మక్కఱలేదు. నేను జడస్వరూపమును. నేను మట్టిని. నేను బురదను. ఆమట్టిలో నొకరేణువును. ఆమృత్తికారేణు సముదాయమే నేను. నేను అమృతమై పోవుదును (అని మూర్ఛిల్లి పడిపోవును).

ఖైర — (లేచి) ఎవరీమహినీయ సౌందర్యశిలా విగ్రహము. ఇది శిలగాదు. మానవ కన్య. మానవకన్యల కింతలావణ్య ముండునా?

తే. గీ. ముంగురులసోరు, చాకు కు ♦ రంగలోల
లోచనంబుల బారు, నీ ♦ లోకమధుర
రాగముల తీరు మకుని సా ♦ రంగధరుని
మీరు నీనారి చిన్ని పా ♦ న్నారి యహహా!

వర్మ — (లేచి) సరే. ప్రారబ్ధ కర్మ మనుభవింపక తప్పదు. కర్మ భోగావసాన పర్యంతము ప్రకృతి ననుసరించెదను. ఎవరో నాయెదుట నిలిచివట్లున్నది. ఈతఁడే నాభర్త.

ఖైర — నెచ్చెలీ! నీవెవ్వతెవు?

వర్మ — నీకు నేను నెచ్చెలినే!

ఖైర — అది యెట్లు?

నర్మ —

తే. గీ. కటిక చీఁకటి వెన్నెలఁ • గాచినట్లు
నీళ్ళచేత తటాకముల్ • నింపినట్లు
తపముచేత త్రిలోకముల్ • దనిపి వ్యర్థ
కాలనై నేలఁబడిన న • ర్మదను నేను.

ఖైర — (వణకుచు) (స్వ) ఇదియేదో గొప్ప ప్రమాదమే జరిగినది. (ప్ర) నిన్ను జూచిన నాకుఁ గంప మెత్తుచున్నది. ఇందలి యుదంతమేమి?

నర్మ — నేనవివాహితను. ఉత్తమక్షత్రియకన్యను. మహాతపస్సు చేసి చేరరాని దేవలోకమును చూరగొంటిని. కాని దేవతలు దేవలోకమున పతివ్రతలకుఁ గాని చోటులేదని పంపివేసిరి. కావున నిన్ను నేను పరిణయ మాడెదను.

ఖైర — (తలవంచి) నన్నా!

[తెరపడును.]

రంగము:- తపోవనము

(అత్రి, అనసూయ, శిష్యులు ప్రవేశించియుందురు)

అత్రి — దేవీ! అనసూయా! చిరకాలమునుండి యపత్యార్థమై మన మీశ్వరునిగూర్చి తప మాచరించుచున్నాము గాని మనకింకను గతి గానరాలేదు. రానురాను మండువేసవి ప్రవేశించినది. ఈ యరణ్యావాసము మిగుల దుస్సహముగ నున్నది.

ఉ. నిండినకాంతితో దిశలు • నిండఁగఁ జండమయూఖపంక్తి మా
ర్తాండుఁ డుదగ్రుఁడై వెడలఁ • గ్రక్కి యజాండముగాల్చి వేయఁగా
నుండినయట్లు మండిపడు • చుండెను; కొండలునాకలంబు లీ
రెండను మాడి బూడిదయి • యింగలముల్ వెదజల్లుఁ జూచితే!

అహా! ఎంతదుస్సహమైన యెండ కాయుచున్నది!

మ. జ్వలనజ్వాలలు వచ్చి లోకములు గా ♦ ల్చెన్ జూచెనో రాక్షసుల్
బలులై పేరిచి మ్రింగి యగ్నిమనసై ♦ నర్తించుచున్నారొ యా
ప్రళయం బప్పుడె వచ్చెనో దశదిశల్ ♦ భగ్నంబులై పోవునో
తెలియంగన్ రాదు నిదాఘ మిట్టి దగునే ♦ దిక్కింక మాకున్నదే.

అన — నాథా! జనపదములన్నియు కాలిపోయినవి. ప్రజలందరు పటాపంచలై పోయినారు.

అత్రి — అగును.

చం. లలనా! ఖగంబులన్నియుం గు ♦ లాయము లన్ విడనాడి దీనతన్
నేలలఁబోయె; జంతుతతి ♦ ప్రాణము బాసెను; వృక్షపంక్తి బా
గాలుగ నశించె; సాగరస ♦ రోవరముల్ మరుభూము లయ్యె నీ
ప్రళయపు మోష్ణకాలము భ ♦ రం బతికష్టముగా ప్రాణికోటికిన్.

అన — ఈమహాప్రళయము వచ్చుట కేమికారణము.

అత్రి — అనసూయా! ఇది కాలపై పరీక్ష్యము సుమా! నాకు మిగుల దాహము వేయుచున్నది (అని మూర్ఛిల్లును).

అన — అయ్యో! కుండలోని నీరుసహితము ఎండిపోయినది. ఇంక నేనేమి సేయుదును. ఇంక నానాథునిదగ నొట్లుతీరును.

తే. గీ॥ ప్రాణనాథుఁ డడిగిన నీ ♦ రైన దెచ్చి
యియ్యలేనట్టి సతిబ్రతు ♦ కేల దాహ
తప్తుఁ డగు మిత్రునకు గొంతు ♦ దాక నీట
మునిఁగి దగ దీర్పలేని ప ♦ ద్మినివిధాన.

అయ్యో! ఇంకనానాథుని దగదీరు నుపాయమేమున్నది. శిష్యులారా! విచారించట జాగరూకులై యుండుఁడు. నేనువెళ్ళి నీళ్ళెందైన దొరుకు నేమో చూచి వచ్చెదను.

శిష్య — అమ్మా! గంగ భూలోకమందే లేదట!

అన — అది యేమి?

శిష్యు —

తే.గీ. అమ్మగంగమ్మ శిరమున ♦ నాత్మభవులు
సేమగుట జలపి పాపంబు ♦ తోడ నడక
మంచుఁ బడి స్వామిదగ్ధమై ♦ భ్రమయుచుండె
నిప్పుతోగాని నీరాన ♦ నిలువ లేదు.

అన — లేదని యూరకుండఁజెల్లునా! పరమశక్తిప్రదయగు గంగపై మీరారోపించిన దోషములు క్షమ్యములు గావు.

శిష్యు — సరే! త్రికాలజ్ఞులగా మీకే తెలియును. పాష్యమునాఁడుగ పడనిచంద్రుఁడు పిడుగునాఁడు దాగునా?

అన — (కలశము తీసికొని) జలమెందేని లభించునేమో చూచెదగాక (అని వెడలును).

అత్రి — దేవియేది?

శిష్యు — అమ్మగారు నీళ్ళకై వెళ్ళినారు.

అత్రి — ఎట్లు వెళ్ళఁగలిగినది. ఎండ నేఁడు మిక్కిలి భయావహముగ నున్నది గదా!

ఉ. నిప్పులు రాలుచున్నవి యు ♦ నేకతరుప్రకరంబు లెండిపో
నొప్పెడి యెండలో నడచి ♦ యొంటిగ మాయనసూయ పోయె న
చ్చొప్పున నీళ్ళు తేగలుగుఁ ♦ జూడఁగరాదు పరాత్పరుండు నా
యొప్పులకుప్ప సుందరప ♦ ముజ్వలగాత్రికిఁ దోడునిడఁగుత.

అనసూయ — (దూరముగ ప్రవేశించి)

పాట

సుజలాగారమీ కాన లోపలఁ గలదా
జూపరే యెఱవిని సురలారా.

నానాథుఁడు దగతోఁబడి గాసిజెందిజలము
గోరపయునమైతి నీసడికి ॥సు॥

అయ్యయ్యో యెక్కడ వెదికినను చేరెఁడు నీళ్ళు లభింపకున్నవి. ఓదైవమా! యింక నేది గత్యంతరము. మా దేహము నీ దాహాగ్నిని దహింపఁ జేయుటకే నీ సంకల్పమైనచో మేము పరమ సంతోషముతో నీ ప్రాణము లాహుతి సేయనున్నాము. నాభర్త దాహార్తుఁడై తపించి పోవుచున్నాఁడు. నేను మిగుల వసివాఁడిపోయితిని. యీపిడుగులు రాల్చుచున్న యెండలో నాకాళ్ళు మాడి పొక్కులెక్కినవి. నేనింక నొక యడుగైన ముందర కిడఁజాలను. (నేల చదికిలబడి),

పాట

మాకాలాగతికి ఇంకేమననూ
ఈకానన్ జలము లభింపక మాప్రాణ
మూడిపో వ్రాసిన విధిని.
జయింప నోంపనెవరులేరు. ॥ మా ॥

గంగ — (ప్రవేశించి) అయ్యో, ఈపాపదేవత వృత్తమునకు ఛాయ వలె నా వెన్నాడుట మానకున్నది.

మ. పసుపో కుంకుమొ తారహారచయమో ♦ వస్త్రంబులో, మాడలో, కొసవన్ గుంభమొ మాంసమో; మధువా పే ♦ ర్మిన్గోరుమేనిత్తు న క్కనుదీరన్ నను బీల్చి వేయకుము నా ♦ కాయంబు నీ రయ్యో ర క్కసి పాపానలరాశి నన్ను విడువం ♦ గారాదె నిక్ మ్రొక్కెదన్.

పాప — హుం.

గంగ — అయ్యో! చంపివేయకుము. ఇంకేమిగతి.

చం. ఉడికెను నన్నమట్లు కలు ♦ షౌషధి పొంగ మువింగి పోతి నా రయొడలు దపించి పోయె నిలు ♦ పోపక యేగితి మూఁడులోకముల్

కడకుఁ ద్రిమూర్తు లాత్రిదివ ♦ కాంతలు నాకలుషంబు బాపకే
విడిచిరి యర్ఘ్యమున్, విడిచి ♦ పెట్టినరీతిఁ దిలోదకమ్ములన్.

అట్టి హతాశ నగు నా యవస్థం జింతించి సకల విజ్ఞాన విశారదుఁడగు నారదుఁడు అనసూయ నాశ్రయింపు మని యానతిచ్చినాడు. అదే ఆకాశవాణి పాడినది! మహాభాగ్యమని గ్రహించి యీయత్రి తపోవనమునఁ బ్రవేశించితిని. కాని, యీయనసూయ యింకను నాకుఁ గానరాలేదు.

అన — అక్కటకటా! ఎంతదురవస్థ వచ్చినది.

ఉ. చేరెఁడు నీళ్ళకున్ బడలి ♦ జీవమువాసెడు మమ్ముఁ జూచినన్
గూరిమిరాదె దీనజన ♦ కోటిని బ్రోచెడువారు లేరె సం
సారవిషాబ్ధి జచ్చి చితి ♦ శాంతివహింపఁగ నాఋణంబెటో
తీరునుగాని భర్త దగ ♦ దీర్చని దుఃఖముపోదు నామదిన్.

(అని మూర్ఛిల్లును)

గంగ — ఎవరి దాయార్తనాదము.

అత్రి — శిష్యులారా! మీయమ్మ యెందేగినదో వెదకి తీసుకొని రాఁగలరా!

శిష్యు — జొన్నలు నేలఁజల్లినఁ బేలాలై పోవుచున్న యీభూమిపై మే మొక్కయడుగైన వేయఁజాలము.

అత్రి — అయ్యో! మీరే యిట్టులనుచుండ నీయెండ కా యనసూయ యేమైపోవునోగదా. దేవీ! నీవేల నన్ను వదలిపోయితివి.

ఉ. ఓచెలి! నీవునాయెదుట ♦ నుండినఁజాలును క్షుత్పిపాసలే
తోచవు రేబవళ్ళు సుఖ ♦ దుఃఖము లుండవు కల్మిలేములన్
గోచర మింత కావు నను ♦ కోమలి! యోయనసూయ! సర్వమీ
వై చరియింతు మీశ్వరుని ♦ యట్టు దలంతు భవత్స్వరూపమున్.

గంగ — (అనసూయను సమీపించి)

చం. సొగసుల దీర్చి శీతగజ ♦ సొంపుబెనింపు సిలింపశాంతలన్
బెగ్గడుఁగఁ జేయు నీయువిద ♦ భీతకురంగవిలోలనేత్ర పెన్
దగఁగొని మూర్ఛవోయెను ని ♦ దాఘ మహాతపవహ్నికీలలన్
నొగిలిన పూలతీవన మ ♦ నోహరరూపము మాటుసేయుచున్.

పాప యీమె కొంత జలము పోసిన బ్రతుక వచ్చును. ఆర్తరక్షణము మహాపుణ్యముఁగదా. అందును ఆర్తనైన నాకిది లెస్సగ నెఱింగినపాఠము. ఈ నిర్జలారణ్య ప్రదేశమున హిమ శీతల జల ప్రవాహమును బాటించి యీయుంచయాన పదసరోరుహంబుల స్పృశించి తిరించెదగాక. (అని అదృశ్యయై పర్వతమునుండి ధారారూపమున వెలువడును)

అన — (కన్నులు తెఱచి) అయ్యో! భర్తగారికి సేళ్ళయ్యతేనైతి నింక నేమి గత్యంతరము. ఆకొండనుండి యేదో స్రోతస్సుదయించు చున్నట్లున్నది. ఆహా! నాకన్ను లెంత చల్లఁబడినవి.

మ. గిరి గర్భంబుల రెండుఁ జీల్చికొని సం ♦ కీర్ణంబులై చారుని
ర్ఝరముల్ వెల్లువలొ చు నీవసుధ స ♦ స్యశ్యామలం జేయుఁగాఁ
బర తెంచెన్; మరుభూమి రాతిసివరెన్ ♦ భక్షించు నాకొన్న మో
హారతిన్; స్వార్థపరాయణుల్ పరుల లా ♦ భైశ్వర్యముల్ చూతురే.

(లేచి) ఆహా, గంగ పొంగి పారలి యిదే వచ్చుచున్నది.

పాట

ఆహా సలిలము నది యిదిగో
శిలల నడుమ సెలయేరులు పొడమెన్
మింటికి ధారలు సాగయున్.
గంటికి వింతలు గొలిపెన్.
ఎంతో సంతసము, చింతలువాసెను
శాంతిని దగ దీర జలము గొనెద ॥ ఆహా ॥

కరుణారససమన్వితుఁడై పరమేశ్వరుఁడు నామొఱాలకించి యీ స్వచ్ఛమైన, సుధాసదృశమైన శీతలజలస్వరూపమునఁ బ్రసన్నుఁడై యుండనోపును. లేకున్న నీ మరుభూమిలో నీ మండువేసవిలో నీగిరి గహ్వరమున నీరెక్కడిది? ఇవి మాకు చిరపరిచితములైన ప్రదేశములు గావా! ఇదియంతయు నాప్రాణవల్లభుని తపోమాహాత్మ్యము. (అని కలశమున నీళ్లు నింపుకొని, వేవేగముగ అత్రినిసమీపించి నాథా! ఇవిగో నీళ్లు! వేగఁద్రావుఁడు లెండు. (అని కాళ్లమీద పోసి లేపి వెనుకకు చూచుసరికి గంగ ప్రవాహమున వెన్నాడి వచ్చును)

అత్రి — దేవీ! ఈసుధాసముజ్జ్వలమైన గంగ నీళ్లు వెంటఁ బెట్టుకొని రాఁగలిగితివి. నీమహత్త్వ మనన్యసామాన్యము సుమా!

అన — ఆపోరూపిణి యైన గంగ సర్వాంతర్యామినియు, సర్వజగదాధారిణియుఁగాదా, ఇచ్చట ప్రసన్నయైన దన్న వింత యేమున్నది? ఇది యంతయు తమ పూజాఫలితము.

శిష్య — కాదు తల్లీ! నీదే మహత్త్వము. ఈ జలదేవత నీ వెంట నంటి రాకున్న మాప్రాణము లాయమదేవత లీపాటికి హుక్కాధూమమువలెఁ బీల్చి వేసియుందురు. మాకప్పుడే ఆకాశయాన గమనాగమన మహాకోలాహలము లభించి యుండును. మాతా! ఈ శీతల సలిలములు పోసి మాప్రాణములు నిలిపితివి (అని మొక్కి నీళ్లు చేరలతో దీసి త్రావుచున్నారు.)

అత్రి —

ఉ. వంచనయందు ప్రేమయుఁ గృ ♦ పాణమునందుఁ గృపారసంబు వ
ర్షించినరీతి నాగిరిద ♦ రీవర గర్భమునుండి నిర్ఝరీ
సంచయ మేగుదెంచె నిట ♦ స్వర్గకవాటము విప్పి నట్లు శో
భించుచు నున్నదీ ప్రళయ ♦ భీతసిదాఘము మాటుసేయుచున్.

అన — నాథా! మనమీజలాధిదేవత నారాధించెదము రమ్ము.

పాట

ఆపోజ్యోతివి తేనమో గంగా
మాపై నీకృపఁ జూపు మభంగ.
మధురపూర హిమవారికోరి
నేపూజించి పడసితి శాంతి.

గంగ — (ప్రత్యక్షమగును)
అత్రి, అన — ఓ గంగామాతా!

శ్లో. ఆపోరూపా సగుణభరితా సర్వలోకైకమాతా
సర్వారంభా ప్రణవవినుతా శాంత విద్యుత్ప్రపూతా
భవ్యాకారా ద్విజవినుతా పాపనిర్ముక్త పాదా
త్రైవేణ్యాఖ్యా అమృతసదృశా తేనమో దేవి గంగే!

[తెర]

చతుర్థాంకము

రంగము:- భైరవుని గృహము

(భైరవుడు, నర్మద ప్రవేశించియుందురు)

భైర — నర్మదా! నర్మదా! యెక్కడకుఁ బోయినావు.

నర్మ — ఇక్కడనే యున్నాను.

భైర — ఏది మద్యము!

నర్మ — (అందించును)

భైర — (త్రాగి) ఎంతహాయిగా నున్నది.

నర్మ — నాథా! ఈసురాపానము స్వర్గమార్గమున కవరోధమును మహాపాపమును కాదా?

భైర — నీకెవరు చెప్పినారు. వారంతా భ్రాంతులు.

నర్మ — జ్ఞానులే భ్రాంతులా?

భైర — అహా! ఒకపారసీకకవి యెంతమహనీయుఁడో చూడు.

ఉ. నచ్చలి స్వర్గమో యనుచు ♦ నీరడియాసయదేల స్వర్గమం
దచ్చర లాసవంబులె క ♦ దా కల వంతియ వేఱలే వవే
యిచ్చటనున్న వింకఁగల ♦ వే త్రిజంగబులంచూపనేర్తువే
వెచ్చనికల్లు కాంతకును ♦ వేఱుగ వైభవమేమి యున్నదో.

కావున తేనర్మదా, తే! ఆమధుపాత్ర మిటు తేదెమ్ము.

ఉ. చీకులు రొట్టెముక్కలును ♦ సీధువునొక్కరహస్యమందిరం
బోకమలాక్షి! యున్న నిఁక ♦ నుజ్జ్వలరాజ్యపదంబు నొల్ల నా

నాకలుషానహంబులు యు ♦ నంతదురంత విచారఘోర దు
ర్వ్యాకులమ్మై తనర్చెడు ప్ర ♦ పంచము నీగతి నేదరించెదన్.

(అని మధుపానము సేయును)

ఆహా! బ్రహ్మానందము కలకెక్కినది. నర్మదా పాఁడ్లు సలుపుచున్నవి.

నర్మ — మందు రాయుదునా?

భైర — రాయుము.

నర్మ — (రాయుచున్నది)

భైర — నర్మదా! చంచల నొకసారి తీసికొని వచ్చి నామొకట నాట్యము సేయింపుము.

నర్మ — నాథా! మీయానతి నిదే మీవిలాసినీ మందిరప్రాంగణమునకుఁ బోయి యామెను బిలుచుకొని వచ్చెదను (అని ప్రయాణమై) ఆహా! విధివిధాన మనుల్లంఘ్యము (అని కన్నుల నీరుప్పొంగుకొని) పెండ్లియాడినది మొదలు ఈ భైరవుఁడు నన్నునోర్చి స్త్రీజనదూష్యములైన మహాపాపకార్యములలోఁ బెట్టి గానుగలోఁ బెట్టిన చెఱకువలెఁ బీడించి పిప్పిచేయుచున్నాఁడు. కాని యీ మొండిప్రాణ మెంతకైన నూడి పోవకున్నది. ఆహా! హతవిధీ!

సీ. తపము సేయుట కంటె ♦ నుపవాసములకంటె
గాంతుని సేవయే ♦ కఠినతరము
పేదరికముకంటె ♦ భిక్షమెత్తుటకంటెఁ
గాంతుని సేవయే ♦ కఠినతరము
బండి లాగుటకంటె ♦ బానిసపనికంటెఁ
గాంతుని సేవయే ♦ కఠినతరము
కూలిసేయుటకంటె ♦ నాలఁ గాచుటకంటెఁ
గాంతుని సేవయే ♦ కఠినతరము

ఆ. వె. అంతరాత్మతో పాప ♦ మాచరించినఁగాని
కాంత గాదు మఱియుఁ ♦ గాంతునింట
అత్తవారిసేవ ♦ నాచరించుటకంటె
పడఁతి కింక నరక ♦ బాధ గలదె.

(అని వెడలును)

ఖైర — విలాసినివచ్చునో లేదో! వచ్చి,

చం. తరుణిపదాబ్జయుగ్మమును ♦ దాఁకినఁ జాలును రాజ్యలక్ష్మి చే
కురినవిధంబగున్; రమణి ♦ గూర్చిపచించినదెల్ల వేదమై
పరఁగు; మదీయమానసము ♦ భామిని కొంగునఁగట్టుకొన్న దా
వరరుచిరాంగి నావలపు ♦ వాకిలి దక్కునో లేదొ ప్రేమమడిన్.

నర్మ — (ప్రవేశించి) (స్వ) ఆమె కెంతో ధనము కావలెనట. నాయొద్ద నొక్క కాసైననుగానరాదు. దైవమా! నేనేమి చేయుదును? (ప్రకాశముగా) నాథా! విలాసిని, —

ఖైర — తీసికొని వచ్చితివా?

నర్మ — ఆమెకు వేయిమాడలు కావలెనఁట! అంత ధనము మన యొద్ద నెక్కడిది?

ఖైర — నిన్ను నేను వరశుల్కము గైకొనని దే పెండ్లియాడితిని. ఇప్పుడు నాకు ధనమవసరము వచ్చినది. నీవెట్లు సంపాదించెదవో నా కాంచనలను సమకూర్పవలయును.

తే. గీ. ఏవిధంబుననైన నా ♦ యింతి మిన్న
నావశంబద కానిచో ♦ జీవములను
విడిచివేయుదు నర్మ్యంబు ♦ విషము చునట్లు
విషముద్రావిమో మెడకురి ♦ బెట్టుకొనిమో.

నర్మ — (స్వ) అయ్యో దైవమా! నా కెన్ని పాట్లు తెచ్చి పెట్టితివి! ఇంక నేనేమి సేయుదును! నా కేమి గత్యంతరము? విలాసిని ధనమియ్యనిదే రాదు. రానిచో ప్రాణముల విడిచెద నని నావిభుఁడు ప్రాయోపవిష్టుఁడై మండిపడుచున్నాఁడు. (ఆలోచించి) సరే, పోయి ఆవిలాసినినే సమాధానము చేసి ఆమెకు దాస్యమైన సలిపి తీసికొని వచ్చెదను.

(అని వెళ్లును)

భైర — (మధువు త్రాఁగి) ఏదీ ఆ చంచల ఇంకను రాలేదేమి?

కం. కన్నులకుఁ గలివు దీఱఁగఁ
జిన్నారి మనోహరాంగి ♦ చేడియఁగని నే
నన్నియు మఱచితి నాకా
కన్నియ యావన్నెలాడి ♦ కావలె నిపుడున్.

నర్మ — (స్వ) విలాసినితో నాయుందంతము విప్పిచెప్పితిని. ఆమె తనకు కావలసిన వేయిమాడలకు బదులు నాతల వెండ్రుకల నిమ్మని కోరినది. సరేయని నేనామెకు సమర్పించితిని. కాని నావల్లభుని తన యింటికే గొనిరమ్మని నివేదించినది. ఈసంగతి నే భర్తగారికెఱిఁగించెదను. (ప్రకాశముగ) నాథా!

భైర — దేవీ! విలాసిని వచ్చినదా?

నర్మ — మిమ్ములనె తనయింటికే దీసికొని రమ్మనినది.

భైర — ఆహా! గొప్పప్రమాదము.

నర్మ — అది యేమి?

భైర — దాని విటుఁడు మహాఘాతకుఁడే.

నర్మ — అటులైన నాపాతకిని బరిత్యజింపవలదా?

భైర — నాప్రాణ పరిత్యాగ మైనప్పుడే.

నర్మ — (స్వ) ఆవిలాసినీ విటుఁడు కొట్టిన దెబ్బలింకను వీసికి మాన లేదు. కాని కామినీలంపటత్వము వదలకున్నాఁడు.

ఆ. వె. వెలఁది యింటనుండ ♦ వెలవెలందులకయి
ప్రాకులాడు దుష్ట ♦ పశువులకును
బ్రహ్మ వ్రుల్లు పెట్టి ♦ బాధించుచున్నను
బుద్ధిరాదు దుష్ట ♦ బుద్ధులకును.

(ప్ర) నాథా! మీరు భయ పడవలదు లెండు! నేనుమీకు బాసటనై యుందును.

భైర — అటులైన బోదము పద.

నర్మ — లెండు పోదము.

భైర — నేను లేవలేను. నీ తలవెంట్రుక లూతగా నొసంగుము. పట్టుకొని లేచెదను.

నర్మ — నాథా! తలవెంట్రుకలిప్పుడే తీసివేసితిని.

భైర — ఏమి! యేమి! నేనుండగనే నీకు శిరోముండనమా!

నర్మ — విలాసిని వేయిమాడల నిచ్చినఁగాని సమ్మతించినది కాదు. ఆధనమునకు బదులుగా నాతలవెంట్రుకలనడిగినది. కావుననిచ్చి వేసితిని.

భైర — ఆహా! ఇదియా యుదంతము. సరే ఎట్లో నన్నావిలాసిని యింటికిఁ జేర్చుము. నేనీ కురుపులబాధవలన నొక్కయడుగైన వేయలేను.

నర్మ — సరే, యీగంపలోఁ గూర్చుండుఁడు. నేను నెత్తినెత్తుకొని పోయి యచ్చట కప్పగించెదను. (అని గంపలోగూర్చుండఁబెట్టి నెత్తి నెత్తు కొని నడచుచు) నాథా! మనము దారి తప్పలేదుకదా!

భైర — లేదు నడువుము. వేవేగనడువుము. ప్రొద్దుపోయినది.

నర్మ —

తే. గీ. కటికి చీఁకటిలో దారి ♦ గానరాదు
ముఁడ్లు గల కాన యిది కడ ♦ గండ్లు వడుచు
నెంతనడిచిన విటికిడ్డి ♦ గంతరాదు
నెత్తి బరువెక్కె నిఁక ♦ నాకుమిత్తి లేదె!

(వాలఖిల్యాదిఋషులు చెట్లను వ్రేలాడుచు.)

వాల — తే. గీ. తిండితిప్పలు మాని యీ ♦ తీరు రేయి
పగలు చెట్లను వ్రేలాడి ♦ పక్షులట్లు
తపము చేయుదు మీశ్వరా ♦ ర్థంబు స్రుక్కి
చేరువను మోక్ష మున్నదే ♦ జీవులకును.

రాజభటులు — (సర్మద నడ్డగించి) ఎవ రీయర్ధరాత్రి గంప నెత్తుకొని పోవుచున్నారు. ఆగు మాగుము.

సర్మ — (ఆగి) నాయనలారా! నేనొకమగనాలిని. ఈగంపతో నాభర్త నెత్తికొని పోవుచున్నాను.

రాజ — గంప దింపుము.

సర్మ — (దింపును)

రాజ — (భైరవుని జూచి) వీఁడు నీభర్తయా! రోగివలె నున్నాఁడే!

సర్మ — అగును.

రాజ — తలబోడిదానికి భర్తయేమి! ఇది వితంతుస్వయంవరమా యేమి!

సర్మ — (స్వ) దైవమా! నేనీవిపత్తు నెట్లుగడవఁగలను. (ప్ర) నాయనలారా! నేనొక దిక్కులేనివత్తిని. నాయుదంత మేమని చెప్పుకొందును.

ఉ. తల్లియుఁ దండ్రి లేరని ని ♦ తం డిపుడే యిలు వెళ్ళఁగొట్టు నే
కల్లలనాడితో ఎవని ♦ కట్నము దెమ్మని కోరుచుండె నా

వల్లను గానికార్య మిది ♦ వల్లభుఁ డున్ వినఁ డెన్ని చెప్పినన్
కెళ్ళినఁ గొట్టఁబోవు తల ♦ వెండ్రుకలమ్మి ధనంబు కూర్చితిన్.

రాజు — ఆధన మేమిచేసినాఁడు?

నర్మ — సుప్రసిద్ధ నర్తకి యగు విలాసిని భోగార్థము సమర్పింపవలసి వచ్చినది. ఇప్పు డామెయింటికే పోవుచు మీ కంటఁబడినారము. మమ్ము విడువుఁడు. మీకు మ్రొక్కెదనను.

రాజు — అమ్మా! నీయుదంతము విన్న మాకడుపు చెక్కలై పోవుచున్నది. నీయట్టి శాంత శమదమాద్యనంతకల్యాణగుణములు గల యువతీమణు లీలోకమున మిక్కిలి తక్కువగ నున్నారు.

2 రాజు — తే రనవలసినదే!

తే. గీ. వయసునకుఁ జెన్న రూపంబు ♦ వట్టిమున్న
కారునలువును, బెద్దరో ♦ గంబువాఁడు
కోపి కులహీనుఁ, డజ్ఞాని ♦ కుచ్చితుండు
భర్త కానోపు నని విధి ♦ వ్రాసె నీకు.

నర్మ — (స్వ) అయ్యో! యీదండధరులు నాభర్త నేమి సేయుదురో గదా (అని యేడ్చును).

1 రాజు — తల్లీ! నీవేడ్వవలదు.

2 రాజు — ఆమెకు, ఏడ్పుగాక నవ్వెట్లువచ్చును.

తే. గీ. పెండ్లియాడి మగఁడు వెల ♦ వెలఁది పంచ
పొంచి పల్లవులకుఁ దల ♦ వంచి తిరుగు
చుండఁ గులపత్ని కని యేడ్వ ♦ కుండునొక్క
పశువు దొడ్డిపోయిన వేద ♦ వాని పగిది.

రాజు — అహా! లోకమున నిట్టి దుర్మార్గు లున్నారు!

తే. గీ. వధువు నొద్దఁ గట్నము గొని ♦ పడఁపుజెలుల
సుంకములకు సమర్పించు ♦ క్షుద్రవరులు
గలరు మన దేశమున లజ్జ ♦ గలదె వారి
జనులకు లధమంబు లల సంత ♦ పసులకంటె.

నర్మ — అయ్యలారా! నానెత్తి నీగంప నెత్తుఁడు; నేను పోయెదను.

రాజ — ఓరిబడుగా! యిప్పుడైన బుద్ధి తెచ్చుకొని యింటికిపొమ్ము.

శైర — నేను బడుగునా, నీవేమా ఘనుడ ననుకొనుచున్నావు.

తే. గీ. దంష్ట్రములఁ విప్పి వేదండ ♦ తండకుంభ
ములను జీల్చు సింహాలకో ♦ రల నగల్చు
కాలనాథుని ముంగరే ♦ ఘనులు నిలువఁ
గలరు ప్రకృతి నడ్డను వారు ♦ గలరె ధరణి.

నర్మదా! మధువు తెమ్ము. నేను బడుగునా?

తే. గీ. నల్లనగు వెంద్రుకలముడి ♦ తెల్లవడును
దేహ మంతయు ముదిరి ♦ నిస్తేజ మగును
కాలనాథునిహాతికి ది ♦ ర్ఘంతులైన
తలలు వంచి నమోయన ♦ వలయుఁగాదె!

రాజ — ఓహో! వీఁడు దేవతలకుఁ బంచాంగములు చెప్పు వానివలె నున్నాఁడే (అని నర్మద తలపై గంపనెత్తి వెళ్ళిపోవుదురు.)

నర్మ — (కొంతదూరము పోయి) ఏమాయలికిడి?

శైర — ఏదో పాడుదోమ నాచెవి కొఱికివేయుచున్నది. దాని తెగులు కుదుర్చునని రెండుచేతులతో చఱచినాను. ఏదో తాటి కాయంత మొత్తని పండు నాదెబ్బ తగిలి విచ్చిపోయిన ట్లయినది. (పెద్ద కలకలము)

నర్మ — ఏమా కలకలము!

ఖైర — ఈచెట్టంతయుఁ గదలిపోవుచు పెద్దపెద్ద మంటలు లేచు చున్నవి. నర్మదా! ఇది చూచిన నాకేమో చాల భయమగుచున్నది. వేగముగ క్రిందికి దింపుము.

నర్మ — (దింపుచు) ఆహా! ఏమి యీవిపరీతము.

వాలఖిల్యులు — ఓరోరి దురాత్మా! నిశాచరాధమా!

తే. గీ. ఒరులఁ దెగడక తపము చే ♦ యుచును నిట్లు
చెట్ల వ్రేలాడు మాచెంప ♦ చెళ్లుమనఁగఁ
గొట్టి నవ్వఁడతఁడు తుద ♦ ముట్టి తేవు
ప్రొద్దుపొడిచిన తోడనే ♦ పొలియఁగాత.

నర్మ — ఆహా! ఎంతప్రమాద మాపాదించినది.

వాల — మేము వాలఖిల్యులను ఋషులము.

ఖైర — అయ్యోనర్మదా! ఇంక నాకేదిదిక్కు? ఋషిపుంగవుల శాప మమోఘము. అప్రతిహతము. ఇంక నాచావు నిక్కము. ఆహా నర్మదా! నన్ను వదులుకొందువా? నాతప్పులు క్షమించి నాచావు తప్పించు నుపాయ మాలోచింపుము. నర్మదా! నీపాదములపైఁ బడెదను. నాకు నీవు తప్ప వేరాధారము లేదు. వేరు శరణ్యములేదు. (అని కంపించుచు),

ఉ. పాపము లెన్నొ చేసితిని ♦ పణ్యవధూటుల కంఠహారమై
మావును తేవు భోగముల ♦ మధ్యమునం బడి ప్రేమ లూరు గీ
తాపతనంబులన్ హృదయ ♦ తాపము లారగ మద్య మానుచున్
గాపుర మెల్లసౌఖ్యముల ♦ కాపురమున్ బొనరించితిన్ సతీ!

అట్టి నాకట్టి దిక్కుమాలిన చావు వచ్చినది. నర్మదా! రక్షింపవే నర్మదా! (అని కాళ్ళపై బడుచు) నేను పాషండుడనే. నేను నిరీశ్వరుఁడనే. కాని నాచెవి నీశాపము వినఁబడినతోడనే నాతొడలు కంపించుచున్నవి.

నర్మ — నాథా! మీకేమియు భయము లేదు. యీ వాలఖిల్యాదు లిచ్చిన శాపముచే సూర్యుఁ డుదయించినఁ గదా మీకు చావు వచ్చును?

శా. మార్తాండుం డుదయింపఁబోవఁడు వియ ♦ న్మార్గంబునం దొంటిమై
వర్తింపన్ సమకట్టలేఁ డలిగి యా ♦ బ్రహ్మాది దిక్పాలకుల్
కర్తృత్వంబు వహించి వచ్చినను ♦ సాగంబోవ దేనాఁడు నా
భర్తన్ జంపని వస్థతిన్ రవి నభో ♦ భాగంబుపై రాఁదగున్.

ఖైర — నర్మదా! నీమాట విని సూర్యుఁ డుదయింపకుండునా; అయ్యో! నాకింక నెక్కడియాస!

నర్మ — నాథా! భయము వలదు. సూర్యుఁ డుదయింపఁడు. మీప్రాణముల కేమియు హాని రానేరదు.

ఖైర — నేను మహాపాతకుఁడను. దుర్జనుఁడను. అవివేకిని. పరకామినీ లంపటుఁడనై నీయట్టి సాధ్విని సుగుణవతిని లావణ్యసీమను పలుబాములఁ బెట్టి తుద కావిలాసిని యను తొత్తునకై నీతలకట్టు నమ్మించితిని. నాయట్టి ద్రోహి యీ మహామహీతలమునఁ బుట్టఁబోవఁడు, లేఁడు, నాకిఁక పుట్టుగతులు లేవు. దేవీ నర్మదా! నాకేమి గత్యంతరము. అయ్యో నాయొడలు కంపించుచున్నది. నాప్రాణము లిప్పుడే లేచిపోవుచున్నవి. (తెరలో కలకలము) అదిగో! సూర్యుఁ డుదయించుచున్నాడు. పక్షులు రుతములు చేయుచున్నవి. అదిగో! ఉమన్ను! నాప్రాణము లుష్ణన చీల్చివేయుచున్న రాక్షసి, అయ్యో! నాగుండెలు నీరై పోవుచున్నవి. నర్మదా! యింకను జూచెద వేమి (అని కౌఁగిలించును).

నర్మ — నాథా! మీకేమియు భయము లేదు.

[త్రిమూర్తులు, దేవతలు ఆకాశమునుండి దిగివత్తురు]

ఖైర — నర్మదా! ఈదయ్యము లెవరే.

నర్మ — మహామహులైన ముక్కోటిదేవతలు.

భైర — వీరి నీవేమెఱుంగుదువు?

నర్మ — ఒకానొకనాడు ఘోరతప మాచరించి నేనీ త్రిమూర్తులను ఈముక్కోటి దేవతలను దర్శించి వచ్చితిని.

భైర — దేవలోకమునకుఁ బోయినవారు తిరిగి మానవలోకమునకు రారఁట గదా.

నర్మ — అగును; నేను రావలెనని వెళ్ళలేదు. వారే స్త్రీల కందు చోటు లేదని నెట్టివేసినారు.

భైర — అటులైన నిప్పుడు వీరిచ్చటి కేలవచ్చినారు?

నర్మ — వారు సర్వసమర్థులు.

భైర — అయిన,-

నర్మ — కర్మసాక్షి యగు సూర్యభగవానుఁ డుదయింప లేదని చెప్పుటకు వచ్చినారు.

భైర — నిజముగా!

నర్మ — అగును.

భైర — శహబాష్ నర్మదా! శహబాష్. నీశక్తి నెవరు వర్ణింపఁ గలరు? నీవు మహాపతివ్రతవు. నీమూలముననే నాకిన్ని గారములు జరిగినవి. దేవీ నర్మదా!

తే. గీ. అడుగుమోపినఁ గసుగందు ♦ ననుచు మాట
లాడుచోటను రతనంబు ♦ లూడుననుచు
గంటికిని రెప్పవలె నాత్మ ♦ కాంతునకును
సేవచేసిన కులకాంత ♦ వీవుగావె!

దేవీ! నేనన్ని జన్మము లెత్తినను నీఋణము దీర్చుకోలేను. నన్ని విపత్తునుండి కాపాడుము.

రుద్రుడు — లోకమున కెంత విపత్తు సంభవించినది.

చం. ఒకసతి గాంచిపెట్టినక ♦ లోర్వి వెలింగెడు కర్మసాక్షి నేఁ
డకట నభంబుపై వెలుఁగ ♦ డాయెను జగంబు లయంబు నొందఁగా
నకటకటా యనున్నది ప్ర ♦ భిన్నములయ్యెను కర్మ లెల్ల నీ
ప్రకృతి నికృష్టపంపరలఁ ♦ బాయుట యెట్టులో తోఁచదయ్యెడిన్.

విష్ణు — అస మానుమని నర్మదనే కోరవలయును.

బ్రహ్మ — అగును.

రుద్రుడు — నర్మదా! (అని సమీపించుదురు).

నర్మ — త్రిమూర్తులారా! మీకు నమస్కారము.

త్రిమూర్తులు — కల్యాణివి కమ్మ.

రుద్రు — నర్మదా! నీవు త్రిలోకపూజిత వగు మహాపతివ్రతవు. నీ శాసన మనుసరించి కర్మసాక్షియగు సూర్యుఁ డుదయింపలేదు. జగజ్జీవలోక మంతయు లయమైపోవుచున్నది. ఇది మహాఘోరము. కావున నీశాసన ముపసంహరింపుము.

నర్మ — దేవతలారా! మీయాజ్ఞ శిరసావహించెదఁ గాని, నా పతి కారాటము రాకుండ మీరు కాపాడుదుమని సమయము చేయుఁడు.

బ్రహ్మ — అది యసంభవము.

విష్ణు — ఈవిషమస్థితి గడచుట యెట్లు? అది మునిశాపము; ఇది పతివ్రతా మాహాత్మ్యము!

తే. గీ. అస్త్రములు రెండు కలసి పో ♦ రాడెనేని
రెంటి నొకసారి యుపసంహ ♦ రింపరాదు
కర్తివలె పర వాడియై ♦ గ్రాలుచున్న
దేనిలో నేది యిమిడి శాం ♦ తింపఁ గలదు.

నారదుఁడు — (ప్రవేశించి) దేవదేవులారా! కర్మ సాక్షియగు లోక

బాంధవుని యుగ్రశక్తి వలన పదునాలుగు భువనములును, [illegible]కోటి జీవరాసులును తల్లడిల్లి పోవుచున్నవి. దేవతలు నిర్విణ్ణులై పోయినారు. లోకము లన్నియు చల్లారిపోయినవి. ఇంకను మీరూరకుండిరేల?

రుద్రు — నారదా! ఇంక నేమి కర్తవ్యము?

నార — మీరిట్లు మీనమేషములు లెక్కించుచుండిన కార్యములేదు.

చం. కల దొకసాధ్వి యత్రిముని ♦ కాంత సముజ్జ్వల కాంతిపూత ని
ర్మలమతి, సాధుశీల, గుణ ♦ రాశి తపస్విని పుణ్యసీమ కో
మలి, యనసూయ, సూనృత స ♦ మంజసభాషిణి వేడనేని యీ
విలయము వాయు భానుఁ డుడు ♦ వీథి వెలుంగును గర్మసాక్షియై.

విష్ణు — నారదా! గంగావిషయమునఁగూడ నీవిట్లే ఖడ్గవాదము చేసితివి.

నార — అగును. మీరెవ్వరివలనఁగూడఁ గాని యామె శాపవిమోచన మాయనసూయ ఆలోకన మాత్రమునఁ గావించిన దింతకన్న నేమి గావలయును! మీమాటలు మీరే యుపసంహరించుకొనవలసి వచ్చునని నే నానాఁ డనలేదా?

బ్రహ్మ — అగును.

రుద్రు — సరే! ఆ యనసూయాదేవినే ప్రార్థింతము రండు.

ఉ. ఓ యనసూయ! సాధ్వీ విమ ♦ లోజ్జ్వల చారుకళాకలాప తే
జోయుత సచ్చరిత్ర గుణ ♦ శోభిత నర్మదశాపసంహతిన్
ఆ యినుఁ డంతరించెను న ♦ జాండము చీకటివారెఁ గర్మముల్
పోయెను జీవజాలములు ♦ పోయెను దేవి సముద్ధరింపవే.

(అత్రి అనసూయలు ప్రవేశింతురు)

దేవదేవులారా! నమస్కారములు.

త్రిమూర్తులు — శుభం భవతు.

విష్ణు —

ఉ. ఓయనసూయసాధ్వి విమ ♦ లోజ్జ్వల చారుకథాకలాప తే
జోయుత సచ్చరిత్ర గుణ ♦ శోభిత నర్మదశాపసంహతిన్
ఆయినుఁ డంకరించెను న ♦ జాండము చీకటివారెఁ గర్మముల్
పోయెను జీవజాలములు ♦ పోయెను దేవి సముద్ధరింపవే.

అనసూయ — మహనీయులైన మీవలనఁ గాని కార్యము నాచరింప నేనెంతదానను?

అత్రి — ఈనర్మద యెంత ధన్యురాలు!

తే. గీ. దేవలోకంబు తపసుచేఁ ♦ బోవకున్న
దేవతలనెల్ల సాధ్వి యై ♦ డింపె నేల
కీపతివ్రత నర్మద ♦ కెవ్వరీడు
భానుఁడుదయింపఁడే దేవి ♦ యానవలన.

రుద్రు — అనసూయా! నీవు తడవు నేయువలదు.

బ్రహ్మ — ఈనర్మదశాప ముపసంహరించుట కీవే సమర్థురాలవు.

అన — మీయాదేశము శిరసావహించుచున్నాను. నర్మదా!

నర్మ — అనసూయా! నమస్కారము.

అన — కల్యాణివి కమ్ము, నర్మదా! యీ లోకేశ్వరులైన దేవతలందరు నీయాన నుపసంహరింప బ్రార్థించుచున్నారు.

నర్మ — అగును.

తే. గీ. విబుధు లిటువచ్చి వేడిన ♦ వేఁడవచ్చు
భువనములు చెడిపోయినఁ ♦ బోవవచ్చు
జనులు చీకటిఁ జచ్చినఁ ♦ జావవచ్చుఁ
గాని నాపతి ప్రాణంబు ♦ పోవరాదు.

అన — సోదరీ! నర్మదా! నీ పతిప్రాణము కాపాడుటకు నే నభయ

హస్త మిడుచున్నాను, నీవు నీయూన నుపసంహారించుము.

నర్మ — సరే, అట్లే సేయుచుము.

(చేతులు మోడ్చి,)

తే. గీ. జగములకు కర్మముల కెల్ల ♦ సాక్షివీవు
తమ్ములకు, లోకములకు, బాం ♦ ధవుఁడ వీవు
అట్టి నినుఁ దిట్టి పాపంబు ♦ గట్టుకొంటి
నినుఁడ! నా మొఱ విని యుద ♦ యింపవయ్య.

(సూర్యుఁ డుదయించును. దేవతలు అర్ఘ్యము లిచ్చెదరు.)

ఉ. ఓ సరసీరుహా ప్త! యున ♦ లోజ్వల తేజ జగత్త్రయైక మి
త్రా నురలోకచైత్ర భవ ♦ దాగమనంబున జీవకోటి సం
త్రాసము వాసెఁ గర్మ పము ♦ దాయము దక్క నిశాపిశాచ ము
ద్వాసము నొందె రాక్షస ని ♦ వాసము డిందె నమో విభాకరా.

ఖైర — హా! దేవీ,

తే. గీ. ప్రాణములు పోవుచున్న వ ♦ య్యయ్యొ యింక,
నేమి సేయుదు నెవ్వరి ♦ నేఁదలంతు;
నర్మదా! యొంటి నుందువే ♦ నన్ను వీడి,
ముండి నా జన్మ మూణ్ణాళ్ళ ♦ ముచ్చటయ్యె.

(అని ప్రాణములు విడుచును)

నర్మ — హా! నాథా నాథా!

సీ. నిను బాసి యొఱుఁగను ♦ నీతోడిదే లోక
మని మనంబున నెంచు ♦ కొనుచునుంటి,
నీయూన దాటక ♦ నీపాదసేవయే,
మోక్షదాయకమని, ♦ మ్రొక్కుచుంటి,

పతిదైన గురుడైనఁ ♦ బరమేశ్వరుండైన,
సీవె యనుచును మది ♦ నెంచుచుంటి,
నాపెన్నిధానంబు ♦ నాపుణ్యఫలము నా
యాత్మ తేజంబని ♦ యలరుచుంటి,
తే. గీ. అట్టి నిను జంపుకొంటి నా ♦ యంత నేన
పాపముల బండికిని గూడు ♦ వైచుకొంటి
హా తపోనిధీ! నాకు వైధవ్య ♦ మబ్బఁజేసి
తృప్తినొందితె యిటుల నే ♦ నేడ్చుచుండ.

అన — తల్లీ నర్మదా! యేల వగచెద వమ్మా! ఊరడిల్లుము. నీ ప్రాణేశ్వరున కేమియు హానిలేదు.

నర్మ — సోదరీ! యింకను హాని లేదనుచుంటివా! అయ్యో! సూర్యుఁ డుదయించుటతోడనే నాభర్త యసువు లంతరించిపోయినవి. ఆబ్రాహ్మణ మునిశాప మమోఘము. ఇంక నాకెక్కడి శాంతి, యెక్కడి యూరట! హా! హా తపోనిధీ! (అని మూర్ఛిల్లును)

అన — నర్మదా! వగవవలదు.

రుద్రు — ఆహా! యీ యనసూయ మహాత్మ్య మద్వితీయము. అనుపమానము.

విష్ణు — దేవతలవలనఁగూడ సాధ్యముకాని కార్యము మీ యన సూయ తృణప్రాయముగఁ జేసి వేయుచున్నది. మహాపతివ్రతలకుఁ గాని కార్య మేమున్నది.

బ్రహ్మ — అగును.

రుద్రు — నేఁడీమెచేసిన మహోపకారమునకు మన మెచ్చెరు వంద వలయునుగదా!

నార — మన మీమె నేమని కొనియాడఁగలము. (అని అందఱు కలసి,)

ఉ. ఓయనసూయ నీదు మహి ♦ మోజ్జ్వల తేజము, కీర్తి దిక్కులన్
ప్రోయుచునున్న దోసతి త్రి ♦ మూర్తులుసైతము నిన్నుఁ బోల లే
కీయెడ మీాన మేషముల ♦ నెంచుచు నుండిరి సత్ప్రతిప్రతా
ప్రాయికమైన శక్తినిఁ బ్ర ♦ పంచము చాటఁగఁ జేసి తంగనా!

(అని పూలు గురియుదురు)

అన — దేవతలారా! యిదియంతయు మీాయాశీర్వాద ప్రభావము.

దేవ — నీసౌజన్యత ప్రశంసనీయము. నీకేదికావలయునో కోరుము. మేము వరమిచ్చెదము.

అన — మహాభాగ్యము.

తే. గీ. బడుగు ముక్కాలి ముసలివాఁ ♦ డనుగు మోప
లేని రోగి, మానర్మద ♦ ప్రాణవిభుఁడు
ప్రాణములు వాసి సూర్యుని ♦ రాకవలనఁ
గాన బ్రతికించి పుణ్యంబు ♦ గట్టుకొనుఁడు.

దేవ — రుజాగ్రస్తమై చివికిన జీర్ణశరీరముతో మరణించిన యీ నర్మదా వల్లభుఁడు సువర్ణశరీరుఁడై బ్రతికి లేచునుగాక!

ఆకాశవాణి — "తథాస్తు"

భైరవుఁడు — "లేచును"

[తెరపడును]

రంగము — ఏటియొడ్డు.

(అత్రి అనసూయలు ప్రవేశించి యుందురు)

అత్రి — దేవీ! యీనర్మద యెంత ప్రవహించినదేమి!

అన — సూర్యోదయాంతమునకు భైరవుఁడు సజీవుఁడైన తోడనే తనకు శిరఃస్నానము ప్రసాదింపఁ దలఁచి నర్మద పొంగినది.

అత్రి — నీవు చెప్పినది నిజము, ఆహా! యీమె నా భైరవపాతకుఁ డెన్ని బాధలు పెట్టినాఁడు.

అన — సాధ్వియై యోర్చుకొన్నది. కావుననే,

ఆ. గీ. తపముఁ జేసి దేవ ♦ తల గెల్వలేకున్న
వరపతివ్రత యయి ♦ సురల నెల్ల
నేల దింపె; రవిని ♦ గాలాడనీయకే
దమృతపేటి నర్మ ♦ దావధూటి.

అత్రి — ఈమె ధన్యురాలు.

తే. గీ. దుష్టుఁ డగు భర్త కోపాగ్ని ♦ దూలి మిగుల
కైవడిని మాడి మాడి దుః ♦ ఖములచేతఁ
జివికి చివికి విశీర్ణలై ♦ జీవములను
బాయు సతులెల్ల నేఁటులై ♦ పారుచుంద్రు.

ఆమావమునన్నైన, గొంత యుపశాంతి గలుగునని —

తే. గీ. జన్మము తరింప నీ ప్రపం ♦ చకమునందు
స్వర్గమునుమించు పుణ్యాస్ర ♦ వంతి వగుచు
నెందఱినో పూతులుగఁజేయు ♦ సిద్ధచరిత
నర్మదా! నీవు మిగుల ధ ♦ న్యవుగదమ్మ.

గంగ — (ప్రవేశించి)

తే. గీ. అమరు లొనరించునట్టి కా ♦ ర్యములు మనుజ
వనితలు మహాపతివ్రతా ♦ త్వమునఁ జేయఁ
గలుగుచున్నారు నాకట్టి ♦ గతి లభింప
కార్తనై పాపదేవత ♦ కగ్గమైతి.

అనసూయా పవిత్రభావమున సర్వకసీయోషాంశమున మాసిపోయినది. నారదుని యాదేశానుసారము నేను ఆ యనసూయచే నాశ్రయించెదను. ఆమెజాడ యీ సమీపముననున్న వారి నడిగెదను. (అత్రి యనసూయలను సమీపించి) ఆర్యులారా!

చం. అడుగుట తప్పుగాని యొడ ♦ నద్భుతమయ్యెను మీర లెవ్వరో
నుడువుఁడు మ్రొక్కెదానను మ ♦ నో హరరూపము మాటుజేసిన
ట్టడవిఁ బురాణదంపతుల ♦ యట్టులఁ దోఁచెద రార్యులార! నా
యెడ దయయున్న, సాధ్వి పర ♦ మేశ్వరి యాయనసూయఁజూపరే.

అత్రి — ఆహా! ఈమె గంగాదేవి, మనపై కరుణచే మరల ప్రసన్న మైనది.

అన — అమ్మా! గంగా! నీవు మమ్మేలుఁగవా, నీవు మమ్ముద్ధరించిన దానవే గదా!

గంగ — అగును. మీ కులగోత్ర నామముల నేనెఱుంగక పృచ్ఛఁ జేసితిని, పొరపాటున్న మన్నింపుఁడు.

అత్రి — మహనీయవైన నీకుఁ బొరపాటేమిటి?

అన — సర్వజ్ఞవును సర్వశక్తి స్వరూపవును సర్వాంతర్యామిని వైన నీకుఁ దెలియని దేముండును.

గంగ — ఆ మహాసాధ్వి ఆ యనసూయను సందర్శించి నాపాప పరిత్యాగము గావించుకొనుటకుఁ గోరుచున్నాను. మీ రెఱింగితిరేని నా కగపరచి పుణ్యము గట్టుకొనుఁడు.

సీ. ఏ పతివ్రతాతిలక ♦ వాసంబు పతిసేవ
చే నమరావతి ♦ జేరెనొక్కొ
యే పుణ్యసతి తన ♦ రూపంబు పతిరూపు
లోఁ జూచి యానంద ♦ లోలయగునొ
యే సాధుశీల వి ♦ ద్యాసముల్లాసయై
యధ్యాత్మ తత్వంబు ♦ నందె నొక్కొ
యే సతీమణిమాళి ♦ యుద్ధసద్గుణముల
శాణాదియై ప్రేమ ♦ గలిపెనొక్కొ
ఆ. వె. ఏమనోహరాంగి ♦ యీరేడుజగములఁ
దపముచేత వన్నెఁ ♦ దాల్చెనొక్కొ
అట్టి యత్రిజాయ ♦ అనసూయ అనసూయ
గొలువఁ గలుగుచయము ♦ తొలఁగుఁగాదె!

అత్రి — ఈమెయే అనసూయ.

గంగ — ఆహా! నేనెంత ధన్యురాలను. అత్రి అనసూయల నొక్క ప్రదేశమునఁ జూడగంటిని. తల్లీ! అనసూయా! నమస్కారము.

అన — పాట.

భవభయ వికారసంహారిణి నుతగీర్వాణీ, భజతే భాగీరథీ ॥భవ॥
శివుని శిరోపరి చూడాతలమున, నిరంతరము బస
మురాంతకుని పద కమలము జన్మవసుంధర నీకో
సజలవాసినీ నిరతభాసినీ ॥భవ॥

గంగ — పాట

నిను గనుఁగొంటిని నాపాపంబులు
శమించినవి శుభ సముజ్జ్వలాంగీ!
పతిపగు నీవనసూయవు గావా

కలుషనాశినీ కళావాసినీ
భవభయవికార సంహారిణి నుతగీర్వాణీ,
భజతే సాధ్వీమణీ ॥భవ॥

అన — అమ్మా! భాగీరథీ! నీఋణము మేమెట్లు తీర్చుకొనఁగలము? నేనును నాభర్తయు ప్రచండ మహాశపమున కోర్వలేక మిక్కిలి దాహార్తులమై నీళ్ళకై కాననాంతర గిరిదరీకటంబు లన్నియు వెదకి తుద కుదకకణంబులు గానక ప్రాయోపవిష్టులమై పరమదౌర్భాగ్యమైన మరణమునకుఁ బాల్పడనుండ నీవు నీనిర్వ్యాజ కరుణాకటాక్షమున మాకుఁ బ్రసన్నవై కాపాడితివి. మాజనపదంబు లన్నియు రక్షింపఁబడినవి. తల్లీ! నీవు మాకెల్లరకు జీవనదాత్రివి. నీఋణము మే మెట్లు చెల్లింపఁగలమో చెప్పుము.

గంగ — దేవీ! అనసూయా నాయుదంత మాలకించి నాపాపవిమోచనము గావింపుము.

తే. గీ. శంతను సమాగమమున సుత ♦ సప్తకంబు
నల కృతాంతాశ్రయంబున ♦ కంపినట్టి
పాప మిారూపమున నన్ను ♦ రూపడంచు.

పాప — హుం.

గంగ — హా హతోస్మి. "వెంటఁబాయదు క్రీనీడ ♦ విధముదోప" సోదరీ! అనసూయా! లజ్జావనతవదననైన నాదుశ్చరితమేమని చెప్పనోపుదును. (పై పద్యమును చదివి) ఈపాపోపశమనార్థము త్రిలోకంబులు తిరిగి త్రిమూర్తులవేఁడి త్రిపథగామినినై తుదకు గతిగానక హతాశనై వేగి నాకర్షోవ దేశమున నీదర్శనార్థ మేతెంచితిని. తల్లీ! నాపాప ముపశమింపఁ జేయుము. (అని కాళ్లపైఁ బడును).

అన — (లేపి) అమ్మా! నీవు మాప్రాణదాతవు. కాక, అహోరాత్రీణివైన లోకమాతవు. నీకు పాపకళంక మెట్లు పోకఁగలదు. అది కేవలా

భాషణము. ఓపాడు పాపదేవతా! నీవు తొలఁగిపొమ్ము. (అని మంత్రోదకము జల్లును. పెద్దమంట లేచి దేవత కాలిపోవును.)

గంగ — నేనెంతధన్యురాలను. రక్తాక్షియు రక్తస్వరూపిణియు రక్తావలేపనావిలవికారయు నగు నాపాపదేవత తొలఁగినది. అనసూయా! నీపాతివ్రత్యమాహాత్మ్యము త్రిలోకపూజ్యము. అనన్యసామాన్యము. అనుపమానము.

తే. గీ. మూఁడుమూర్తులు ముల్లోక ♦ ములకు విభులు
దీర్పలేనట్టి కార్యంబుఁ ♦ దీర్చినావు
వీరపతివ్రతలకు సాధ్య ♦ పడనిదేది
అంబ! జోహారు నీరాజ ♦ నంబులివిగో.

గంగ చెలికత్తెలెల్లరును ఆకసమునుండి దిగివచ్చి పై పద్యము చదివి (హారతి పట్టుదురు)

గంగ — (పాట)

ప్రేమకుసుమాంజలిని గొమ్మిదె హారతీ
పాపముక్తనయి ధన్యురాలనయి మ్రొక్కుదాన నా ॥ప్రే॥

గంగ — సోదరీ, అనసూయా! ముం దెట్టి దోషదేవతలును సోకకుండ నాకేదేని కామొత్తు నొసంగవమ్మా.

అన — అమ్మా! గంగా! నీవు సకలదోష పరిహారిణివి. సకలపాపసంహారిణివి, సకల తాపోపశాంతి సాధనమవు. నీకు నే నేమిచ్చిన నీఋణము దీర్పఁగలను. అయినను నీవడిగితివి గావున,

తే. గీ. పొలఁతుల నుదుటఁ గస్తూరి ♦ బొట్టు దృష్టి
దోషములఁ బాపుగతి నిల ♦ దోషములను
నిందుగ ఫలంబు జూపుచు ♦ నుండు సతము
ఇదియె కామొతు మెడ ధరి ♦ యింపవమ్మా!
(అని యిచ్చును)

గంగ — మహాప్రసాదము. (అని తీసికొనును)

పాపదేవత — హా! అనసూయా! ఎంతపనిజేసితివి.

మ. చిరకాలంబును గంగవెంటఁబడి మా ♦ చిత్తంబు రంజిల్ల దు
ష్కర దుర్వార దురాగతంబయిన దో ♦ షవ్రాలలోముంచి యా
పరఁగావించితి మట్టి మా కడుగుసం ♦ ప్రాప్తించె నాయిందుగఁ
అరితోడమ్యో నికేది దారి యనసూ ♦ యా శాపబాణాగ్నికిన్.

అన — ఓదేవతా! నీవు వగవఁ బనిలేదు. ఈ గంగా పురస్కార ప్రవేశమున నిన్ను ముక్కోటిదేవతలు ముప్పదిమూఁడుకోట్ల భారతీయులు నరసురాసుర యక్ష కిన్నరాదులతోఁగూడ నీనామస్మరణము సేయఁగలరు. లెమ్ము! పొమ్ము.

దేవకన్యలు — గంగా! నీవు లేని దేవలోకము పాడువడి యున్నది.

గంగ — ఈ యనసూయా దయాదృష్టిని తిరిగి మిమ్ము నేను కలిసికొను భాగ్యము సంఘటించినది.

తే. గీ. మూఁడుమూర్తుల యిల్లాండ్రు ♦ మూఁడులోక
ములకు తల్లులౌ వారికి ♦ నలవిగాని
పాపసంహార మొకతృణ ♦ ప్రాయమట్లు
జేసె ననసూయ సామాన్య ♦ స్త్రీయె తలఁప.

దేవకన్యలు — కాదు. ఈమె మహాపతివ్రతా తిలకము. ఈమెకును తక్కిన పతిలోకమునకును చాల తారతమ్యము గలదు.

తే. గీ. శాంబరీభిల్లు పాశుప ♦ తంబు వాడి
కానఁ బసులకావరి ములు ♦ గట్టివాడె
లోనభేదంబె పడఁతుల ♦ లోనఁగలదు
రాయి రత్నంబు నొకటన ♦ కాదుగాదె!

గంగ — అమ్మా! అనసూయా! నీయిష్టార్థములన్నియు ఫలించును గాక. నీకెవరివల్లను నాపాతము సంఘటిల్లదు. నీవఖిలజగంబులకుఁ దల్లివి కాఁగలవు. మీ యాశ్రమసమీపమున నేనెల్లకాలము జలస్వరూపనై సేవించెదను. (అని యుద్దియును. దేవతలు పూలు వర్షింతురు.)

అందఱును — మహానీయులగు నో దంపతులారా! నమస్కారము.

(అని విమానమునెక్కి వెళ్ళిపోవుదురు.)

అత్రి — దేవీ! జలావగాహమున నీసన్ప్రకృతి యెంత విచిత్రముగా మాఱిపోయినదో చూచితివా ?

అన — ఒక్కవనమేమి, జగత్ప్రకృతియే మాఱిపోయినది.

అత్రి — అగును.

చం. జగమును మాన్చి వేయఁగల ♦ చండమయూఖుఁ డెల్ల జల్లనై
నెగడెను; సాంధ్యరాగములు ♦ నింగినిఁ బర్వె దినాంత వేళలన్
దగిన విలాససూచన ల ♦ నంతము దోఁచెను, మేఘపంక్తులన్
గగనముఁ గప్పె నెమ్మియది ♦ గాంచుము నాడెనుఁ జూడుముంగనా!

[తెరపడును]

పంచమాంకము

రంగము – అత్ర్యాశ్రమము

(అత్రి అనసూయలు ప్రవేశించియుందురు. అత్రి తపము చేయుచుండును; అనసూయ రాటము వడకుచుండును.)

అన — ఆహా

తే.గీ. పెద్దకాలంబు తపము గా ♦ వించుచున్నఁ
గర్మబంధాలు తెగకుమా ♦ ర్గంబె తోఁచ
దల త్రిమూర్తులు వచ్చి ప్ర ♦ త్యక్షమైనఁ
దలఁపు విడిపోయి సద్గతి ♦ కలుగు నేమొ.

(త్రిమూర్తులు బ్రాహ్మణవేషములతో ప్రవేశించుదురు)

బ్రహ్మ — ఇదే మహర్షి అత్ర్యాశ్రమప్రాంతకాంతారము.

విష్ణు — ఆహా! యెంత సొగసై విరాజిల్లుచున్నది.

ఉ. పాఱెడునేళ్ళు పచ్చికలఁ ♦ బండిన లేళ్ళను చెట్లనుండి సొం
పారెడుపండ్లు పూపొదలఁ ♦ బక్షులగూండ్లు వెలార్చువిశ్వసం
సారము నైంద్రజాలికుఁడు ♦ చక్కఁగ నొక్కెడ జూపురీతి నొ
ప్పారెడు నీవనంబు కడు ♦ భావనులకు బొనరించు నెల్లరన్.

రుద్రు — అగునగును.

ఉ. అత్రి విశాలతత్త్వవిముఁ ♦ డైనను నీయనసూయ వానికిన్
క్షేత్రముగా లభించుట వ ♦ సిండికిఁ దావిలభించినట్లు లో
కత్రయపూర్ణకీర్తియు వి ♦ కాసము గల్గె రసంబుకాంతితో
మైత్రిఘటించె నిచ్చట స ♦ మస్తకళాకలితప్రకాండమై.

బ్రహ్మ — మన బ్రాహ్మణవేషములు సమర్థనీయములే గదా?

రుద్రు — సహజవైదికుఁడవైన నీకాయిబ్బందిలేదు.

బ్రహ్మ — నీకుమాత్ర మేమిలోటున్నది?

ఉ. అక్షరమూర్తి మన్మథుని ♦ నాహుతిజేసినభూతిరాశి రు
ద్రాక్షలు వేసి వాసిచెడ ♦ దండకమండలధారివై తపో
దీక్షను వల్లకాడులను ♦ ద్రిమ్మరు నీవు స్వభావసిద్ధుఁడో
భిక్షుఁడవే వినూత్నమగు ♦ వేషముగాదిది నీకు శంకరా!

విష్ణు — అగునగును.

రుద్రు — కేశవా! నీవును, ఒకప్పుడు బ్రాహ్మణుఁడవే!

తే.గీ. అదితికశ్యపులకు ద్విజుఁ ♦ డై జనించి
బిక్షమడుగఁగఁబోయిన ♦ విధమునీకు
జ్ఞప్తియందుండవచ్చునా ♦ నాఁటిరూపు
వాసనావేశితంబయి ♦ వచ్చెనిపుడు.

బ్రహ్మ — అదిగో! మననారదుఁడు వచ్చుచున్నాఁడు.

నార — (ప్రవేశించి) త్రిమూర్తులగు మీకు నమస్కారములు.

త్రి — నీకు శుభమగునుగాక!

నార — ధన్యోస్మి.

తే. గీ. వాయువువిధానఁ గలదు మీ ♦ వాసముఖిల
దిశల రవివలెఁ గలదు మీ ♦ తేజమవని
అన్ని మీయందె కలవు మీ ♦ రన్నిటఁ గల
రనఘులార నమోస్తు మ ♦ హాత్ములార!

విష్ణు — నారదా! నీరాక మాకు మిగుల శుభావహము.

నార — దేవతలారా! మీరెచ్చటి కేగుచున్నారు?

రుద్రు — అనసూయా పరీక్షార్థము.

నార — పాప ముపశమించునుగాక.

బ్రహ్మ — ఏమి యట్లను చున్నావు?

నార — మహాపతివ్రతలఁ బరీక్షించుటయన్న మహాదోష దూషిత మగు నకార్యముకాదా!

విష్ణు — కాదు.

నార — అట్లనుట గొప్పసాహసము.

రుద్రు — అదే యిప్పు డూహించుచున్నది.

ఆ. వె. ఒకతె రవిసి యడ్డె, ♦ నొక్కతె దివిజగం
గావధూటి శాప ♦ గతిని మాన్చె,
నింక దేవలోక ♦ మీ మర్త్యకాంతల
కాళ్ళధూళిచేతఁ ♦ గ్రాలవలసె.

చం. గగనముఁ జేల్పవచ్చుఁ జను ♦ గంగను బావులు సేయవచ్చు నా
లుగు పదిలోకముల్ క్షణము ♦ లోపల గెల్వఁగవచ్చు వార్ధిలో
నగములఁ దేల్పవచ్చుఁ గుల ♦ నాగము లెత్తగవచ్చుఁగాని యా
సుగుణ పతివ్రతామణుల ♦ జోలికిఁ బోవఁగ రాదు భ్రాంతులై.

విష్ణు — నారదా! మా కసాధ్యము లున్నవా.

మ. మునులంచున్,మహనీయమూర్తులని మా♦మోలన్ బ్రగల్భంబు లా
డిన రంభాదుల నంపి వారల నొగిన్ ♦ డిండింపమో యక్లై యీ
వనితన్ సాధ్విఁ బరీక్షచేయుటకుఁ బో ♦ వంజెల్లదే మాకు వ
హ్నిని బంగారమె ముచ్చెమో కరఁగికా♦దే చూతురత్యంతమున్.

నార — స్త్రీలవిషయము. వారిని పరీక్షించు టనునదియే ప్రమాదము, పతివ్రతలగు సాధ్వీమణులుండిరన్న వారిని మన మెంతయుఁ గొనియాడవలయును. పోయి సంవిధానము సేయవలెను.

రుద్రు — అనఁగా?

నార — ఎఱిఁగియుండి నన్నడుగుదురేల!

తే. గీ. అతివయొర్తు బ్రహ్మాదుల ♦ కలవిగాని
పసు లొనర్చినఁ బూజింప ♦ వలయుఁగాదె
మింటిపైఁ బూలు పూచిన ♦ వింటినాకి
యాకుఁ దొడిఁగిన నివ్వెర ♦ గందవలదె.

విష్ణు — కావుననే పరీక్షింప నూహించుచుంటిమి.

నార — వల దది ప్రమాదము. మఱచితివా. నర్మద సూర్యు నుదయింపకుండ నరికట్టినది. అప్పుడు మీరేమైనఁ జేయఁగలిగితిరా?

తే. గీ. నిగురుగల నిప్పుపై నీఁగ ♦ లెగురఁగలవె
భానుబింబంబుపైఁ జెద ♦ పట్టఁగలదె
అట్టు లాసాధ్వి యనసూయ ♦ నంట నెవరి
తరము మృత్పాత్ర మేరువు ♦ దాకినట్లు.

బ్రహ్మ — నారదా! నీవు మర్యాద నతిక్రమించి మాటాడుచున్నావు. చూడుము నిన్నొక తృటిలో మాడ్చివేయుదును.

నార — అగును. నన్ను మాడ్చివేయుట సులభమేగాని అనసూయా విషయ మట్టిదిగాదు. గంగాశాపవిమోచన సందర్భమునను, నర్మద ప్రాణేశ్వరుని సందర్భమునను ననసూయ మహత్వ మెఱిఁగి యుండి పొరపడ నగునా?

తే. గీ. పడమటింటి సూర్యుని దూర్పు ♦ నడప వైవు
త్రిప్పవచ్చునుగాని యేం ♦ త్రిప్పలు వడి
అత్రిమునిజాయ ననసూయ ♦ నంటలేరు
కడకు భగ్నాశులై పోవఁ ♦ గలరు మీరు.

రుద్రు — ఈతఁడు మున్నొకప్పుడిట్లే మాతో వాదించినాఁడు.

బ్రహ్మ — ఈతఁడొక పాషండవాదిమూర్ఖుఁడు.

విష్ణు — మద్భక్తుఁడైనను కలహాభోజనుఁడైన నారదుని యహితాలాపములు క్షంతవ్యములు కావు.

నార — (స్వ) ఇది యేదో ప్రమాదమునకే వచ్చినది. (ప్ర) దేవదేవులారా! నానుడువులు మీకు కటువైనను నేనింతవఱకు వీరిడిన్ని భయంబు దక్కి వచించినందుకు మన్నింపుఁడు. కాని,

శా. సీతన్ బట్టిన రావణుండు, శచి రా ♦ జీవాక్షి వంచించి దు
ర్నీతుండై నహుషుండు; దేవి దమయం ♦ తిన్ గోరి బోయండప
ఖ్యాతిన్ భీతిసి ముందిసట్టు ఁనసూ ♦ యన్ డాసి మీరీవయిన్
వీతజ్ఞానులు కాఁదలంపకుఁడి నా ♦ విజ్ఞప్తి నాలింపుఁడీ.

(అని నిష్క్రమించును.)

అత్రి — (తపస్సునుండి లేచి) దేవీ! అక్కడ నెవ్వరో అతిథులు వచ్చి వేచియున్నట్లు లున్నది. మనము పోయి సంవిధానము చేసి తీసికొనివచ్చెదము రమ్ము.

అన — మహాభాగ్యము. తమ తపస్సు ఫలించి ప్రత్యక్షమైన త్రిమూర్తులవలె నున్నవారి నవశ్యము మనము సన్మానింపవలయును.

(అని వెళ్లుదురు)

త్రిమూ — అత్రి, అనసూయ యీవంకకే వచ్చుచున్నారు.

అత్రి — మహనీయులగు భూదేవతలారా! నమస్కారము. నేఁడు మాకుటీరమున నిలిచి మాయొసంగు నాతిథ్యమును స్వీకరించి మమ్ము తరింపజేయఁ బ్రార్థించుచున్నాము.

రుద్రు — పూజ్యులారా! మీనామధేయము లేమి?

అత్రి — నాపేరు అత్రి. ఈయమ నాభార్య అనసూయ. ఇది మాయాశ్రమము.

విష్ణు — ఓహో! జగత్ప్రసిద్ధ చరిత్రులైన మిమ్ము దర్శించి తరించితిమి.

బ్రహ్మ — మీరు లోకత్రయ పూజ్యులు; మహానుభావులు.

రుద్రు — అగును.

అత్రి — ఆర్యులారా! [illegible] ప్రొద్దు పోయినది. వేగిరము లెండు పోవుదము.

బ్రహ్మ — మేమిదినము కెవ్వరియింటను మెసవియుండలేదు.

రుద్రు — మాకాహారము కొంచు.

విష్ణు — సామాన్య మానవ మాత్రులు మమ్ము సంతృప్తులను జేయఁ జాలరు.

అత్రి — పూజ్యులారా! నన్ననుగ్రహింపుఁడు. నా శక్తివంచనము లేకుండ మీకాతిథ్య మిచ్చి పూజించెదను.

బ్రహ్మ — దుర్లభమైన యిట్టిపనికి సాహసింపకుము.

రుద్రు — ఆవల నోడిపోవలసి వచ్చును.

విష్ణు — తుదకు మాపని అధ్వాన్నమగును.

అత్రి — అట్లానతీయవలదు.

బ్రహ్మ — మాకేమి నమ్మకము.

రుద్రు — తప్పక ఆతిథ్య మిచ్చెద నని శపథము సేయుము.

విష్ణు — నీవేకాదు నీయర్థాంగికూడఁ జేయవలయును.

అత్రి — అవశ్యము—

చం. విధులునశించినన్ గులము • వీడినఁ బ్రాహ్మ్యముపోయినన్ సదా
మధురగుణప్రయుక్త కుల • మానిని యీయనసూయ బాసినన్
బుధజనులార నేనతిథి • పూజను వీడను నమ్ముడింక నా
విధుఁడు త్రిమూర్తు లర్కుఁడును • విశ్వము సాక్షులుగాగ నిమ్మెదన్•

బ్రహ్మ — శహభాస్ అత్రి! నీవొక్కఁడవె కార్యశూరుఁడవు.

రుద్రు — సత్యము!

విష్ణు — ఈయనసూయ మాయతిథ్యము సక్రమముగ నెఱవేర్చుట కంగీకరించినదా?

బ్రహ్మ — మహాపతివ్రతగదా! పతిపలుకున కెదురాడఁగలదా!

రుద్రు — అనసూయా! యేమి మాటాడవు?

అన — ఆర్యులారా! మీరింతగా తరచనేల. మాకుఁ గలిగిన కలియో గంజియో సమర్పించెదము. మీదర్శనమగుటయే మహాభాగ్యమని యువ్విళ్ళులూరు మాయింట నేఁడు భుజించి మమ్ము పవిత్రులను జేయుఁడు. మీకిదే మ్రొక్కుచున్నాను. లెండు భోజనమునకుఁ బ్రొద్దెక్కుచున్నది.

విష్ణు — సరే. మాశీలము తప్పకుండ నీవన్నము వడ్డించెదవేని మేమవశ్యము మీయాతిథ్య మంగీకరించెదము. లేదా యిదే వెళ్ళిపోయెదము.

అన — మహాత్ములారా! మమ్మింక విషమపరీక్షలు సేయకుఁడు. మీమ్రోల నిదే నాప్రాణేశ్వరునిపలెనే నేనును శపథము సేయుచున్నాను.

ఉ. ప్రాణము పోయినన్ వ్రతము ♦ బాసిన, నీసిరులెల్ల విఘ్నమై
దీనత వచ్చినన్ బ్రజలు ♦ దిట్టిన సత్కులమెల్ల మాసినన్
మానను విందు చేసి మిము ♦ మాన్యులఁ బూజయొనర్చి పంపెదన్
భానుఁడు నాత్రిమూర్తులు ♦ ప్రపంచము సాక్షులు గాగ నియ్యెడన్.

ఆకాశవాణి — తథాస్తు.

[తెరపడును]

రంగము — గృహారామము.

(అత్రి, అనసూయ, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు బ్రాహ్మణ వేషములతో ప్రవేశించి యుందురు.)

అన — నాథా! వడ్డన చేయుచున్నాను. అభ్యాగతులతో తాము భోజనమునకు లెండు.

అత్రి — అట్లే. పూజ్యులారా! వడ్డన యగుచున్నది. కాళ్ళు కడిగికొనుఁడు.

బ్రహ్మ — మేము స్నానాద్యనుష్ఠానములఁ దీర్చి సర్వసిద్ధముగ నున్నారము.

అత్రి — సరే, దయచేయుఁడు.

(అందఱు పీటలపై కూర్చుందురు.)

అన — (పళ్ళెముతో అన్నము తెచ్చి వడ్డింపఁబోవును.)

రుద్రు — మే మభోజనముగ లేచిపోయెదము.

అత్రి — అదియేమి భూసురులారా! నావలన నేమి యపరాధము జరిగినది ?

విష్ణు — వేరేయపరాధము కావలయునా, మానుడి కంతరాయము వచ్చుటయే.

బ్రహ్మ — మా కిచ్చట నంతయు ననాచారముగ నున్నది, మే మిప్పుడే లేచి పోయెదము.

అత్రి — అయ్యలారా! లేవ వలదు, అతిథుల కన్నము పెట్టలేదని నింద, ఈ మహాపాతకము నానెత్తిపై వడవేయకుఁడు. మీ యిష్టాను సారము మడిని నిర్వర్తించెదము.

రుద్రు — ఆడినమాట తప్పవలదు సుమా.

అత్రి — నేనన్నఁడును అనృతమాడను.

విష్ణు — మా కుచితమైన మడితో మాకాతిథ్య మిచ్చువాఁడవేనా?

అత్రి — ఆసంగతి ముందే మీతో బాస చేసితిమిగదా.

రుద్రు — అగును.

బ్రహ్మ — సర్వజ్ఞురాలైన యీ యనసూయ,—

విష్ణు — మహాపతివ్రత యని పేరెన్నిక గన్న అనసూయ,—

రుద్రు — ఈ మలీమసమైన వస్త్రముతో మాకెట్లు అన్నము వడ్డింప వచ్చినది?

అత్రి — అవి మలినవస్త్రములు కావు. మడిబట్టలు.

బ్రహ్మ — మడిబట్ట లెట్లైనవి? సాలెవాని గంజిలో నాని చాకలి వాని బానలో మురిగి మురికినీళ్ళలో ముంచి యెత్తఁబడిన యీవస్త్రము మడి యెట్లగును?

అత్రి — ఈ వస్త్రములు మే మిరువురము స్వయముగ రాట్నముపై నూలువడికి నేసి మడికై వాడుచున్నారము.

రుద్రు — ఏమి నీ ప్రౌఢవచోవిలసనములు, మారేడు కాయకు మసిఁ బూసి నేరేడుకాయ యనిన దాని యొరవనుబట్టి యైనఁ బోల్చుకొనలేనట్టి మందు లుండెదరా. యీబట్టలు నీవు నేసినవా, యివి యుతికిన దెవ్వరు?

అత్రి — అనసూయ.

విష్ణు — ఆనీళ్ళు చేప లెంగిలి సేయలేదా.

అత్రి — లేవు. దరీగర్భమునుండి వచ్చుచున్న గంగ.

బ్రహ్మ — అదిగో గంగయే శూద్రాంగన, ఆమె సంపర్కము మామడికి దోషావహము.

అత్రి — అటులైన ఈ యనసూయ వల్కలములు కట్టి వడ్డించును. తాము కూర్చుండుఁడు. నామనవి చెల్లించి పరిషేచనము పట్టుఁడు.

రుద్రు — ఏమి వల్కలములా, అవియును మాకు శుచియైనవి గావు.

అత్రి — సరే. యీ యజినాంబరంబులు ధరించి భక్షించుటకు లెండు.

విష్ణు — ఈ అజినములు జీవహింసాజనితములు. మాంసమిశ్రితములు, కలుషపూరితములై దుర్గంధ సంయుక్తములై మలినములైన వీనిని ధరించి మాకీవిచ్చు నాతిథ్య మిట్లు సూచించితివా సరే, అత్రీ! నీవు పైకి పిచ్చివానివలె నున్నను లోపల మిగుల గడుసరివలె నున్నాడవు.

బ్రహ్మ — అగును. ఇదియును మాకు నచ్చి గానేరదు.

అత్రి — ఇంక నేమి కర్తవ్యము?

విష్ణు — కర్తవ్యమున కేమున్నది. మాదారిని మేము లేచి పోయెదము. నీవును నీయిల్లాలును సుఖముగ నారగించి యానందముగ నుండుడు.

అత్రి — పూజ్యులారా! మిమ్ము భోజనులుగా నేను విడువనోపను. నా ప్రాణమైన దానము చేసి మీ యిష్టార్థముల నెఱవేర్చి యాతిథ్య మిచ్చి పంపెదను. వలదు. మీరు పోవలదు.

రుద్రు — అత్రీ! నీ మేళ్ళ నాటించెదవు. విభుడవుగు నీవు మా కాతిథ్య మొసంగజాలవు. మేము మా దారిని లేచిపోయెదము.

విష్ణు — నీమూలమున మేమీదినము కటికి పస్తుండవలసి వచ్చినది.

రుద్రు — నీయడ్డులేకున్న నీపాటి కెంతైన భిక్షకు కుదిరియుండును. నీవన్యాయముగా మా మార్గావరోధము గావించితివి.

బ్రహ్మ — ఈ పాతక మీతని నెత్తిపై పడవేసి పోవుదము రండు.

అన — భూసురులారా! మా యపరాధముల మన్నించి మీ కేది మాడియో విప్పి చెప్పి మా యాతిథ్యము స్వీకరించి మమ్ము చరితార్థులను జేయుడు. మీ కిదే మ్రొక్కుచున్నారము. (అని యిరువురు కాళ్ళపై బడుదురు.)

రుద్రుఁడు — మేమంత చెప్పవలసి యున్నది. మాయాచారమున కంత రాయమా, రాకుండ నీవు నడపిన నియంత పూర్తిగా విందారగించి యాశీర్వదించు పోయెదము. (బ్రహ్మను జూపి)

సీ. నాల్గు వేదము లొక్క • నాఁడు పఠించిన
బ్రహ్మదేవుని యంత • వాఁ డితండు;

(విష్ణును జూపించి)

అవతారములు పది • యవధరించిన మేటి
పద్మనాభు యంత • వాఁ డితండు;

బ్రహ్మ — (రుద్రునివైపుఁ జూపి)

మరుని గాల్చియు మూఁడు • పురములు గూల్చిన
భర్గదేవునివంటి • వాఁ డితండు;

అనసూయ — (అత్రినిఁ జూపి)

మూఁడుమూర్తులు వచ్చి • మోమోట పెట్టిన
అన్నతిమాడని వాని • యత్రి యితఁడు.

రుద్రుఁడు — అనసూయా! నీమగని నీవు, నిన్ను నీమగడును పొగడుటలో విశేషములేదు.

అత్రి — ఆర్యులారా! ఇట్లు మీన మేమములు లెక్కించుటలో భోజనకాల మతిక్రమించుచున్నది. మీకేమ్యది యిష్టమో నిర్వచింపుఁడు. శిరసావహించి యాచరించెదము. లెండు మాపైఁ గరుణింపుఁడు.

బ్రహ్మ — సరే! మాయిష్ట మడిగితివి గావున నిస్సంశయముగ జెప్పుచుంటిమి.

అత్రి — మహాభాగ్యము. చేయుట కపహితుఁడనై యున్నాను.

బ్రహ్మ — ఈయనసూయ దిగంబరయై మాకన్నము వడ్డింప వలయును. అటులైనఁగాని మాకు మడి కుడుప నేరదు.

అత్రి — (చెవులు మూసికొని) శివశివా! యిది యెక్కడి మడి!

మ. తడివస్త్రంబులొ వల్కలాజినములో ♦ శాకాంబర శ్రేణికో
మడికిన్ బెట్టుము రంతెకాని యతిథుల్ ♦ మర్యాద పాటింప కీ
పడతిన్ జూచి వివస్త్రవై కుసుమములన్ ♦ పడ్డింపఁగా గోరఁ జో
ప్పనుచే గృహ్యానుశీలముల్ పతితవై ♦ పాపంబు రాకుంపునే.

అన — ప్రాణేశ్వరా! నామూలమున మీరతిథుల నొవ్వ నాడ వలదు.

అత్రి — భూదేవతలారా!

తే. గీ. పతికి హిత మాచరించుటే ♦ పరమపదము
మోక్ష మని యెంచు ననసూయ ♦ పుణ్యశీల
ప్రాణ మిచ్చును గాని యీ ♦ మానహాని
కోడఁబడునె మీర లిటుగోర ♦ నుచితమగునె.

బ్రహ్మ — సాధ్యము కాదనుము. లేచిపోయెదము.

అన — నాథా! వలదు వలదు. మీరట్లు లతిథులను చెడనాడ వలదు. దాన ధర్మహాని సంఘటిల్లును. ధర్మమునకన్న మానప్రాణము లధికములు కావు.

అత్రి — దేవీ! అడవులఁబడి మృగప్రాయులమైన మనపై నీయతిథు లిట్లు శిక్షరింపనగునా.

అన — మీరట్లు లానతీయవలదు. నే నీమహాపురుషుల యిష్టానుసార మాతిథ్య మిచ్చి పంపించెద నాటుడిల్లుడు.

అత్రి — దేవీ! నేనిందేమియు గర్తవ్య మూహింపలేకున్నాఁడను.

అన — త్రిమూర్తులవలె ప్రణవతేజముతో విరాజిల్లుచున్న యో మహానీయులారా! అత్రివంటి యీపేదవాని కుటీరమున మీ రాతిథ్య మును తీసుకొనుటయే మాకు మహాభాగ్యము. నేఁడు మాపుణ్యము

పండినది. మీరలు కోరిన కోర్కె మిక్కిలి సామాన్యమైనది. మీ యభిమతానుసారము నేను పివస్త్రనై యీవంటకము లన్నియు వడ్డించె దను. తామిపహితులై భుజించి మమ్ము కృతార్థులను జేయుఁడు.

అత్రి — దేవీ! అంతపనియే (అని మూర్ఛిల్లును).

(ముగ్గురును పీటలపై కూర్చుందురు.)

అన — (చేతులు పైకెత్తి)

ఉ. ఓ సచరాచరాత్మక మ ♦ హోన్నత తేజ నిజప్రభావ దే
వా సదయాంతరంగ పిప ♦ దబ్ధి మునింగిన వారిఁ బ్రోవ నీ
వే; సరి లేరు నీకు; కవి ♦ వేకులు నిన్ను గ్రహింపలేరు న
న్నీ సమయంబునన్ గరుణ, ♦ నేలుము మ్రొక్కెద నిన్ను దీననై.

(ప్రకృతి యంతయుఁ గోలాహలమై పిడుగులు రాలును. గంగా నర్మదలు ప్రవేశించి) అనసూయ దీనాలాప శ్రవణమాత్రమున చతుర్దశ భువనము లన్నియు తల్లడిల్లుచున్నవి. (సమీపించి)

గంగ — అనసూయా! నీ పనికి నే నియ్యకొనెదను, నీవు బెగ్గడిలకుము తల్లీ.

నర్మ — అక్కా! నేనుండఁగ నీకీశ్రమ యేల, నాకాకార్యము నియోగింపుము; నేను చేయుదును.

అన — తల్లి వలదు, నేనే నిర్వర్తించెదను, వారివి బాలభిక్షికలు.

(అని నిష్క్రమింతురు.)

త్రిమూర్తులు — హతోస్మి. హతోస్మి. హతోస్మి.

(ముగ్గురు పసిపాపలై యేడ్చుచుందురు.)

గంగ — ఆహా! యేమి యీయనసూయ పాతివ్రత్య మాహాత్మ్యము! దుర్నయమునకు వచ్చిన త్రిమూర్తులును గూడ కేలకూనలవలె మారిపోయిరి.

సర్మ — మన మూమెను వెన్నాడి పోవుదము రమ్ము,

(అని యిరువురు నిష్క్రమించుదురు)

అన — (ప్రవేశించి) నాథా! లెండు.

అత్రి — (లేచును) దేవి! అతిథులేరీ! యీ పాప లెవ్వరు?

అన — వారే వీరు. మనకు బిడ్డలులేని కొఱంత పరమేశ్వరుఁడీ రూపమునఁ దీర్చినాఁడు.

అత్రి — ఈ యుదంతమేమి?

అన — నాథా! నాకట్టు పుట్టములు విడిచి వడ్డన గైకొని రానుద్యోగించియుండ వీరు పసిపాపలై యేడ్చుచున్నారు.

ఆకాశవాణి — పతివ్రతలు లోకమాతలు, వారిని విపత్రులుగాఁ జూడఁ గోరువారు తల్లిని బిల్లలవలె పసిపాపలే కావలసి యుండును.

అన — నాథా! తొట్టి తెండు. నేను పాలిచ్చెదను.

అత్రి — (తొట్టి తెచ్చి చెట్టునకు వ్రేలాడ వేయును.)

నారదుఁడు — (ప్రవేశించి) అనసూయను వంచింపఁదలంచిన త్రిమూర్తుల వెదకుచు గౌరీ లక్ష్మీ సరస్వతులు వచ్చుచున్నారు, వారినిందుండి కొంతవడి వీక్షించెదగాక.

(గౌరీ లక్ష్మీ సరస్వతులు ప్రవేశింతురు.)

సరస్వతి —

ద్విపద॥ పతి రాకఁ జూసేఁ గనఁ • బడఁడది యేమొ
క్షితి వెదకితిమి వీ • క్షింపఁగరాదు
వివరింపఁ జాలుచు • నేదిశఁజనెనో
ఏ విపరీతము • లీచెవిఁ బడునో

గౌరి:—

చం. పతు లెట కేఁగిరో తెలియ ♦ దచ్చట లేరు జగత్రయంబునన్
వెతకితి మజ్జనకుఁడు ♦ జెప్పఁడు నాపతి శేఁగరుంచు మీ
క్షితి కిటు వచ్చిరో తెలియఁ ♦ జెప్పఁడు కాననవాసులార మా
బ్రతుకుల కాసలేదు తెగి ♦ వచ్చెను మమ్ము ననుగ్రహింపరే.

లక్ష్మి — అనాథరక్షకుఁ డగు నావల్లభుఁ డెందేగియుండునో తెలియదు. ఇది మాయగానున్నది. నేనీవియోగము సహించి జీవింపఁజాలను.

ఉ. భానుఁడు గ్రుంక దీపముల ♦ పై శలభంబులు రాత్రి వ్రేల్మిడిన్
ప్రాణము వాసినట్లనువుఁ ♦ బాసెద నగ్నిని నాత్మనాథుఁడున్
గానఁగరానిచోఁ దనువు ♦ కాల్చను, సాధ్వికి భర్తతోడిదే
గాని జగంబు వేఱొకటి ♦ గాదు నిజాన మనాథ కున్నదే!

గౌరి — లచ్చీ! యేమి నీకీవెఱ్ఱి.

సీ. బ్రహ్మాండ మంతయుఁ ♦ బట్టి రథముఁ జేసి,
త్రిపురాసురుల సంహ ♦ రించె నెవఁడు
కడలిలోపలఁ జొచ్చి ♦ గాలించి సోమకా
సురుని సురులఁ దీసి ♦ చూపె నెవఁడు
జీవరాసులు తన్నుఁ ♦ జేరెడు నట్లుగా
సృజియించి యాడింపఁ ♦ జేసె నెవఁడు
మూఁడు జగంబులు ♦ ముచ్చటగా మూఁడు
మూర్తులై యేలెడు ♦ ముఖ్యు లెవరొ

తే. గీ. అరయనైతి విన్నాళ్ళు కా ♦ పురము జేసి
జగములు హరింపఁ జాలు నా ♦ జలజమాళి
జగములను గాచునట్టి యా ♦ జలజదృక్కు
జగము లుదయింపఁజేయు నా ♦ జలజభవుఁడు.

లక్ష్మి — నాపతికై నేను వెదకి వెదకి వేసారి పోయితిని.

ఆ. వె. సూర్యచంద్రులార ♦ సురలార మునులార
గగన చారులార ♦ నగములార
పరమయోగులార ♦ పతిభిక్షమును బెట్టి
ప్రోవరయ్య నన్నుఁ ♦ గావరయ్య.

నారదుఁడు — (ప్రవేశించి) భర్తలు అత్రి అనసూయలకు బిడ్డలై యేడ్చుచుండ వీరిచ్చట వెదకుచు వగచుచున్నారు. నేను పోయి వారి జాడ నెఱిఁగించెదఁగాక.

ఆ. వె. వార్తలెఱుఁగఁ జెప్పి ♦ వర్తింతు లోకంబు
లందుఁ గలుగు ఫలము ♦ లందునాకు
పాలు లేదు; వారి ♦ ప్రారబ్ధములఁ బట్టి
జరుగుచుండును గ్రహ ♦ చార ఫక్కి.

గౌరి — అదిగో! సకల కళావిశారదుండును సర్వజ్ఞుండైన నారదుఁ డీవంకకే వచ్చుచున్నాఁడు.

లక్ష్మి — వానికీయుదంత మేమైన దెలియునేమో తెలిసికొందము రండు. (ఎదురేగి),

గౌరి — నారదా! సమయమున నీవా పద్బాంధవుని వలె ప్రసన్నుఁడ వైతివి.

నార — నావలనఁ బని యేమి తల్లీ?

లక్ష్మి — మునీంద్రా! త్రిమూర్తు లేమైనారు?

నార — అనసూయను వంచింపఁ బోయి ఆమెకు పసిబిడ్డలై యామె అడ్డాలలో నాడుకొనుచున్నారు.

గౌరి — ఏమినారదా! మాతో నెకసక్కెము లాడుచున్నావా?

నారద — దేవ శక్తి! జగన్మాతలైన వీరిమీద నపచారము చేయ సాహసింతురా?

సర్ప — శాపముచే నూహింపఁ బడకుండనె లోకములన్నియుఁ దల్లడిల్లినవి. యింక త్రిమూర్తులు లేచుటో లేమొ గదా.

(అని నిష్క్రమించును)

గౌరి — ఆహా! ఏమి యీ విచిత్రము.

సరస్వతి — ఇందు విచిత్ర మేమున్నది.

తే. గీ. అనల శిఖలైన నంటుట ♦ కలవియగును
హాలహాలమైనఁ ద్రావుట ♦ కలదియగును
కాలసర్పంబు కోరలు ♦ కదపనగును
కాని సాధ్వీమణిఁ గన్నెత్తి ♦ కాంచ నగునె!

గౌరి — నిజము.

తే. గీ. కృచ్ఛ్రచాంద్రాయణ తపోగ ♦ రిష్ఠులైన
వేదవేదాంతశాస్త్రప్ర ♦ వీణులైన
అక్షయతశాపమోక్షణా ♦ దక్షులైన
వార లోకపతివ్రత పాటి ♦ వారు గారు.

లక్ష్మి —

తే. గీ. ప్రాణవిభు సేవకంటె వే ♦ రైనసేవ
సతికిఁ జెల్లదు పతియె యీ ♦ శ్వరుఁడు సతికి
సద్గుణము లెన్ని యున్నను ♦ సాధ్వి కాని
సతికి సుగతులు గగనపు ♦ వ్వులుగావె!

సర — అట్లైన నీ యుపచారమెల్లా సార్థకమాయెనే. ఈవిధ మనసూయ యొసంగినచో యామె దేవతల సర్వపూజిత.

గౌరి — అగును. మన మాటలచే సంకీర్తనము చేసి పతిభిక్ష మను గుదమూరండు (అని పోవుచున్నారు).

అన — (పిల్లలను తొట్లలో బరుండబెట్టి)

పాట

జో జో నాపుత్రా
నాముద్దుసుతా సరి ధపమగరిస. జో
కో కి లా శుకాశారికాళుగ
వినదము లవె విను—జోజో

అత్రి — దేవీ! బిడ్డలులేరని పరితపించితివి. చూచితివా యీశ్వరు లెందరి నిచ్చినాడో,—

మ. కలుమాల్ లేములు వచ్చుచోవు నవి యా ♦ కాశంబుపై మేఘముల్
వలె భాగ్యంబె నిజంబుగా మనకు దై ♦ వంబియ్యగానున్న దో
సిలితోc బోసి సువర్ణవృష్టిc గురియన్ ♦ సేవించి యర్థించి తేc
గలమా యొక్క తృణంబు నీశ్వరుని సం ♦ కల్పంబులేకుండినన్.

అన — నాథా! తామానతిచ్చినది వాస్తవము.

అత్రి —

ఆ. వె. మూcడులోకములకు ♦ మూలపురుషులైన
మూcడుమూర్తు లిట్లు ♦ ముద్దుమూచ్చ

గౌరి — (లేవఁదీసి) ఓ మహనీయ సంయమివరా! మీకు శుభమగుఁగాక! అత్రీ! నీవు తపస్సుచే మూఁడులోకములను కంపింపఁజేసిన మహానుభావుఁడవు. నీచారిత్రము సకల పాపహరము. నీయర్ధాంగి అనసూయ మహాపతివ్రత. ఈమె పదసరోజ రజోలేశమునకైన నేము ముఖ్యరము కొరగాము సుమా.

లక్ష్మి — ఈమహాసాధ్వి అనసూయ గంగా శాపవిమోచనా సందర్భమునఁ జూపిన మహాశక్తికి లోకము లన్నియు నివ్వెఱపడి పోయినవి.

సర — నర్మద సూర్యోదయము కారాదని శాపము పెట్టి నప్పుడీ యనసూయయే లేకున్న లోకము లన్నియు నీపాటికి చీకాకు పడి నశించియే పోయియుండును.

అన — అమ్మా! మీదర్శన మహాభాగ్యము వలన మాజన్మము తరించినది.

సీ. బలిని లర్పణముఁ జేసి ♦ పగలు రే యనకుండఁ
ప్రార్థించినను గానఁ ♦ బడవు నీవు;
రణములు భేదించి ♦ రాజుల నిర్జించి
ప్రణమిల్లినను గాన ♦ రావు నీవు;
కార్యముల్ శోధించి ♦ కల ధనం బర్పించి
పూజించినను చిక్కఁ ♦ బోవు నీవు;

అత్రి —

కైలాసమందు స్వ ♦ ర్గమునందు సత్యలో
కమునందు విహరించు ♦ గరిత లైన

తే. గీ. మీరు [illegible] ◆ [illegible]
జగత్త్రయాంచాలు [illegible] ◆ [illegible] మొసగి
నాకు నా సంకటంబు ధ ◆ య్యక వహించె
బ్రోవరమ్మ మాగృహములు ◆ నావగమ్మ.

గౌరి — అత్రీ! ఋషిసత్తముఁడ వైన నీవు అతిథి అభ్యాగతులకు ప్రాణమైన ధారవోసి పూజించి పరమపవిత్రమైన పుణ్యమును సంపాదించి ప్రఖ్యాతి వడసితివి.

లక్ష్మి — తల్లీ అనసూయా! నీకు సాటియగువారు లేరున్నను నీపాతివ్రత్యమహామహిమ కనుఁగొన జెండిన త్రిలోకాధినాథులైన యీ త్రిమూర్తులు నీయెడ ఘోరముగు నపరాధము గావించి తగిన శిక్షను బొందినారు.

అన — అనఁగా యేమి తల్లీ?

గౌరి — నీవు తొట్టెలో పరుండఁబెట్టిన బిడ్డ లెవరు?

అత్రి — అతిథులై వచ్చి మాచే నర్చింపఁ బడినవారు.

లక్ష్మి — ఈ కుమారులే మా ముగ్గురకు భర్తలు.

అత్రి — ఆహా! మీరు త్రిమూర్తులా దేవతలా రా! నాఅపచారములు క్షమింపుఁడు (అని నేలకొరఁగి మ్రొక్కుచున్నాఁడు).

సర — సోదరీ! అనసూయా! నాభర్తను నాకొసంగుము (అట్లే తక్కిన వారును అడుగుదురు).

అన — (వేగము పోయి) (తొట్టెలలోని పిల్లలను దెచ్చి యెవరి భర్తను వారి యొడిలో బడవేయును.)

గౌరి — శంకరా, సాధువశంకరా!

మ. కరశూలంబునఁ బట్టి పోఁడవు మహా ◆ కాలుండవై; శూలివై
పురసంహారము జేసినాఁడవు; జగత్ ◆ పూజ్యుండవై శీలివై

మనువిన్ మూఁడవ పెంకికుంట నొసఁ భ ♦ స్మ ప్రాయుపిన్ జేసితో
హరుఁడా! యిాయనసూయ డింభకుఁడవై ♦ యల్లాడెదే యక్కటా.

లక్ష్మి — కేశవా! వైద్యారీ!

ఉ. పాలసముద్రమందు వట ♦ పత్రముపైఁ బవళించి కట్టవై
వ్రేలిని నోటలోనిడి ప్ర ♦ పీణతినంబున నాభికాసరో
త్పలయుమందు బ్రహ్మఁగని ♦ యాడుచునుండెదు వేడ్క మాకు నీ
వేళనుజూపఁ జాలితివి ♦ విశ్వకుటుంబివి గావె కేశవా!

వర — పితామహా! నీకీశిశుత్వమేమి!

ఉ. ధారుణి నెల్లవారికిఁ బి ♦ తామహుఁడై సృజియించి లోకసం
సారము సారహీనమని ♦ చాటుభవార్ణమున్ దరింప సాం
పారఁగ వేదనౌకలిడి ♦ వాసిని గాంచి యిదేమినిల్చినన్
నీరయి యత్రిదార కొక ♦ నీరసపుత్రుఁడవైతి వబ్జజా!

(అని ముగ్గురు అనసూయ యొడిలో నాబిడ్డలను మరలఁ బడవైచి)

ముగ్గురు — అనసూయా! వీరిని నీవే పెంచుకొనుము.

అత్రి — దేవీ! ఏమి నీభాగ్యము; త్రిలోకముల నేలు త్రిమూర్తులను పోషించు మహావైభవము నీకుఁ జేకూరినది. కాని శుద్ధసాత్వికులమైన మనకిది చెల్లదు. వారిని యథాస్థితికి వచ్చునట్లుఁ జేయుము.

అన — దేవులారా! మీరలుఁగవలదు. మీభర్తలు తొంటి రూపములను దాల్చి మీకమందానందము గూర్చెదరుగాక.

ఉ. నేను పతివ్రతామహిమ ♦ నించుకఁ గల్గిన దానవేని నా
ప్రాణవిభుండు పేదల తపు ♦ దార్తిని దీర్చు మునీంద్రుఁ డేనియున్
భానుసహస్రమండల వి ♦ భాకర తేజుల మువ్వురుమూర్తులన్
నేనిట సత్కరింప నిట ♦ నే నిజరూపము దాల్చు గావుతన్.

(మూడుమూర్తులు నిజరూపములఁ దాల్చి నారి భార్యలతో సమీపింతురు.)

త్రిమూర్తులు — అనసూయా! మా అపరాధము క్షమింపుము, తల్లీ; జగద్ధిత తేజోమూర్తియగు దత్తాత్రేయుఁడను పుత్రుఁడు నీ కచిరకాలమున గలుగునుగాత! నీవు అకల్పాంతము పతివ్రతాశిరోమణివై స్త్రీల కలంకార ప్రాయవై ప్రకాశించెదవుగాత.

(తెరపడును. మంగళము)

గద్య

ఇది ఉమర్ అలీషా కవికృత అనసూయాదేవి మహా నాటకమునం దైదవ యంకము సంపూర్ణము.

ఇందు వచ్చు పాత్రలు

పురుషులు

1. అథర్వుఁడు
2. భవుఁడు
3. దేవేంద్రుఁడు
4. సోమపాలుఁడు
5. గుణదత్తుఁడు
6. గుహవు
7. వీరిసెట్టి
8. జంధ్యాలభట్టు
9. దొంగలు
10. జాలరులు

స్త్రీలు

11. కళ
12. చంచల
13. దేవకన్యలు
14. ఎరుకసాని

కళ.

→☰←

నాంది

ఉ. ఏపరమాత్ముఁ డైహికము ♦ హీన మహామహిమాన్వయాఢ్యమై
ఈవసుధాస్థలిలోకులు ♦ సేవ్యపదద్వయుఁ డై; యెవని సూక్ష్మమో
ఆపరశక్తి తేజము హ్రా ♦ దంతరమాయ, జడాంధకారముం
బాపి తమోనివృత్తిఁ గర ♦ భాగ్యశతంబులు మీకుఁ గూర్చుతన్.

నాంద్యంతమున సూత్రధారుఁడు — నటీ! అలంకారములు ముగిసిన నొకసారి యిటురమ్ము.

నటి — (ప్రవేశించి) నన్ను పిలిచినపని యేమి?

సూత్ర — నటీ! జ్ఞానమహాసభాసభ్యులు నేఁడు కొలువు దీర్చి యేత త్సభ్యుల పూర్వచారిత్రములు యథావిధిగ మనచేఁ బ్రదర్శింపఁ బడుటకు సముత్సుకులై యానతిచ్చి యిదే యెదురు చూచుచున్నారు.

నటి — ఏమి మన మహాభాగ్యము! జ్ఞానమహాసభాసభ్యులబ్రోల మన నటనాకౌశలము బ్రయోగింపఁగల యమూల్యావకాశము మము కూడినది! ఆహా! ధన్యత్వము ధన్యత్వము. నాథా!

ఉ. పండితులున్ మహాకవులు ♦ బంధుర దివ్యకళాప్రకాండు లా
ఖండలసన్నిభుల్ నృపులఁ ♦ గాదని నాటక మాడనేర్చు ను
ద్దండ కళాకలాప సము ♦ దార మహామహిమాన్వయాప మా
ర్తాండులు జ్ఞానసభ్యులను ♦ రంజిలఁ జేయఁగ నేరశక్యమా.

సూత్ర — నీవన్నది యథార్థము. నటీ! ఇవి వారి స్వీయకథా విధానములే గదా! లోటు లున్నను మన్నింతురు.

నటి — నాథా! యీనాటకము పే రేమి?

సూత్ర — కళ.

నటి — అనఁగా?

సూత్ర —

తే. కళ మహాపతివ్రత జ్ఞాన ♦ కళను జేర్చి
కష్టకాలానఁ బతినంటి ♦ కాఁపురంబుఁ
జేసి ధర్మంబు దప్పక ♦ వాసికెక్క
ఆయుదంత నాటకమై నేఁ ♦ డాడవలయు.

నటి — ఇది వ్రాసిన కవి యెవరు?

సూత్ర — ఎఱుఁగవా?

ఉ. నాటకముల్ పురాణములు ♦ నవ్యకథా కలితార్థ కావ్యముల్
పాటవ మొప్ప వ్రాసి నిజ ♦ పాండితి నాంధ్రవసుంధరన్ నిరా-
ఘాటముగా వధానముల ♦ జ్ఞానరహస్యము లుగ్గడింప దే
శాటన మాచరించు నుమ ♦ రాలిమ సత్కవి వ్రాసె నీకళన్.

నటి — ఇంక నేమి కావలయును?

తే. కళ త్రిలోకంబులకును నా ♦ కాంక్షితంబు
అందులో జ్ఞానకళ ప్రశం ♦ సార్హ మగుట
స్వర్గపాతాళముల కదే ♦ వ్యాప్తి గాంచు
నిజ భవాభవజన మహా ♦ నీయ మగుచు.

(తెర)

ప్రథమాంకము

(భవుఁడు ప్రవేశించి యుండును.)

భవు — విహంగ తిరస్కరిణి [illegible] మాత్రమునఁ బాతాళమునుండి భూలోకమునకు [illegible] నాకలోకమే పైనుండి యెవరో వచ్చుచున్నారు.

అథవుఁడు — (పైనుండి ప్రవేశించి) [illegible] — ఈ భూలోకము మాకు ఘంటాపథము.

భవు — (సమీపించి) స్వామీ! [illegible] ఎచ్చటనుండి వచ్చుచున్నారు?

అథ — మేము దేవతలము. మాది అమరావతి.

భవు — మహాభాగ్యము. అచ్చటి విశేషము లేమి?

అథ — అనంతము.

సీ. మణులు మాణిక్యాలు ♦ మలచి కట్టిన
మహా సౌధాలపంక్తు ల ♦ చ్చటను గలవు
మిన్నేరు వెట్టిన ♦ మిసిమి బంగరుచాలు
సైకతసీమ ల ♦ చ్చటను గలవు
రాయంచ లళుల శా ♦ స్త్రములను జదువుచు
జరియించు చోటు ల ♦ చ్చటను గలవు
గీర్వాణవాణిని ♦ గీర్వాణి వీణ ని
చ్చలు మీటుచోటు ల ♦ చ్చటను గలవు

తే. అమరకాంతలు నీరాజ ♦ నములు దెచ్చి
స్వాగతం బిచ్చు పూజ ల ♦ చ్చటను గలవు

సహజసౌందర్యసీమ ల ♦ చ్చటను గలవు
ఆపురంబు స్వర్గంబు మా ♦ కాపురంబు.

భవు — మీరు ధన్యులు!
అభ — నాయనా మీ రెవ్వరు? ఎచ్చటివారు?
భవు — మేము నాగులము. మాది రసాతలము.

మ. విషఫూత్కార రవైకసంక్షుభిత దృ ♦ గ్విస్తార విస్ఫారిత
తృషితాభ్రంకష భీషణోరగ మహా ♦ హింస్రాప్రపూరంబు నా
మిషమస్తిష్కవసాగ్రఖాదన పరో ♦ న్మేషాసవ ప్రోజ్జ్వల
చ్చషకాభీలము రాక్షసాలయము పా ♦ తాళంబు మా వాసముల్.

అభ — నీవిచ్చటి కేల వచ్చితివి?
భవు — భూలోకవిచిత్రములు చూడ వచ్చితిని.

సీ. ఆశ్వలాయన దేశ ♦ మరసి త్రివిష్టప
శృంగారవనుల పీ ♦ క్షించినాఁడ
చ్యవనదేశవిచిత్ర ♦ చారిత్రకములఁ ద
చ్ఛీల విలాసాలఁ ♦ జెలఁగినాఁడ
యావనదేశ ని ♦ త్యాభ్యంతరావాస
లీలావిశేషాలఁ ♦ దేలినాఁడ
శ్వేతభూముల లాస్య ♦ వీధుల లజ్జావి
హీన విన్నాణాల ♦ నిరికినాఁడ

తే. ఈ చతుస్సముద్రాంత ర్బ ♦ హిర్గతంబు
లైన దేశాలఁ దత్తత్స ♦ జావళులను
జూచినాఁడ సరాలు దో ♦ బూచులాడ;
కాని యాథార్థ్యద్యోతిత సుం ♦ తేని లేదు.

అభ — ఇది కడుంగడు విచిత్రము. మీరు పాతాళలోకవాసులు. మీకా ఆధ్యాత్మచింత యేమిటి!

తే. తపముచే క్రతు జప దాన • ధర్మనిరతి
వచ్చుచుందురు బుధులు మా • స్వర్గమునకు
తమసుచే నిత్యకోపతా • పములచేత
తరలు చుందురు నరులు పా • తాళమునకు.

భవు — అగును. ఈ భారతదేశాంతర్గత ఆంధ్రభూమి నాధ్యాత్మిక విద్యాపీఠమునఁ జేసి యేతచ్ఛీలము మూరపాతాలమునకుఁ గొంపోయి గొప్పపరివర్తనము పుట్టించెదను.

అభ — నీవు ధన్యుఁడవు. నేనును, అదే సంకల్పమున వచ్చితిని.

భవు — నాకు నీవు తోడగుదువా!

అభ — సరే! మనము ప్రచ్ఛన్నముగా వారిశీలముల నారయుదము రమ్ము. నేఁడు సోమపాదునియింట మహాసభ జరుగనున్నది.

(నిష్క్రమింతురు)

రంగము — గృహాంగణము

(సోమపాదుఁడు, కళ, గుణదత్తుఁడు, జయ, దాసి ప్రవేశింతురు)

కళ — నాథా! మీసపత్నిసోదరుఁడు గుణదత్తుఁడు తన ఆస్తిని పంచియిమ్మని అడుగుచున్నాఁడు.

సోమ — అనంతమైన మనమహాభాగ్య మాతఁడిదివఱకే దుర్వ్యసనములకు మఱిఁగి కడతేర్చినాఁడు.

గుణ — ధనము మానవుని యొక్కఱలను పూరించు నొక నిమిత్తమాత్రమైన రశ్మి. అది ఆకస్మికమైనది. విద్యావిలాసములచే మోహాత్మకప్రకృతిని లేపి, అచేతనములందుఁ జేతనము కల్పించు దయ్యము.

దానిని నేను స్వర్గసీమాదర్శముగాఁ జూచి వసుంధరను వసుంధరగాఁ జేసి, జీవితములోని ఆ లోకసుందరస్వప్నజలము ప్రభాతరాగములోఁ గలపివేసితిని.

జయ — నీ వన్యదారాప్రవృత్తికై విరుద్ధము లగు నిషేధముల లెక్కింపక కలధనము లెల్ల వెచ్చించి నేఁడు నీతిశాస్త్రపారంగతుని వలె మాటాడుచున్నావు. హా! నేను ముందు జీవించు తెఱవేమి? నీసోదరుఁ డన్నియు నీకిచ్చి నిర్ధనుఁ డై పోయినాఁడు. నన్నాతఁడును పోషింప నసమర్థుఁడై మానావమానములు లెక్కించుచున్నాఁడు.

కళ — సోదరీ! నీ కేమియు కష్టము లేదు. నాతో నుండుము. మన కీశ్వరుఁ డెన్నటికైన మేలు గూర్చిన నది నీదిగనే భావించుము తల్లీ!

గుణ — నీవ్వూరకుండుము! ఇది గయ్యాళి. ఈమె సహవాసము నిన్ను గూడ గాఢాంధకారమున ముంచి వేయును!

జయ — సరే! నేను గయ్యాళినిగదా! నీతాళము పట్టెద నుండుము.

గుణ — ఓసి చచ్చా! నీవు చేయున దేమి?

జయ — ఏమా! చూచెదవు గాక. రేపే విడాకు లిచ్చి వేశ్యలలో కలసి పోవుదును. గతికమైన మర్యాద మట్టిలోఁ గలపివేయుదును.

కళ — తల్లీ! అంతపని చేయవలదు.

సోమ — జయా! నీవు నేటివఱకు ప్రసిద్ధమైన సద్గుణసంపత్తిగల సాధ్వివి. నీవిట్టి విపరీతకృత్యములు తలంపవచ్చునా?

జయ — నీసోదరుఁడు చేసిన అన్యాయములు నన్నీతీరున మార్చి వేసినవి.

సోమ — సేవకా!

సేవ — స్వామీ! ఏమి సెలవు?

సోమ — వీరిశెట్టిని పిలువుము.

సేవ — చిత్తము.

వీరి — (ప్రవేశించి) ఏమి బాబూ! కబురంపినారట. మీకేమైన బదులు కావలెనా?

సోమ — మాకొక పదివేలరూకలు బదులు కావలెను.

వీరి — అది యెంతసేపు బాబూ! ఇదిగో (అని యిచ్చును)

సోమ — (పుచ్చుకొని) జయా! ఈరూపాయలు తీసికొని నాసోదరుని సేవాపరాయణత మానక పతిమనస్కవై వర్తించుము. (అని యిచ్చును.)

గుణ — అగును. (అని జయచేతిలో రూకలపంచి లాగికొని వెళ్లి పోవును)

జయ — అయ్యో! అయ్యో! నాధనమేదీ! (అని నెత్తి కొట్టుకొని పడిపోవును)

సోమ — అదిగో గురువుగారు శిష్యులతో వచ్చుచున్నారు. సందడి చేయక సన్యాసపరంపర నర్ఘ్యపాద్యములు సమర్పింపవలయును.

గురువు — (ప్రవేశించును; ఎల్లరు నమస్కరించెదరు.) జయము, జయము.

జయ — నాపై రెవరెత్తుచున్నారు. (చూచి) ఓహో గురుమహాశయులా! (అని లేచును)

గురు —

సీ. నిరుపేదలకు నెల్ల ♦ నిరతాన్నదానంబు
గావించు సద్ధసం ♦ గ్రహము గూర్చు
ఆధ్యాత్మికజ్ఞాన ♦ మాదర్శముగ నుండు
సారస్వతంబు సాం ♦ పారఁ జెంచు
భక్తులకష్టాలు ♦ పాలించుటకుఁ దమ
ప్రాణాల నొడ్డు నే ♦ మైనఁగాని
పాఠశాలలయందు ♦ పరమనైతికతత్త్వ
పద్ధతుల్ నేర్పించు ♦ వసతు లిచ్చు

తే. గీ. ఇట్టి సత్కార్యముల నాచ ♦ రించు వాని
ధనము ధారాప్రవాహ వి ♦ ధాన విలసి
స్వర్గమున కీతెఱంగు సో ♦ పానపంక్తి
కట్టుచున్నాఁడు సోముఁడు ♦ కళను గూడి.

సోమ — ఇది అంతయును తమ ఆశీర్వాద విశేషము.

గురు — మీ శిష్యుఁడు తోడుగుఁగాక! సహోదరులారా! మన ఆధ్యాత్మిక విజ్ఞాన విద్యాపీఠమహాసభ మిక్కిలి ప్రాచీనము. కేవలము పవిత్రములగు మహదాశయములపై నాఁటియున్నది. దీనియందలి యథార్థములు మానుషలోకములయందును బూజింపఁబడవలసినవిగా నుండవలయును. దురాచారములు, పాపములు, నీతిబాహ్యములు మున్నగు మలీమసములైన కర్మకళంకము లామూలాగ్రము నశించినఁగాని జ్ఞానసాధనమునకు మానవు లర్హులు కాఁజాలరు. కావున మీమీ దివ్యానుభవములైన యాధ్యాత్మిక తత్త్వప్రతిపాదక మహామహిమ లింకను పెంపొందింపవలయును.

కళ — స్వామీ! గార్హస్థ్యమునందలి స్త్రీల విధు లెట్లుండవలయును?

గురు — మిక్కిలి పవిత్రముగ నుండవలయును. స్త్రీలన్న సామాన్యులు గారు. శీలమే వారి యలంకారము. అట్టి

ఉ. ఇద్ధపతివ్రతామణుల ♦ కే రవిచంద్రులు మూఁడులోకముల్
బద్ధము లీమహామహిమ ♦ స్వార్థపరత్వముచేతఁ జేయు సే
సిద్ధులవల్లఁగాదు; కదుఁ ♦ జేరువ స్వర్గము స్త్రీలకెల్ల నీ
పద్ధతి పూరుషాళికిఁ ♦ బట్టను మాటలు వేయి చెప్పినన్.

జయ — ఎండవానలు లెక్కింపక తప మాచరించు ఋషులకు స్వర్గము పెరటిచెట్టువంటిది గదా.

గురు — కావచ్చును.

ఉ. కానకసీమలందు కనుఁ ♦ గష్టపరంపర లొందె నింది వి
జ్ఞానము [illegible] బుద్ధి ♦ పత్త్రికఁజెందు ఫలంబు [illegible]
పాపలమ [illegible] మెదు ♦ గాఢక భక్తి భజించు జ్ఞానయా
మాని [illegible] సుమార్గ యుత ♦ మానసము మాను తపస్సు లిట్టివే.

గుణ — సేవకుఁడు ప్రభువును కొలుచును. సూదికొంట దారము వచ్చును. మానవుని నీడ వెన్నాడును. అట్లే స్త్రీలు పురుషుల నాశ్రయింతురు. అందేమి విశేషమున్నది? అది తపస్సెట్లగును?

గురు — తపస్సనఁగా ఏకాగ్రమైన లక్ష్యము. హృదయాంతర్వర్తి యగు ప్రేమ [illegible] యుద్ధము. అది సత్యపతివ్రతల కొక్కరికే తెలియును. కావున స్త్రీలను బానిస లని భావింపఁజనదు. నిజముగా —

ఉ. ఇంతియుణంబు దీర్పఁగలఁ ♦ డే పతి జన్మము లెన్ని యెత్తినన్
కాంతసతంబు స్వర్గపర ♦ కంబులమధ్యను నిల్చి భర్తకున్
స్వాంతక వాటముల్ తెఱచి ♦ స్వర్గముకై నడి మాఱు; నారక
ప్రాంత మహాఘదుఃఖములఁ ♦ బాపును జేరికి శర్యలోపముల్.

శా — మానవ జీవితము విచిత్రచరిత్రములపైఁ దిరుగుచున్నది. సంసారసాగరమున మానవుఁ డొక్కనావ.

గురు — దాని కర్ణధారియే దార.

గుణ — దారయా లేక దారుఁడా! ఇది గొప్ప అన్యాయము.

గురు — నీవెఱుంగవు.

చ. పడఁతి గృహాంబునందు నొక ♦ బంధురదీపిక యెల్లవేళలన్
గడు ముదమిచ్చుఁ; బూరుషుల ♦ కంటె నిజంబుగ నాతువాండ్ర దే
వుడమి; పతివ్రతాతిలకముల్ గల ♦ ధామము మించి స్వర్గ మే
దొసఁగలదే? యిహంబునకు ♦ నింతియె సాధనమార్గ మారయన్.

గుణ — అది ఎట్లు సమర్థనీయము?

గురు —

సీ. ఒకనవ్వుతో భర్త ♦ కుండు కష్టములెల్ల
బరిమార్చు మన సిచ్చి ♦ గరితమిన్న
ఒకచూపుతో భర్త ♦ కుండుకళంకముల్
పోఁగొట్టుఁ దేలించి ♦ పువ్వుఁబోఁడి
ఒకసన్నతో భర్త ♦ కుండు తాపత్రయం
బులు మాన్పుఁ దేమలించి ♦ జలజవదన
ఒకమాటతో భర్త ♦ కుండు సందేహాలు
తొలఁగించు బోధించి ♦ తోయజాక్షి

తే. ఇట్టు లానంద దేవిరై ♦ యొసక మొసఁగి
బూరుషునిజన్మ తరియించి ♦ ముక్తిఁ బడయు
పతికిఁ దరుణీలలామ తో ♦ డ్పడును గాదె
రమణికంటెను వేరె స్వ ♦ ర్గంబు గలదె.

మరియు గృహాంతర్వర్తియగు నర్థాంగిని చూచితిరా? పెక్కు తెఱంగుల భర్తకుఁ దోడ్పడుచున్నది.

ఉ. ఇంటినిగాచు కాపరి మృ ♦ గేక్షణ; పిల్లల నూడిగంబులన్
గంటికి రెప్పవోలెఁ గల ♦ కాలముఁ బ్రోచు కృతజ్ఞ; భర్తతో
నంటి గృహస్థధర్మముల ♦ యందు యథావిధిగాఁ జరించు వా
ల్గంటిని మించు నెచ్చెలులు ♦ గల్గుదురే భువనత్రయంబులన్.

మఱియు,

చ. దురితదురంతదుఃఖములఁ ♦ దోడ్పడి యర్థము ప్రాణ మిచ్చి సం
భరమున నెందఱో సతులు ♦ భర్తలఁ గూర్తురు; భార్యకంటె నీ

ధరణిని దైవమున్ గలదె ♦ తప్పక సత్య పతివ్రతా మనో
హర రమణీలలామ సతి ♦ యైన మంతెంతకు స్వర్గ మారయున్.

గుణ — ఇది యతిశయోక్తి యనిపించదు గదా?

గురు — కాదు; ముమ్మాటికిని గాదు.

చ. అరయ పతివ్రతాతిలకమై ♦ యలరారెను పుణ్యశీల నీ
తరుణిని సిల్పి యీశ్వరుని ♦ తత్త్వము నామె హృదంతరంబునన్
బరిణతమైన ప్రేమ యను ♦ పాఠములోపల నేర్చుకొమ్మ! యీ
గురువుల నేల కొల్చెదవు ♦ కోవిదుడా! యివె నుమ్ము మర్మముల్.

సో — ఇట్టి భావగంభీరము లైన యౌగికవిషయము లీలోకము గ్రహించుటకే బహుకాలము పట్టును. ఇంక నాచరణమున కెట్లు సాధ్యము?

కళ — గురువర్యా! స్త్రీల కెంతవఱకు స్వాతంత్ర్యత నియ్యవలయును?

గురు — ఇచ్చుట యేమి? అది వారి యోగ్యతనుబట్టి యుండును.

చ. తరుణి వివేకముం, జదువు, ♦ ధర్మము, జ్ఞానము తత్త్వదీక్షలన్
గురువుల చెంగటన్ బడయఁ ♦ గోంనవారల మాన్యవారు సూ
కరులయి పుట్టుచుండ్రు, బహు ♦ కాలము కర్మముఁ బాయలేక; యీ
మఱుగు నెఱుంగకున్న మఱి ♦ మానవజన్మ వృథాప్రయాసయే.

కావున, —

ఉ. మానినులన్ బ్రవుణ్యాలుగ ♦ మార్చెదు యోగ్యత పూరుషాళిలో
మానసికానురాగమగు ♦ మార్గములోఁ గల; దాపథంబులన్
మాని, పతంబు వారి నను ♦ మానములన్ దిలకింతు రందుచే
మానవుఁ డాత్మసౌఖ్యముల ♦ మాపుకొనున్ దన తిప్పెఱుంగకే.

జయ — నిజము, నిజము గురువర్యా!

చ. కలిమిని మెచ్చి కీర్తించి ప ♦ క్వాకృతులై చనుచుండునట్టి యీ
కలుషకలంక కృత్యములచే ♦ గల్గునె యందు సౌఖ్యమట్టిపా
రిలు; పురుషుల్ కడింది జవ ♦ రాల్గ చెలంగి బెట్టు శ్రమల్ తలంప; రా
కలనము కత్తి దారువుపై ♦ గాయము మెఱింగిన యట్టు లుండెడున్.

గురు — కావచ్చును.

ఉ. ప్రాణు లశాశ్వతుల్ తెలియ ♦ వచ్చిన వారలు లేరు; స్వాత్మ వి
జ్ఞానము గల్గువారె త్రిజ ♦ గంబుల బూజ్యు; లిహాంబు రెండునా
త్మే; నడుపంతి; దీనికయి ♦ యేడ్వఁగ నేల? భవిష్యదర్థముల్
గాన; మదృష్ట మేమిగిది ♦ గాఁగలదో యది చెప్ప దెరికిన్.

సోమ — అటులైన ఆధ్యాత్మికజ్ఞానానుభవము కూడ అదృష్టలభ్యమేనా?

గురు — కాదు. అది మానసికపరిణామము.

ఉ. జ్ఞానపథంబు ప్రేమమయ ♦ సాగరమైనది; పూతమైన ఆ
స్థానము వహ్ని కన్న గడు ♦ దారుణమైనది; తత్పరీక్ష కే
మానవుఁడాఁగునో యతఁడె ♦ మాన్యుఁ; డెవండు గుణోత్తమాత్మ సో
పానములందు మానసిక ♦ భాండము మోదునో వాఁడె సిద్ధుఁడున్.

సో — అట్టి సిద్ధుల నియమంబు లెట్టు లుండవలెను?

గురు — ఆనియమంబు లాతఁడే నిశ్చయించుకొనును. కావున,

ఉ. ఏనియమంబులన్ దవిలి ♦ యేమి యొనర్చిన వ్యర్థ; మాత్మ వి
జ్ఞానరసంబు శూన్య కల ♦ శంబునుబోలె బ్రతిధ్వనించు నీ
మానసమందు నింపు; మనుమా ♦ నములన్ దొలవ్వాలున్న నీ
స్థాన మెఱుంగవచ్చు; దనుఁ ♦ దాన యెఱుంగు తెఱం గిదే సుమీ.

సోమ — [illegible] చెప్పిరి. సగాహ్యసయములు చిన్నవి.

కళ — స్వామీ! [illegible] తెలిసితిమి.

గుణ — ఇదియొక్క సుకము.

గురు — అట్లుగాఁ జెల్లదు

చ. మతములు లేవు వేఱు; మత ♦ మార్గములన్ వ్యతిరేకభావమున్
మతి [illegible] ♦ [illegible] గ్రహించుడు; మ్లేచ్ఛులైన దు
ష్ప్రకృతములు లేవు; తాత్త్విక వి ♦ శేష విలాస వినూత్న భావ సం
గతి [illegible] దెలియఁ ♦ గల్గెను త్రోవలె లక్ష్యమన్నిటన్.

కావున మీరాశ్రోచకశీలములచే సిద్ధమ్మును దేశదేశముల వ్యాపింపఁ జేయవలయును.

కళ — ఇది [illegible] మహాపుణ్యము.

సోమ — సత్యము.

ఉ. ఎన్నిరహస్యముల్ తెలిసి ♦ యెన్నిమహాత్ములు గల్గియుండినన్
దిన్నని మార్గమందుఁ దన ♦ దృష్టిని నిల్పి దరిద్రమందు, పం
పన్నతయందు ధర్మమును ♦ బాయక అగ్నిపరీక్ష కాఁగువా
రున్నవెకాని వారి మత ♦ ముండదు - ఉండదు వారిసంఘమున్.

జయ — మఱి నామాట ఏమి?

గుణ — ఉపన్యాసము. [illegible] లేకపోతే ఉపవాసము. ఆపైనైతే సన్యాసము లేదా [illegible] సహవాసము. [illegible] విలాసము. అది కాదితే రసాభాసము. ఈరీతి నీకోపము (అని వ్రేల్పట్టి చూపించును.)

జయ — చాలు నీసంభాషణ కట్టిపెట్టుము.

శిష్యులు —

పాట

ముక్తికి మార్గము మూలము దెలిపెను
మోదము గలిగెను మాకింక
భక్తిపథంబున భవభయహారమగు
వ్యక్తి లభించెను నిశ్శంక ॥ము॥
తాపత్రయముల ఆపద లుడిపే
ఆపరమేశ్వరు నర్చించి
కాపాడుటకై యేపురుషుం డెవ
నోపి భుజించుచు నుండునో ఆ ॥ము॥
గృహములలోపల గృహిణులలోపల
విహితమె స్వర్గము వివరింప
మహిళామానస మంజులప్రేమయె
మహితాదర్శము ముఖ్యముగా ॥ము॥
(పాడుచు నిష్క్రమించెదరు)

భవ — ఆహా! పరమధర్మ మన్న నిదే గదా.

అశ — అగు నిది దేవతలచేత సంస్తూయమానమైన మహాజ్ఞాన తత్వము.

జయ — నాకిక్కడకూడ శరణ్యము లేకపోయినది. నేనీదాసిని వెంట దీసికొని వేశ్యవాటికలో చేరి మోముపై ప్రచ్ఛన్నత వచ్చు రంగు పూసి పెద్దపరివర్తనము పుట్టించెదను; దానంగాని యీగుణదత్తుని తెగులు కుదురదు. పదే. (అని చెంగున గంతువేసి నిష్క్రమించును)

(తెరపడును.)

ద్వితీయాంకము

.....○.....

రంగము — పర్ణకుటీరము

(సోమపాలుడు పాటపాడుచు వచ్చును.)

పాట

1

మానవజీవిత మేటిసు మాయనో
కానరా దెవ్వరికి
ఆనంద మొవ్వారు అతిశయముల మీాద
ఏనాఁడో పడిపోవును.
ఆనాఁడు దుఃఖాల మేఘాలు వర్షించు
మానసమనవీథ్యు మునిఁగిగిరయిపోవు.

2

ఏలాటిచిత్రాలు కాలగర్భమునందు
గ్రాలి రానున్నవో
ఫాలాఫలకమందు వ్రాలు జరిగితీరు
ఏలాయిాయత్నాలు నేలపాలై పోవు

3

తెలివితేటలు నున్న కలిమి పోయెడునాఁడు
గవ్వకు మారవుగా ॥గుడ్డి॥
ఖలుఁడని యనిపించు తులుఁడని తిట్టించు
ఇలు వెళ్ళఁగొట్టించు కలవంటి దీబ్రతుకు ॥మా॥

సో — గడచిపోయిన కాలము శుక్లపక్షమువలె నొకవెలుఁగు వెలిఁగి 'గం' అని యాఱిపోయినది. ఇప్పుడు వచ్చినది కృష్ణపక్షము. ఇదంతయు

వ్యసనభూయిష్ఠము. చేతులతో చీల్చుటకుఁగాని, చిమ్మచీకటి. స్వార్జిత మైన ధనప్రవాహము కొండవాగువలె ప్రవహించి ప్రవహించి హారతి కర్పూరమువలె నెగిరిపోయినది. బంధువులు మిత్రులు తిని తట్ట నగుల చేసి వెళ్ళిపోయిరి. నావద్దనిఁక కానీకూడలేదు. శిరసుఁ బువ్వులు చుట్టు కొన్న యిచ్చట నెత్తిగొట్టుకొనుట కష్టము. కావున నీయూరు విడిచి పోవుట మంచిది. ఆహా!

శా. ఏదేశంబున పాఱిపోవుదును నే ♦ నేరీతి ద్రవ్యంబు సం
పాదింపంగల నెవ్వరడ్డుపడి నా ♦ బాధల్ నివారింతురో
యీదారిద్ర్యసముద్ర మీదుటకు నిం ♦ కేమున్న దాధార మ
య్యో! దీనత్వముకన్నఁ జావు మెఱుఁ ♦ గెంతో దేవుఁ డీరాదొకో.

కర్మబద్ధునకుఁ జావుమాత్రము సులభముగ వచ్చునా! రాదు. కావున నెందైన లేచిపోయెదను. అచ్చట, —

మ. పరదేశంబుల నాకటన్ నిదురవో ♦ వన్ లేక యాచించుచుం
దిరుగంబోయిన నెవ్వ రీతఁ డని ప్ర ♦ శ్నింపగ నెవ్వారు గో
రరు, ప్రాణంబులు నోట వచ్చిన విశీ ♦ ర్ణంబైన నెవ్వారుఁ జే
రరు, రాగోదయమైన బాష్పకణముల్ ♦ రాల్పన్ బ్రయత్నించుచున్.

అక్కటకటా! నాస్థితి యెంత నికృష్టమై పోయినది. సవతి సోదరుఁ డెంత యపకృతి చేసినాఁడు. మంచికిపోయి పాడైపోయినాము.

చ. తినుటకుఁ గూడులేదు; శ్రమ ♦ దీరుపఁగా నిలులేదు వీధిలో
జనుటకుఁ గట్టుపుట్టములు ♦ చాలవు నేనును నాలుబిడ్డ లే
యనువునఁ బొట్టపోసికొన ♦ నౌనొకొ; కాటకమయ్యె మాకు, మా
దినములు చెడ్డవయ్యె మఱి ♦ దీరని పేదరికంబు వేఁచెడిన్.

అయ్యో! ఇంకేది కర్తవ్యము!

ఉ. ఆలోకవంక నేడ్వఁ, దమ • యాఁకటి కోర్వక బిడ్డలెల్లరున్
గోలలొనర్పఁ, జంటి పసి • పూసలు పాలకుఁ బోరుపెట్టఁగా
సోలెడుగింజలున్ దొఱకు • నూటి యొకింతయు దోఁచదాయె; నా
యాలయు మొక్క దుఃఖపు య • మాలయమై కనుపట్టుచుండె నన్.

ఇదిగో! నా ప్రేయసి కళ వచ్చుచున్నది.

కళ — (ప్రవేశించి) నాథా! మీదాస మీపదపద్మములకు నమస్కరించుచున్నది.

సో — శుభ మగుఁగాక!

కళ — మీయాశీర్వాద మమోఘ మగుఁగాక!

సో — దేవీ! అనుపమానమైన నీసౌజన్య విశేషముచేతనే నే నీమేన ప్రాణంబులు నిలుపఁగలిగితిని. లేనిచో నిదివఱకే యీ కాటక దేవత నన్నాహుతి చేసి యుండవలసినది. కాని —

తే. గీ. అంతకంతకు నస్మదా • శాగమంబు
పుల్లవిఱిగిన ముద్దమానిఁ • బోలె దినది
నంబు క్షీణించు; కృష్ణ ప • క్షంబునందు
చంద్రకళలు తగ్గుచుఁ బోయి • సమయునట్లు.

కళ — నాథా! యిట్టి మీదురంత సంతాపమునకు నిమిత్తము నేను గదా. ఆహా! నేనెంతటిపాపినో! ఓసూర్యచంద్రులారా! నన్నాదుకొన రాదా! ఓభూమాతా! నీలో నాకొకింత చోటొసంగలేవా!

సో — యువతీ! యింతగా నేల వగచెదవు!

కళ — నాథా! నాదొకమనవి చెల్లింపుఁడు.

సో — అదియేమి (స్వ) ఈమె ఏమికోరునో? (అని మూర్ఛిల్లును)

కళ —

ఉ. ఆకటిచేఁ గృశించి తమ • యాఁబడు బిడ్డలు నేడ్చుచుండ నీ
శోకము చూడలేక యిటు • శోషిల నేటికి నన్ను బిల్లలన్

దోసోని పాడునూతఁ బడఁ • ద్రోయుట పుణ్యము దీనికన్న నీ
వ్యాకులతా దరిద్రతల • వారణమార్గము లేదు చూడఁగన్.

అట్లు కాదంటిరేని, నేనిఁక నీబాధకును సహింపనోపకున్నాను.

ఉ. కూటికిఁ దేని యీనుగని • కోమలిపై నెటు కావురంబు ని
చ్చోటను జేసి గంపెదు ని • సుంగులఁ గాంచితి కంగ వీరి నా
ప్పాటను జెంచనోచెదవు • పాలును నీకును బోసి యుంచు నన్
మాటికి దెప్పుచుండ్రు దయ • మాలి కడున్ బొకగింటి మానినుల్.

ఇట్టివన్నియు వినుచున్న నాచెవులు చిల్లువడుచున్నవి. నేనింక సహింపఁజాలకున్నాను. కావున నేనూయిరో గోయిరో చూచుకొనుటకన్న గత్యంతరము లేదు. ఇందుకు మీ రనుమతింపవలయును. ఇదే మీరు నా కొసంగవలసిన వరము.

సో — (లేచి) ఆహా! నేనెంత నిర్భాగ్యుఁడను! దేవీ! నీవు స్త్రీజన సామాన్యమైన తీరున,

సీ. నగలు కావలెనంచు • జగడ మాడఁగలేదు
అణిముత్యపుసరు • లడుగలేదు
పట్టుబట్టలుఁ దెచ్చి • పెట్టఁ బోరఁగలేదు
రంగుచీరలకు జీ • రాడలేదు
కస్తూరిగంధముల్ • కావలె ననలేదు
స్నిగ్ధసౌధాళిఁ గాం • క్షింపలేదు
మృష్టాన్నభోజనం • బిడ వేఁడగాలేదు
ధనధాన్యములను దే • మ్మనఁగలేదు

తే. కలిమి పోయెను • పుట్టింటఁ గాపురంబు
పెట్టుమని కర్తికోతలు • పెట్టలేదు

బ్రతుకఁ దెఱువు వేఱు గాసి బతి ♦ మాలుచుంటి
వకట నీయట్టిపాఖ్యా లీ ♦ యువనిఁ గలరె.

కళ — ప్రాణేశ్వరా! ఇదివఱ కెల్లు గడచినను నిర్భాగ్యమును, దుర్దశాకరమైన ఈ దారిద్ర్యదేవత మాంగళ్యమును దూలించివేసినది. కాని నన్ను కొట్టుకొనిపోవకున్నది. ఇంక నేనేమి సేయుదును! మీసోదరుని నమ్మి మీరాకీసంసార మింతకుఁ దెచ్చినారు. పైగా ఋణమై పోయినది. ధనమా జయుకు దక్కలేదు. ఆమె తీరవు మార్చుకొన్నది. వేళ్య వాటిని చంచల యనుకేకఁ జరుగుచున్నట్లు వినుచున్నాము. వాళ్ళపా ళ్ళెల్లున్నను మనగతి యేమి!

సీ. ఆకటికై యంగ ♦ లార్చుచు నింట వి
డ్డలతోడ నెన్నాళ్ళు ♦ నిలువవలయు
మైయెల్లఁ గప్పని ♦ మాసిపోయిన యొంటి
వలువతో నెన్నాళ్ళు ♦ వరలవలయు
జడ లల్లుకొని చిక్కు ♦ విడరాని చింపిరి
తలతోడ నెన్నాళ్లు ♦ తనరవలయు
పొరిగింటిపంచల ♦ నిరుకైన యురఁగులఁ
గాపురం బెన్నాళ్లు ♦ గడపవలయు,

తే. వానకెండకుఁ దలయొగ్గి ♦ వాసరములు
కష్టముల కోర్చి యెన్నాళ్ళు ♦ గడగవలయు
ధరణి రవిచంద్రగతులైన ♦ దప్పఁగాని
మనదరిద్రపుదినములు ♦ మారవయ్యొ.

సో — ఆహా! ఇఁక మనకు దైవమే ఆధారము. మనము విజ్ఞానపళా సభ్యులము గదా. ఎన్నియాపదల కైన సహించుట మన విధియై యున్నది. వగవకుము.

పా ట

1

దారేగసరాదు ఏదో, నుయ్యో, గొయ్యో
దారుణదుఃఖ విచారము ఘనమై
ఘోరదవాగ్ని గురిసెను నాపై ॥దా॥

2

ఉన్నవిలేనివి అన్నియు పోయెను. అయ్యో
అన్నమె యని తెగనార్చినను
ఇన్ను నన్ను ఏ తెన్నునఁ గన్నఁగ
సున్నయె మఱి యేమున్నది బ్రతికే ॥దా॥

3

చేసితి యత్నము చేసితి సేవా ॥దేవా॥
ఈసరి కవి ఫలశూన్యములై
గాసిపెట్టె నీ దాసుఁడనై యీ
దోసిలి నొగ్గిన పీసము దొరకే ॥దారే॥

(పాడుచు నిష్క్రమించును.)

రంగము — మధువీధి

(వేశ్యలు విటులు గుణదత్తుఁడు ప్రవేశించి యుందురు.)

పా ట

1

మధుశాలా మాతల్లి నిన్ను విడువనే ॥మ॥
అధరమందు నీకు కడు మధుర మున్నదే
మధ్యమైన నీలాటి దైవు సొంపునింపునే

2

ఈవసుధ విహారముల సాధకమునై
ప్రేమించు స్వర్గాల సిరి దివ్య దీపించు ॥మ॥
(అందరు పాడుదురు)

గుణ — జగము మిథ్యగాదు. మనము మిథ్య, మనభావములు మిథ్య, అతీంద్రియములైన స్వర్గనరకములు మిథ్యలు! పాపపుణ్యములు మిథ్య. ఒకటి యేమి? సర్వము మిథ్య. ఓమిథ్యా! నీకు నమస్సులు; ఓఆధ్యాత్మిక విజ్ఞానమహాసభాసభ్యుండా! ఓఅస్పృశ్యవాదీ! నీ వ్యాసంగములింక కట్టిపెట్టుము. నీమర్మభేదకమైన వేదాంత తత్త్వ ప్రతిపాదక యోగసమాధి అనిర్వాణము, అమృతత్త్వము నాపాదముల క్రింద నున్నది. నేను బూడిదనైనచో నేను నాపాదాల క్రిందకే పోవుదును. ఇదిగో నీనోటికి దాళము వేయు చున్నాను. నీవింక కల్పాంతరము దాక లేవజాలవు.

తే. గీ. మధువె యమృతంబు? శైలూషి ♦ మంజువదన
లెల్ల దేవకన్యలు; గానమే ♦ రసంబు;
తంత్రినాదమె తేజంబు ♦ దనరు వేశ్య
వాటికయె సుమ్ము కైలాస ♦ పట్టణంబు.

తే. గీ. వసుధ కిదె ప్రేమ నేర్పెడు ♦ పాఠశాల
కవుల కాణాచి; గాయక ♦ కల్పతరువు;
సోమరసమమ్మ వెలయాంధ్ర ♦ భూమి, వీటుల
కోన, బ్రహ్మచారుల కొల్వు ♦ కూట మిదియు.

(నాట్యాంగనలు పాడుచు నృత్యము సేయుదురు.)

గుణ — ఆహా ధన్యము! ధన్యము!

మ. భరమౌ రాగరసంబు, సంధ్యలు, సుమః ♦ ప్రాసాదముల్ కైకొనన్
శరముల్ చిమ్మెడు కాలవాహిని నభః ♦ స్వర్గీయగానంబులో

నెరసైపోయిన ప్రేమపాశ మెవరే ♦ నిన్ బాడి నిర్ద్రాణమై
యిరులన్ గాటుకపట్టియున్న మతి నెం ♦ తే తేపఁగా వత్తురే.

ఎవరి కెవ్వరును గారు.

ఉ. చేసితి జన్మమ ల్; తపముఁ ♦ జేసితి; జీవరహస్య మేమిటో
యీపరి కక్కటా! తెలియ ♦ దింతయు వ్యర్థము బ్రహ్మవిద్య జి
జ్ఞాసనొసంగు ఘోరవిష ♦ సర్పము; దాని బరిత్యజించి యీ
యూపవము న్మృగాక్షి యధ ♦ రాసవమున్ గొని మోద మొందెదన్.

భవు — ఇది నిక్కముగాదు.

గుణ — ప్రత్యక్షము లైన యీ రాగభోగములు నిత్యము గాని యెడల నిక నీమృధాకల్పిత స్వర్గసుఖంబులా నిత్యములు? కావు పొమ్ము. ఆవలకుఁ బొమ్ము. నేను బ్రహ్మజిజ్ఞాస యను దుఃఖరంగమును విడిచితిని. వేదాంతులు గొప్ప మోసగాండ్రు, లేదా గొప్ప భ్రాంతులు. వారివల నుండి యెటులో యదృష్టవశమున దప్పుకొనఁ గలిగితిని. ఇంక నామిగిలిన దివ్యజీవన మహానంద నాట్యరంగమున నేఁడే ప్రవేశించితిని. దీనికి నాందీ ప్రార్థనము గావింపవలయును.

మ. కరపుల్ మోడ్చి సురాగణంబులకు మా ♦ కాదంబరీదేవికిన్
సురకున్, వేశ్యకు, సల్లమందునకు, మా ♦ జృంభంగు గంజాయికిన్
స్వరసంగీతసుధారసంబునకు, వే ♦ శ్యావాటికిన్ పీటికిన్
శిరముల్ వంచి నమస్కరించెద సుఖ ♦ శ్రేయంబు సిద్ధింపఁగన్.

చంచల — (నాట్యము సేయుచు ప్రవేశించును)

పాట

1

తరళతరవిలోలనేత్ర సుమ
శరసన్నిభగాత్రి పవిత్రా ॥త॥

2

సరసమ్మాడయు అళికుంతలఁ జూడ
సొగసులు కొమరొప్పఁగాఁ

3

ఏమఁ గనుఁగొని మనమున వినుతించి
ఘనత నెంచి కృపకు ప్రార్థించి

ఆహా! నేఁ డెంత హాయిగా నున్నది!

చం. పతి విడనాడితిన్; మనసు ♦ వచ్చినవారిని గూడి యాటలా
డితి; సొగసైన పాటల ప ♦ ఠించితి; నిత్యము నృత్యగాన సం
గతి విటరాజశేఖరుల ♦ చాటున సోమరసంబు ద్రావుచున్
క్షితి నమరావతీపురముఁ ♦ జేసితి దుఃఖము లేదు నామదిన్.

గుణ — ఆహా! నీవే నిక్కమగు వేదాంతవేదినివి. ఏమందువా! దుఃఖనివృత్తియే జీవన్ముక్తి. ప్రేయసీ! ఈ యాసవ మొకింత ద్రావుము. చాలసేపు నాట్యముచేసి అలసిపోయితివి. (అని యిచ్చును) పూర్వమగస్త్యుఁడు సప్తసముద్రము లొక్కగుక్క పట్టినాఁడు. వానిలో నొకటి కల్లుసముద్రము. నేనిప్పుడు ద్రావుచున్నదా కల్లే. కావున నాయగస్త్యునకును నాకును చింతాకంత వార చంచలా! ఈ చషకమును పరిగ్రహింపుము. ఇది సురపూజాభాజనంబైన మహాపదార్థము.

చంచ — ఇది యిదివఱకే నాకడుపులోఁ గలదు.

గుణ — ఆహా!

పాట

1

అందఱ త్తె వహూహా! నీ వందఱ త్తె వహూహా
సుందరహరిణేక్షణ నీచందము నా
చందురుఁ డౌనయగు నా
ఇందిందిర చికుర ॥వం॥

2

కౌఁగిటను ముద్దిడుమా
ఆఁగనీకఁ గైకొనుమా
చంచ — ఆఁగుమాఁగు మింత తెగువా వే
వేగ పోపో మ్మిది నగవా!
సాగ విచట కుప్పిగంతు
లేగుమీ విరాగి వగుచు ॥అం॥
అందఱ త్తె నై తే నేనందఱ త్తె నై తే
సుందర హరిణేక్షణ నాచందము నా
చందురు డౌన యగునో
ఇందిందిర చికుర ॥నం॥

గుణ —

మ॥ సురపైఁ దత్కలశంబుపై విరులపై ♦ శుద్ధాంతసౌధాళిపై
పరమాహ్లాద రసార్ద్రగీతములపై ♦ భక్ష్యాలపై నిద్రపై
సరసాలాపముపై సతంబుగల నా ♦ స్వాంతంబు నీపైఁ జెలీ
కరమొప్పారెన్ నన్నుఁ గొమ్మినుము ♦ మయస్వాంతంబుచందంబునన్.

చం —

మ. పురిపైఁ; బాపిరులమ్ము బట్టపయిఁ బాం • బూలమ్ముపైఁ; హాసుపైఁ;
పరకీయాశ్రవణాంబుపైఁ; చిఱుకునుం • బాచీరపైఁ; పాటపైఁ;
సురపైఁ; జందనచర్చపైఁ; రయికపై • జోబిల్లు నాప్రేమ నీ
వరకున్ రాదు పికంబు మావిచిగురున్ • వర్జించి పోనేర్చునే.

గుణ — చంచలా! నాకింకేమిగతి?

చంచ — అధోగతి.

గుణ — ఓపికవాణీ! నీవు నిజము చెప్పితివి. (పై పద్యము చదివి) ఆమావిచిగురు నేనే యని భావింపుము.

చంచ — నీవు మావిచిగురువు కావు; నరమామిడిచిగురువు (అని పళ్ళికిలించును).

గుణ — (హహహహ యని నవ్వి) ఆహా! చంచలా! నీవు దేవదానవులను పల్టీలుకొట్టించు ప్రౌఢవు. నీవు సామాన్యవేశ్యవు కావు. నిజముగ విటుల కొరకు విశ్వవిద్యాలయమే యున్న దానికి నీవు ప్రధానాచార్య (Vice-chancellor) పీఠ మలంకరింపవలసిన నెఱజాణవు. నీకుఁ గల కామకళాజ్ఞాన మా వాచ్యాయనాదులకైన లేదు. రంభాది దేవవేశ్యలు నీయుంగల నల్లపూసలకైనఁ గొఱ గానేరరు. నీసౌందర్య మట్టిది! నీవంటి ముద్దులాడి కాలుతో తలపైఁ దన్నినను,

తే. గీ. తరుణి ప్రియురాలి వలపుల • తన్ను చెలకు
ముక్కకంటెను దియ్యనై • మోదమిడును
తరుణి గజ్జెలందెల కాలి • తన్నుఁ దిన్నఁ
జేతితో గారెలను దిన్న • రీతిఁ దోఁచు,

చంచ — విటులపని తుద కంతే.

గుణ — చంచలా! ఇంక నాకేమిఁగతి?

చంచ — అధోగతి.

గుణ — ఈదుర్గతి కెవరు కారణము?

చంచ — కుమతీ! నోరుమూయుము.

గుణ — ఆహా! ఆహా! (అని పడిపోవును.)

చంచ — (లేపి) ఇంతలోనే భీరుఁడ వైపోయితివి!

గుణ — (లేచి) ఆ...ఆ...చంచలా! నీవేనా లేపితివి!

చంచ — అగును (స్వ) పొరుగింటి పుల్లకూర రుచి! నేనీతని కుల కాంతగా నుండినప్పుడు పనికి రాలేను. వెలకాంత నని చెప్పినంతనే పడి చచ్చుచున్నాఁడు.

గుణ — నేనెంత ధన్యుఁడను.

చంచ — గుణదత్తుఁడా! ఆవైపు (అని చూపించి) ఆవేశ్యవాటిక! (మెడలోచెయ్యివైచి)

తే. గీ. అందకాఁడవు నీవు నీ ♦ యంతవారు
లేరు లేరని యూవెల ♦ లేమచనుల
చూచుకంబులు తలలూపి ♦ చూచుచుండె
పైటమాటున రైక పైఁ ♦ బైకి వచ్చి.

గుణ — నేనిప్పుడు స్వర్గలోకమున నున్నాను.

చంచ — (స్వ) నేనీతనిభార్య 'జయ' అని యెఱుంగఁడు.

గుణ —

ఉ. ఈనముపాసితం బయిన ♦ యీశ్వరతేజము భూమి నిండి కై
చేసి ప్రశంసనీయమయి ♦ చేరుచు నున్నది స్వర్గమందిరా
వాసము దాఁక; నీవెలుఁగు ♦ వాసన లెల్ల వెలార్చి జీవితా
భాసముఁనందు నేననెడు ♦ భావము సిద్ధముఁ జేయుఁ జూచితే.

చంచ — అది చాల సంతోషకరమైన పనవు.

గుణ —

సీ. ప్రణయిని! నీ కేశ • పాశ [illegible]
[illegible] సోలెడు నన్నుఁ • జూడవేమి
ప్రేయసీ! నీరాగ • [illegible]
[illegible] నన్ను [illegible] • [illegible]వేమి
నెచ్చెలీ! నీమోహ • నిబిడ దావాగ్నిలో
[illegible] నన్నుఁ [illegible] • [illegible]
మానినీ! నీవచో • మాధుర్యవాహిని
కసువు నిచ్చెడు నన్ను • నరయవేమి

తే. గీ. సంతసము నమ్మి దుఃఖమ్ము • సంతలోనఁ
గొంటి; వెతఁగంటి; జేడిన • కంటి నిన్ను
నల్లమనసు నింటిలో దాఁచు • కొంటి; దానిఁ
దెఱచి కనఁగొమ్ము నీను సుం • దరవటమ్మ.

చం — సరే! సంతసించితిమి, కాని నీవెంత మూర్ఖుఁడవు.

కం. అక్కఱకురాని మాటలు
పెక్కులు వచియింపనేల • వెలవెలఁదికడన్;
ఱొక్కం బిడనిదె వేశ్యలు
చిక్కరు వారలకు ప్రేమ • చిత్రము గలదే.

గుణ — హా! హతోస్మి, హా! హతోస్మి. చంచలా నీకిచ్చినధనము చాలదా! ఇంకను దెమ్మనెదవా?

చంచ — (నవ్వి. స్వ) ఇతఁడు నాడబ్బెంత హరించినాఁడో మఱచి నాఁడు (ప్రకాశము) గుణదత్తా!

ఉ. ఒక్కక్షణంబులో వికసి ♦ తోత్పలనేత్రలపైని గల్గు పె
న్మక్కువ కెంతరో విటులు ♦ మాన్యములమ్మి, గృహమ్ములమ్మి యే
దిక్కునొ యప్పుచేసికొని ♦ తెచ్చి యఖండధనంబు లిత్తు రా
ఫక్కి యెఱుంగవేము తులు ♦ వా! వెలయాల్వాలఁజెప్పశక్యమే!

గుణ — ఆహా! చంచలా! ఎంతమాటంటివి. నేను తులువనా! ముద్దు లియ్యవలసినచోట గ్రుద్దుకొనా రావలసినది ?

చంచ — అగును. డబ్బులేని విటులకు వేశ్యలిండ్ల ముద్దులకు బదులు గుద్దులు! (అని గ్రుద్ది నిష్క్రమించును)

గుణ — హా! హతోస్మి హతోస్మి! ఎంతబ్రతుకు బ్రతికి తుదకెట్లు పరాభవింపఁబడితిని!

భవు — ఈతని కిప్పుడుగాని పశ్చాత్తాపము గలుగలేదు.

తే. గీ. పరిభవానలమునఁ గాని ♦ నరులగర్వ
మణఁగ దప్పుల నిప్పుచ ♦ ల్లారినట్లు
దెబ్బలను దిన్నహృదయమే ♦ తీరుచుండు
రాతిదెబ్బల గోరింట ♦ పఁగొసంగు.

అభ — నిజమే కాని, యింతమాత్రాన —

గుణ —

చ. కలధన మెల్ల వేశ్యలకు ♦ గాదులఁ బోసితి వారి కల్లుకుం
డలకు సువర్ణపేటికల ♦ డాగి పటాగ్రము లెత్తి గజ్జెలం
దెలకు శిరంబు మోపి వర ♦ దేశిని గానని బొంకు కట్టి యా
వల వలపింప నావలపు ♦ వడ్డికిఁ బారఁగ వేలుపోసితిన్.

ఇట్టు లున్నదంతయు సమర్పించితిని.

తే. గీ. ఇంకఁ దృణమైన వచ్చు దా ♦ రేది లేదు
కాసు వీసంబు చేతిలోఁ ♦ గానఁబడదు

ఏమిచేయుదు నసునైన నాకేపోదు
ఇట్టిగతి వచ్చునని కలనైన నెఱుఁగనైతి.

ఆహా! నేను మధువు గ్రోలితిని. నాశిరము మధుభాండము లాగి వేసినది. నాకాళ్లు కొంకిపోయి నాకేసినది. నాయాకలి నన్నిప్పుడు చీకాకు చేయుచున్నది. కాని నాకడ కానియైన లేక భీకరమగు వ్యాకులముల కాకరమైపోవుచున్నాఁడను. ఇఁక కేకలువేసిన నాకర్ణించు వా రెవ్వరు? ఆకాశము చూచిన శోకము పోవునా? ఆహా! నేను మున్ను జ్ఞానమహాసభ్యుఁడనై బ్రహ్మానందవారాశి నోలలాడి దుష్టుల సహవాసమున చార్వాకుఁడనై జగన్మిథ్యావాదినై తుద కీవేశ్యలచే పరాభవద వానలమున మాడి మసినై పోయితిని. నాయవజ్ఞతకుఁ జింతించుచున్న నన్నాదరించువా రెవ్వరు - తోడ్పడువా రెవ్వరు?

పాట

1

దేవుఁ డెప్పటి కేది తెచ్చిపెట్టునో గాని
ఏవేళ కేది రానున్నదో
ఈవింత లీలన్ను లీక్షించునని యెఱుఁగ ॥దే॥

2

తగుదునని యెన్నాళ్ళు
తలయెత్తి తిరిగి యొక లిప్తలో కాలనిహతి
తెగి నేలఁగూలి యీలీల విధి జం
జాలపటలంబుల
వగఁ గూరి కూరి యీ
నగవులపాలైతి నీక నన్నాళ్ళకైన నా
మొగము జగమున కగుపర్చగా గలనె యహా! ॥దే॥

భవు — పాప విూతనిమగ్నక్ యత్రువు ఖరాల్పవలసినంత శోవనీ వుముగా నున్నది.

అథ — కాని యిట్టి కుమతుల హృదయమున నీతి మంచువలె విడిపోయి హారతివలె నెగిరిపోవును.

తే. గీ. జొన్నకట్లు తియ్యగా ♦ నున్నఁగాని
బెల్లమేరీతి గాదో యా ♦ విధము దలఁప
ఖలులహృదయాలలో నీతి ♦ నిలువఁబోదు
బోడితలను బంతులు జారి ♦ పోవునట్లు.

(తెర)

తృ తీ యాం క ము

—o—

రంగము – గంగాతీరము

(సోమపాదుఁడు, కళ ప్రవేశించియుందురు)

సోమ — చెలీ! మన మిప్పుడు సురలకు గాణాచియైన వారణాశి ప్రవేశించినాము. చూచితివా! ఈ గంగాభవాని యెంతసొంపు సంపాదించుచున్నదో, ఆహా!

సీ. ఈగంగయే సుమీ ♦ యీరేనులోకాలఁ
జెన్నారి వూతంబు ♦ సేయునదియు
ఈగంగయే సుమీ ♦ యీశ్వరఘనజటా
జూటంబులోఁ దోలగి ♦ చూచునదియు
ఈగంగయే సుమీ ♦ యిల జహ్నుకడుపున
నుదయించి యువ్విళు ♦ లూరునదియు
ఈగంగయే సుమీ ♦ యొసఁగి భీష్మునివంటి
పరమహామహు నాత్మ ♦ బడసినదియు

తే. గీ. శ్లో॥ [illegible] ♦ [illegible]
[illegible]
[illegible] ♦ [illegible]
[illegible] ♦ [illegible].

వాణియు — శేషీ! [illegible] ఎంత రమణీయ మైన దృశ్యమో. ఆహా!

చ: [illegible] ♦ [illegible]
[illegible] ♦ [illegible]
[illegible] చూచితే సఖి
ఇదె [illegible] ♦ [illegible] ప్రాణమిచ్చెనన్.

భవుడు — ([illegible]) [illegible] వచ్చుచున్న అధ్యాత్మిక [illegible] దేవేంద్రాదులచే [illegible] భక్తుల దివ్యచరిత్రములవలోకించి [illegible], వ్యతిసంస్కారు లెవ్వరో [illegible] మహనీయులున్నారు. నేను [illegible]. ఆహా! వారీవంకకే వచ్చుచున్నారు. నేను ప్రచ్ఛన్నముగా నిలిచి వారి వర్తనము చూచుచుండెదను (అని ప్రక్కను నిలుచును).

(గుణవత్తియు చేపలవాండ్రును ప్రవేశించుదురు)

గుణ — ఓహో! నా అన్న సోమపాలుడు [illegible] యీ వంకకే వచ్చుచున్నారు. [illegible] వచ్చి యీతీరున తిరుగాడుచున్నారు. ఆహా!

చేపల — (పడవపై చేపలు పట్టుచు పాడుదురు)

గుణ — (స్వ) నా జీవితమున కిది [illegible] మూడవ రంగము ప్రారంభ

మైనది. నేను చంచలచేత పరాభవింపఁబడి లేచి వచ్చి యీగంగాతీర మాక్రమించి చేపలవాండ్లలోఁ గలసిపోయి యీ పని సవలంబించితిని. ఇంక ముందేమి కానున్నదో తెలియదు. నన్నువరుస గుణదత్తుఁ డని పోల్చలేరు.

(పట్టినచేపలు రాసులుగాఁ బోయుదురు)

గుణ — ఓరీ! వీని నన్నిటిని విక్రయించి సొమ్ముతీసుకొనిరండు.

చేప — చిత్తము స్వామి!

కళ — నాథా! జీవనముకొఱకై యిన్ని మీనముల ప్రాణముల నాహుతి సేయవలయునా. అయ్యయ్యో, వీరికేల దయలేదు.

ఉ. ప్రాణముకన్నఁ దీవు గల ♦ దా వలదా దయ ప్రాణికోటిపై,
ప్రాణుల నెల్ల నొక్కటిగ ♦ దా పశు వేమి మనుష్యుఁ డేమి యీ
మీనము లిన్ని చంపి తన ♦ మేనులు పెంచుటకంటె రొట్టె నే
దేని భుజింపరాదె తగ ♦ దే సుకృతంబు మనుష్యజన్మకున్.

గుణ — ఓహో! నీవు బౌద్ధభిక్షుకివలె నున్నావు. నేనీ జాలరులకు నేలికమీఁడను. నాకీచేపల నమ్ముకొనుటయే వృత్తి. నీ ధర్మోపదేశముల విని నేనీవని మానితినేని నాటాత్మునా ప్రాణత్యాగముఁ జేసుకోవలసినదే. నాకిది తప్ప వేరుగా జీవనాధారము లేదు.

కళ — నాయనా! పుట్టించిన దేవుఁ డన్నము పెట్టఁడా. హత్యయే జీవనాధార మనుట శోచనీయముగదా.

ఆ. రాతిలోని కప్ప ♦ బ్రతుకుచు నున్నది
చదల నెగిరి బ్రతుకు ♦ చాతకంబు
స్థావరములు కదలి ♦ చనకుండ బ్రతుకును
మనము శాకభుక్తి ♦ మనఁగలేమ.

గుణ — నీనీతులకర్థము లేదు. చిన్నచేపలను పెద్దచేపలు తినుచున్నవి. అట్లే

తే. గీ. గుంటలో నుండు కప్పలు ♦ గొ[illegible] పాచి
[illegible] సీరాన ♦ కెం[illegible]
వృష[illegible] పసుల [illegible] ♦ [illegible]
మాంస [illegible] కీర్తి పెట్టె ♦ [illegible].

కావున అహింస, అస్తేయంబు [illegible] లేదు. మాంసమునం దెట్లు ప్రాణ మిమిడి యున్నదో శాకము[illegible] నట్లే కలదు. హింసలేని మానవజీవనము లేదు [illegible] ప్రతుకుటకు కర్మము లేదు. ఉపాధి [illegible] నవాదేయమైన భోగములు వర్జింపఁజనదు.

తే. గీ. పసులు పసుస్న చోటికి ♦ [illegible]వెట్టు;
చీమ కలగండ[illegible] తావు ♦ చేయుచుండు
కోకిలము మావిచిగురుల ♦ గూర్చ[illegible]
మధుపరాజంబు తేనెకై ♦ మసలుచుండు
ఉదర మెవరికైనను విడి ♦ యుండ [illegible]
పిండివంటలు సంసారి ♦ వండి తినును
అకలంబులు సన్న్యాసి ♦ యారగించు
క్షుత్తునకు సర్వ్వ లోకము జ ♦ గత్తునందు.

ఓరీ, దాసరీ! ఆవల యిటు తెమ్ము. అందలి పెద్దపెద్ద చేపలను బల్లెము గ్రుచ్చి చంపుదము.

కళ — అయ్యో! ఇది మహాపాపము గాదా!

గుణ — పాప మనునది లేనేలేదు. మానవులు తృణయవవ్రీహ్యాది రేతోరూపమున మాతృగర్భమునుండి వచ్చుచున్నారు. ఇసుకనుండి బంగారము పైకి పులుసులు పడివచ్చును. దాని నిప్పుడు దగ్ధకాష్ఠన్యాయమునఁ జూడవలసినదే కాని బంగారు కణికలో నిసుక కలిసియున్నదా

లేదా యని విచారింపఁజనదు. అట్లే మానవుల కాగామి సంచితములు నిమిత్తమాత్రములు.

సోమ — మానవులు కర్మబద్ధులు గారా?

గుణ — అట్లనువారివి మొట్టవేదాంతములు. సృష్టి సమస్తము పరిణామముపై నాధారపడియున్నది. నిన్న పాకులతో పచ్చగానున్న బంతిచెట్టు నేఁడెఱ్ఱనిపువ్వులను పూయుచున్నది. నిన్న నీళ్లో యని పండ్లికిలించిన శుక్తి నేఁడు గర్భమున ముత్యమును ధరించుచున్నది. అట్లే దేనికిని కర్మప్రధానము గాదు. కాలమే కారణము.

కళ — సరే! కాలమునకైనను తెలివలదా?

గుణ — మానవుఁడు స్వతంత్రుఁడో పరతంత్రుఁడో తెలియదు. ప్రవాహములో కొట్టుకొనిపోవు కాష్ఠము తెరంగున కాలప్రవాహమున బడి ఆశాలతల నడుమ నిరికి ఊపులను ఝంఝామారుతమునకు శరవేగమున కొట్టుకొనిపోవుచున్నాఁడు. ఎంత తెలిసినను మృత్యువు తప్పదు.

కళ — కావుననే సుకృతి మాచరింపవలయునని నానిశ్చయము.

గుణ — సుకృతిమా? ఇష్టోపభోగములే సుకృతములు! గడ్డియై మేయఁబడుటకంటె పశువై దానిని కొఱుకుట లెస్స. కొఱికెడుపశువును కొఱుకఁబడు గడ్డియు జడములే కాని కొఱికెడుపశువు దానిరుచి ననుభవించి జన్మము సార్థకము జేసికొనుచున్నది.

సోమ — ఇంక మానవులకు ధర్మార్థకామమోక్షము లను పురుషార్థములు వలదా?

గుణ — అగ్నియందుష్ణశక్తి, రాతియందు కఠినశక్తివలె పురుషార్థములు వానియంతనవే వెంబడించుచుండును. జీవునకు సుఖమే గాని, దుఃఖము లేదు. రాగమే గాని విరాగము లేదు. వేడుకయే గాని వేడుకొనుట లేదు. నిన్నటికి నేఁడొకదినము ముదిమి అపహరించినది. రేపనునది లేదు. ముదిమి మేనుపై ముసుగు వంటిది.

కం. బాల్య[illegible] గ్రా
వల్ల[illegible] యత్నంబు ♦ వచ్చును పోవున్
తుల్య[illegible]
నైల్యంబగు [illegible] ♦ నన్ బోధించుమా.

కళ — ఆవల పాపాత్ములు యమదండనమునకుఁ బాల్పడవలసి వచ్చును గదా.

గుణ — అది వట్టిది. యమకింకరులను గూర్చి చెప్పువాఁడు రక్తారుణాక్షులతో సంత్యులింగమై కరవాలములు చేతఁ బట్టుకొని కత్తుల నఱకుచుండును. వాఁడే యమదూత. [illegible] క్రూరతృపాణమే పాపపుణ్యములను తూఁచు త్రక్కెడ. ఆ చితియే అన్నిటికి స్వస్తిచెప్పు మంత్రపేటిక. ఆ సుఖరాసు కోపశిఖలైన బలివేదికయే యమధర్మరాజ సింహాసనము. జీవుఁడో, అస్థిపంజరములో ప్రోగుపడిన మృత్తికారేణు సముదాయము. ఆత్మ శరీరమను పదిలి యొక్క పెద్దగంతు వేసి వాయ్వాదులలోఁ గలిసిపోవునప్పుడు, తేజస్సులో తేజము మిళితమై పోయినప్పుడు, ఇంక దానిని పట్టికొనిపోవు వాఁడెవ్వఁడు? ఇంక స్వర్గమెవనికి; నరకమెవనికి? ఈశ్వరభక్తికిని ముసలమ్మ కథలకును భేదములేదు. తిని నిర్వ్యాపారముగఁ గూర్చున్నవారు వ్రాసినవే పురాణములు. వానిలోని సారమే ఉపనిషత్తులు. వేదాంతము బని బ్రహ్మసూత్రములు వ్రాసినాఁడేగాని, ఆత్మస్వరూప మిదమిద్ధమని నిరూపింపలేక పర్యాంతర్యామి యని యథోచిత నాస్తికవాదములోనికి దింపి మఱింత అంధకారములోని కీడ్చినాఁడు. ఇవి యేమియు నర్థములుగావు.

సోమ — ఇది పదార్థవాదము. నిరీశ్వరుల కాశ్రయమైనది. హేతువాదమువలన నిర్వాణము రానేరదు. నిర్వాణ మొక యపురూపమైన అమృతపదార్థము. దానికై యత్నించుట సమంజసము.

గుణ — సరే. మీకళ్లే అపకొనుచుండుఁడు. అయువులు నమ్మి స్థిరములు వదలివేయుము మీబుద్ధి గగనారవింద శాస్త్రమైన శశవిషాణప్రాయమైనది. మరుమరీచికలవలె బాధాభూయిష్ఠమైనది; వ్యర్థమైనది.

సోమ — ఈతఁ డెవఁడో బాగుగ చదువుకొన్న భావతార్కికుఁడు. మిథ్యావాది. శూన్యుఁడు.

గుణ — నేను శూన్యుఁడనే! నాకీ సృష్టి సమస్తము శూన్యము. అందులో నేను ఆస్తికముగా నుపాసన మగుచున్నా నని నీవెఱుంగవు.

సోమ — శుచిని గోల్పోయి, విధినిషేధములకు స్వస్తిచెప్పి మీనభుజుఁడవై వేదాంతములు పలికెద వేమోయి లజ్జాహీనుఁడవు!

గుణ — అగును, నేను లజ్జాహీనుఁడనే. నీవు నావలె పడిపోయి నప్పుడుగాని తెలిసికొనలేవు.

సోమ — ఇంకను నేను పడిపోవలసిన అగచాటు లేమున్నవి?

గుణ — మానవున కేస్థితియందును నిమ్నత్వ మున్నది.

(అని పడవ త్రోసికొని జాలరులతోఁ బోవును)

కళ — పాపభీతి లేనివా రందరిట్టి దుర్గతుల పాలై పోవుచుందురు. ఎవరికర్మము నెవరు దిద్దఁగలరు.

సోమ — సరే. మన ముందుగతి యేమో ముందు విచారింపుము.

కళ — ఆహా! ఆమె యెవతెయో యెఱుకసానివలె వచ్చుచున్నది. ఆమె నడిగి తెలిసికొనియెదను.

సోమ — సరే.

ఎఱుకత — (ప్రవేశించి, స్వ) నేను 'జయు' పేర పరఁగు చంచలను. నే నీయెఱుకసానినై వీరి కేదో త్రోవ చూప వచ్చితిని. (ప్ర)

తే. గీ. జీడిగింజలు, మోదుగు ♦ మూఁడ, సూఁపు,
లాలుముగలకు సతము వ ♦ శ్యౌషధములు

నల్లపూసలు, చపలవు ♦ రాళ్ళు, పచ్చ
బొట్లు కానవెతా ... ♦ ...

సోమ —

తే. గీ. నెత్తిపై గంప, కుంకుమ ♦ నొత్తిబొట్టి
నుదురు, మెడనిండఁ బూసలు ♦ మడచుగ పొట్టి
చీర, కెంపులహారాలు ♦ తోరణములు
శ్రుతులఁ గమ్మలు, కొమ్ముగా ♦ జులుసు దాల్చు
నీవెవరు తల్లి! యీదారి ♦ నేగుచుంటి
వెఱుక చెప్పక పోయెద ♦ వెవరికమ్మ!

కళ — ఆఁగుమాఁగుము.

ఎఱు —

తే. గీ. జీడిగింజలు, మోదుగు ♦ మూడ, సూది
లాలుమగలకు పతిము వ ♦ శ్యౌషధములు
నల్లపూసలు, చపలపు ♦ రాళ్ళ చిప్ప
బొట్లు కానవెరా మీకు ♦ బొట్టులార!

కళ — నీవెవరవు?

ఎఱు — నేనా! చెప్పితిని గదా.

సోమ — మీ కుల మేది?

ఎఱు —

తే. గీ. ఎఱుక బ్రహ్మాదులకు నైన ♦ నెఱుక పడదు
నెఱుకె సర్వంబు నెఱుకకు ♦ మఱపులేదు
ఎఱుకల కులంబు నాది; నే ♦ నెఱుకనాని
నెఱుకఁ జెప్పెద లోక ము ♦ ష్మరుపు నొంద.

కళ — ఆహా! ఎఱుకమ్మతల్లీ! నీవు మాపూర్వపుణ్యావశమున భవాని

వలె ప్రత్యక్షమైనావు. మేమెంతసేపు [illegible] [illegible] గతి యేమో తెలిసి [illegible] తల్లీ,

ఎఱు — ఎఱుక చెప్పెదను.

కళ — అదే మాకు కావలసినది.

ఎఱు — (రాగ [illegible]

ద్విపద

ధర్మార్థమై యెల్ల ♦ ధనము గోల్పోయి
అడవులం బట్టితి ♦ రాజదల్ చెంది —
కఱ్ఱ లమ్మి బ్రతుక ♦ గడవు, డీ ముందు
దైవంబు లోడ్పడు ♦ దప్పక యిందు —

కళ — కఱ్ఱ లమ్ముకొనుమన్నావా? సరే.

ఎఱు — కఱ్ఱ లన్ని కనకాలౌతవి! కనకాలుంటే లోకాలున్నాయి. (అని వెళ్ళిపోవును)

సోమ — కళా! మన కీసోదెలతో నేమిపని? మన కీశ్వరుండే శరణ్యము.

కళ — నాథా! మీరన్నది నిజము. కాని, యీ యెఱుకసాని తప్పేమి చెప్పినది? మనమనుకొనని బ్రతుకుదెఱువొకటి చూపించి వెళ్ళిపోయినది.

సోమ — అగు నగును.

కళ — కఱ్ఱ లమ్ముకొనుట కన్న నిప్పుడు నిర్ధనులమైన మన మేమి చేయఁగలము?

సోమ — అగును (అని రెండడుగులు నడిచి) దేవీ! నీవిట నుండుము. కఱ్ఱలు నఱకుట కీజానపదమున నెవరినైన బతిమాలి గొడ్డలి యొకటి తీసుకొని వచ్చెదను. (అని వెళ్ళి గొడ్డలి చేతపట్టుకొని వచ్చును) దేవీ! యీయడవిని ఎండుకఱ్ఱ లెందును గానరాకున్నవి.

తే. గీ. ఎండుకట్టెలు గానరా ♦ వెండఁ గన్న
పచ్చికట్టెలు నరికిన ♦ బాపమండ్రు
ఇల సహింపవ్రతము వ ♦ హించువారి
కడుగు మోపుటకైన సా ♦ ధ్యంబు గాదు.

కళ — నాథా! ఈనదిలో నొరఁగిన చెట్టుచివరకొమ్మ లెండిపోయినవి.

హోమ — అగును! నా యాశాలతలు గూడ నట్లే యెండిపోయినవి. (అని మెక్కి కొట్టఁబోవును. గొడ్డలి జారి నీళ్ళలో పడిపోవును.) దేవీ! నా గొడ్డలి నదిలో జారి పడిపోయినది. ఆహా! దైవమా మమ్మెన్ని పడరాని కష్టాలపాలుఁ జేయుచున్నాఁడవు.

కళ —

తే. గీ. పొలములా పోయె బంగారు ♦ పోతపోసి
నట్టి పాత్రలు పోయె ధా ♦ న్యములుపోయె
నింక నినుపగొడ్డలి వగ ♦ పేటికయ్యొ
కాన దాగినఁ గష్టాలు ♦ గడవఁగలమె?

హోమ — దేవీ! నీవన్నది నిజమే కాని నామనస్సు మిగుల వేదనా దోదూయమానమై పోవుచున్నది.

సీ. ధనము పోయిన భూరి ♦ కనకంబు పోయిన
కన్నీటిచుక్క నేఁ ♦ గార్పలేదు
గృహము గోల్పోయిన ♦ విహితులు వీడిన
మనసులోపల నింత ♦ కినియలేదు
స్వస్థానమెడలిన ♦ స్వజనంబు వదలిన
ఘోరున దుఃఖంపఁ ♦ బోవలేదు
కూటికి లేకున్నఁ ♦ గోమలి యేడ్చిన
ఈశ్వరా యనుచుఁ జిం ♦ తింపలేదు

తే. గీ. ఎరవు తెచ్చినగొడ్డలి ♦ యేటియందు
జారె సెరవిచ్చువార లే ♦ నేరముంచి
నిందసేయుదురో యని ♦ కుందుచుంటి
ప్రాణి పోవచ్చుఁగాని పో ♦ రాదు పరువు.

కళ — నాథా! మనకు దైవము లేఁడా?

సోమ — దేవీ! మనకు గొడ్డ లెరవిచ్చినవారు మా గొడ్డ లేటిలో పడిపోయిన దన్న నమ్మరు. ఈ కాటకమున కూటికి లేక అమ్ముకొని తినినా మని బహువిధముల నిందించెద రవి యెట్లు భరింపవచ్చును.

పా ట

1

ముందుగతి యేమింక విధి
యెందుఁగలఁడు మాకింకన్

2

ఎండవానల కొండ కొక్కి యిా
యెండుకట్టెల యేరి బ్రతుకు మా

3

ఆపదలందున నాపద లిడు విధి
కోపదవాగ్నికి మోపఁగలమె మా ॥ముం॥

కళ — నాథా! నన్నంగడిని విక్రయించి మీగొడ్డలిఋణము తీర్చివేయుఁడు.

భవుడు — (ప్రవేశించి) ఆహా! తల్లీ! నీవే కులకాంతవు.

తే. గీ. లెక్కలేనంతధనము లా ♦ లించి లాగి
తన్నిపోవును వేశ్య కృ ♦ తఘ్న యగును
లెక్కలేనంతధనము త ♦ ల్లి నడిగిచ్చి
తనువు నర్పించు భార్య కృ ♦ తజ్ఞ యగును.

సోమ — దేవీ! నిన్నమ్మివేయుమందువా? అదియును సులభ సాధ్యము గాదు.

తే. గీ. సతిని విక్రయించిన హరి ♦ శ్చంద్రుఁ డంత
వాఁడనా నేను? నిన్నమ్మ ♦ వాఁడు రాజ
భటులు దండింత్రు గాని స♦ వర్తకుఁ డని
కాన కష్టాలమార్గాలు ♦ కానరావు.

భవు — పాపము వీరి దీనత నాహృదయమును నీరుఁ జేసి వేయుచున్నది. (అని యేటిలో మునిగి బంగారుగొడ్డలిఁ దీసి) సోమపాదుఁడా! యీ బంగారు గొడ్డలిఁ దీసికొని పొమ్ము (అని యిచ్చెను).

సోమ — (దీసికొని) దేవీ! మనకు దైవము ఇనుపగొడ్డలికి మారుగా బంగారుగొడ్డలి ప్రసాదించినాఁడు చూచుము.

కళ — నాథా! మనకు పోయిన బంగారముకన్న నీ బంగారము ఘనము గాదు. ఇది యెవరిసొత్తో వారి కర్పించి మన యినుపగొడ్డలినే యడిగి కొని తెండు.

సోమ — (భవుని సమీపించి) దేవా! నేనపరాధిని! నాది యినుప గొడ్డలి. ఇది పుచ్చుకొన్నందుకు క్షమింపుఁడు. (అని యిచ్చివేయును)

భవు — (అది నీళ్ళలో పాఱవేసి వెండిగొడ్డలి తీసి) ఇదిగో! వెండి గొడ్డలి తీసికొమ్ము.

సోమ — దేవా? ఇదియును నాది కాదు. నా యినుప గొడ్డలినే నా కొసంగుము;

తే. గీ. ఏది తన వస్తువో యది ♦ హీనమైన
నధికమైనను నానంద ♦ మగును గాని
ఎరవువస్తువు లన్నియు ♦ బరువుచేటు
లన్న లోకోక్తిలో నీతి ♦ యున్న దనఘ!

గుణదత్తుఁడు — (ప్రవేశించి) స్వామీ! మీరు పాఱవేసిన గొడ్డళ్లు నాకిచ్చివేయుఁడు.

భవు — నాయనా! దురాశ నీ కింకను వదలలేదు. ఆశించిన వన్నియు రావు.

మ. ధనవాంఛన్ విడనాడితేని ప్రతిపా ♦ దంబందు వేవేలుగా
ధనరాసుల్ లభియించు; లేనియెడ న ♦ ర్థం బర్థి రాఁబోవ దే
మనుజుం డున్న తృణంబు మేరువుగ సం ♦ భావించునో యాతఁడే
ధనికుం; డెవ్వనివానికిన్ ధనము వ్య ♦ ర్థం బెంతగా నుండినన్.

(అని బంగారు, వెండి, ఇనుప గొడ్డళ్ళు సోమపాదున కిచ్చి) సోమపాదుఁడా! నేను దేవమాతను. ఇవి నేను ఆశీర్వదించి యిచ్చితిని (అని నిష్క్రమించును).

సోమ — దేవీ! చూచితివా! ఈశ్వరానుగ్రహము!

శా. దైవంబే యిడనేని యీ ధనములో, ♦ ధాన్యంబులో, మేడలో,
ఏవో చేటలఁ గ్రుమ్మరించు; నవి మా ♦ యీ రెండు దోసిళ్లఁ గై
కోవాలన్నను జాల వీ తెఱఁగులన్ ♦ గుర్తింప కీమర్త్యు లే
వేవో యత్నము లాచరించెదరుగా ♦ రే దేవు సర్థింపకే!

గుణ — (స్వ) దేవతలకుఁగూడ పక్షపాత మున్నది. ఆహా! మళ్ళ కొలది బంగార మడుగకయే యీ భవుఁడు సోమపాదున కిచ్చి వెళ్ళిపోయినాఁడు. నేనెంత ప్రార్థించి బతిమాలి యేడ్చి మొత్తుకొన్నను నాకొక తృణమైన నియ్యఁ డాయెను. ఎంతవిపరీతము. నేను మాత్రము మనుష్యుఁడను గానా, నాకు మాత్ర మేల యియ్యక పోవలయును? వర్షము సస్యములపైఁ బడి కంచెలపై మానివేయునా? సరే! యీ ధనము సోమదత్తునకు దక్కనప్పుడుగదా! చూతము.

తే. గీ. ధనము మూలంబు లోకజీ ♦ వనమునకును
పుడమి ధనహీనుఁ డడుగైన ♦ పెట్టలేఁడు

తత్త్వవేత్తలు ధనము దం ♦ ధన మటన్న
భీష్ముఁడంతటివాఁడు సే ♦ వించె కురువు.

కావున ధనమేరీతినైన సంపాదింపవలయును. ఈ దినములలో ధనమున్నవాఁడే ఘనుఁడు. ధర్మమార్గమున ధనము రాదు. ధనమునకై యేమేమో మహాద్రోహములు సేయుచుందురు. ఇప్పుడు సోమపాదుని యొద్దఁ గల ధనము దొంగలచే దోపించెదను, తప్పదు. ఇదే ప్రకృత కర్తవ్యము (అని నిష్క్రమించును).

సోమ — నీ శాంతిశమదమాద్యనంత కళ్యాణగుణములే యీనితాంత దురంతదుఃఖ మహాసముద్రమును తరించు నౌకయై పరిణమించినవి. లేనిచో మన దరిద్రము తొలఁగునదిగాదు.

కళ — నాథా! మన కీశ్వరుఁ డయాచితముగా నొసఁగిన యీ ధన మక్షయము.

తే. గీ. ఎండవానలఁ గట్టెల ♦ నెత్తి నెత్తి
మోసికొని జీవనంబులఁ ♦ బుచ్చు మనకు
వెండి బంగారముల నొడి ♦ నిండఁ బోసె
నీశ్వరుని యీవి కరయ నం ♦ తేమి కలదు!

గుణదత్తుడు — (దొంగలతోఁ బ్రవేశించును) వీరలుదొంగలలో ఘనులు.

దొంగ — మేము దొంగలలో సుప్రసిద్ధులము. దొంగతనము అరువదినాలుగు కళలలో నొకటి. ఇది రారాజుల కులవిద్య. వారు ఊళ్ళు, మేము ఇళ్ళు దోచెదము. కావున రాజులకును మాకును వోపిడిలో సామ్యతగలదు. మఱియు కవులు రసమును, మహాఋషులు స్వర్గమును తరుచు దోచుకొనుచుందురు. వారు మానుండియే ఆ విద్య నేర్చుకొన్నారు. మా విద్యలో శ్రీకృష్ణుఁడు వెన్నదొంగ!

సోమ — కళా! వీరెవ్వరు?

కళ — మనవంటి బాటసారులు.

సోమ — అయ్యో! నీవెఱుంగవు. మనధనలక్ష్మిని దోచుకొనుటకై వచ్చిన దొంగలు కారుకదా.

కళ — నాథా! ఈ భావము మనయొద్ద డబ్బు లేనప్పుడు కలుగ లేదు. అప్పు డందరుమానవులు మానవులవలెఁ గనుపించిరి. ఇప్పు డందఱు దొంగలవలెఁ గనుపించుచున్నారు.

సోమ — నిజము! నిజము!

తే. గీ. పామువిష మెక్కినట్లు లీ ♦ హేమవిషము
మనుజ తత్త్వంబుఁ జంపివే ♦ యును సుమండి
అర్థహీనుని ధనవంతుఁ ♦ డరయలేఁడు
ధనికు లందరు కలుషాత్ము ♦ లనగవలయు.

కళ — నాథా! మార్గశ్రమచే నా కేమో విశేషముగ నిద్ర వచ్చు చున్నది.

సోమ — ఈ బంగారము మన మెడలోఁ బెట్టుకొని నిద్రింతము. రేపింటికిఁ బోయి మనము పూర్వముచేసిన అప్పులు తీర్చుకొందము. దాన మన ఋణవిముక్తి యగును. (అని నిద్రించెదరు)

గుణ — ఓరీ! చోరశిఖామణీ! చూచెద వేమి.

దొంగ — సమయము చూచుచున్నాము. (అని కొల్లగొట్టుదురు)

గుణ — (కళ నెత్తుకొనిపోవును)

(తెర)

చతుర్థాంకము

రంగము — అంగడి

(గుణదత్తుఁడు, కళ ప్రవేశించియుందురు)

గుణ —

తే గీ. ప్రాప్తమున లేని తృణమైన ♦ రానిమాట
నిజము; ప్రజ సేయుయత్నాలు ♦ నిష్ఫలంబు

విధివిధానంబు మారదే ♦ విఘసుస్నై న
ముత్తెముల కబ్ధి మునిఁగ ♦ నర్త లబ్బ.

ఆహా! నేను చేసినయత్న మంతయు వ్యర్థమైనది! నేను తిరిగి సోమపాదుని ధనము దొంగలచే కోపించినాను. కాని, ఆ దొంగలు నా కొక పీసమైన నియ్యక మోసముచేసి తీసుకొనిపోయినారు. నాకీ 'కళ' దొఱకినది. ఈమె నీయంగడిలో బానిసగ విక్రయించి వచ్చినంత ధనము చిక్కించుకొని పోయెదను.

కళ — అన్నా! నీకేమి యుపకారము చేసినామని మమ్మీ రీతిని వ్యథలపాలు చేయ సమకట్టినాఁడవు. అయ్యో! నీవాడుతోడునఁ బుట్ట లేదా. నీకు దయ, దాక్షిణ్యము లేదా? నన్ను నా భర్తతో నేల యెడబాటు గావించితివి. ఇప్పుడు నన్నెచ్చటకుఁ గొంపోవుదువు?

గుణ — నన్నేమియు ప్రశ్నింపక నాతో రమ్ము.

కళ — అయ్యో! ఇట్టి క్రూరకర్ముఁడవు నీ వెట్లు జ్ఞానసభలో చేరితివి.

గుణ — నేను చేఁతినా? అది యొక యెత్తు. నే నిట్టి వెన్నో సభలలోఁ జేరి స్వలాభ మున్నంతవఱకు మహాభక్తునివలె నటించినాను.

కళ — ఛీఛీ! నీ వెంత కపటాత్ముఁడవు.

గుణ — అదే యిప్పు డక్కఱకు వచ్చినది.

తే. గీ. కపటభక్తులె గౌరవ ♦ పాత్రు లగుచు
పేరు పొందుచు నున్నారు ♦ పృథ్వియందు
ఎంత త్రాగిన నంతవే ♦ దాంతియంద్రు
ఎంత బొంకిన నంతమ ♦ హిమ యటంద్రు.

కళ — ఉలవపాదు పందిరెక్కినట్లు మాయ యెంతకాలము చెల్లును?

గుణ —

తే. గీ. పరమసంగతి దేవుఁడే ♦ యెఱుఁగు నిప్పు
డిహము హాయిగా జరుఁగఁగా ♦ నిమ్ము ముందు

అరువుకన్నను రొక్క-మ్ము ♦ మెఱుఁగు గాదె
స్వర్గమున్నదొ లేదొ యె ♦ వ్వరికిఁ దెలియు.

కళ — నీవు చార్వాకుఁడవై చెడిపోయిన పామరుఁడవు. నీతో వాదమేమిటి? నన్నిప్పు డెచ్చటకుఁ గొని తెచ్చితివి?

గుణ — అంగడికి.

కళ — ఎందుకు?

గుణ — అమ్మటకు.

కళ — ఎవరిని?

గుణ — నిన్నే!

కళ — హాతోస్మి (అని నేల వ్రాలును).

గుణ — (స్వ) ఈమె నేత్రృణమునకో విక్రయించినఁగాని లాభములేదు.

కళ — (లేచి) హా! దైవమా, చూపరాని దృశ్యము లన్నియు చూపుచున్నావు. ఇందు నావంటి దురదృష్టవంతు లెందరో అగుపడు చున్నారు. హా!

సీ. తల్లిదండ్రులనుండి ♦ తనయుల విడిపించి
యూరించి యుదె ♦ అమ్ముచున్నవారు;
అతిలోకసుందర ♦ లైనకాంతలఁ దస్క-
రించి వేడుక విక్ర ♦ యించువారు;
ముకుపచ్చ లారని ♦ ముద్దుబిడ్డల దొంగి
లించి దుష్టులకు న ♦ ర్పించువారు;
అత్తింటికోడండ్ర ♦ నక్కటా యుదె యాచి
కొని తెచ్చి కులటలఁ ♦ గూర్చువారు;

తే. గీ. అహహ వీరెల్లఁ గావించు ♦ నార్తరవము
గగనమునుఁదాఁకి పగిలి ర ♦ క్తంబు గురియు

యమపురముకన్న నీ విక్ర ♦ యాపణంబె
ప్రబలనరకంబు బానిస ♦ వర్తకంబు.

ఓరీ! దుష్టుఁడా, ఎంతఘాతుకకృత్య మూహించితివి. నీకింక పుట్టుగతు లుండవు సుమా.

చంచల — (ప్రవేశించి) నేఁడేమో యీ బానిసల యంగడి చాల కోలాహలముగా నున్నది. నేఁడు నాకు మంచిబానిస దొరకవచ్చును. ఇంటి యూడిగంబులకు పగలును, రాత్రి రోవెలందియై ధనమును సంపాదించుటకును నొక బానిస నిందు కొనుక్కొని పోవలయును.

గుణ — ఓ ప్రజలారా!

తే. గీ. గుణములకుఁ బ్రోవు; హితములు ♦ గూర్చుచున్న
అడుగు మోపినచోట మం ♦ త్ర్యాలు పండు
మాటలాడినచోట హే ♦ మంబు గురియు
నట్టి 'కళ'ను బానిసగఁ గొం ♦ టూరె మీరు.

చం — ఇచ్చట నేవో క్రొత్తమాటలు వినవచ్చుచున్నవి.

గుణ — (పైపద్యమునే చదువును)

చం — ఓహో! గుణదత్తుఁ డిప్పుడు బానిసవర్తక మారంభించినట్టు లున్నది. వీడెంతకైన సమర్థుఁడే.

గుణ — (చంచలను చూచి) ఓహో! ఈ ముండ యిక్కడే లాగు దాపురించినది. (అని పారిపోవఁ జూచును)

చంచ — గుణదత్తుఁడా! ఉండుముండుము. పాఱిపోవకుము.

ఉ. ముక్కు, మొగంబు నేరనటు ♦ మూలల డాగెదవేల రమ్ము పె
న్మక్కువ నాదుకౌఁగిటను మద్యము ♦ ద్రావుచు కేరి యాడుచున్
కక్కురుతుల్ వెలార్చికొని ♦ కష్టము మళ్ళినసొమ్ము లీయకే
దక్కితినంచు పోయితివి ♦ దాగుడుమూతల నాడెదేటికిన్.

(అని చీపురుతో కొట్టును)

గుణ — ఇక్కడ కీబండారముగూడ చెడినది. (అని నిష్క్రమించును)

చంచ — (స్వ) ఈమె నా అక్క కళ! ఈ గుణవత్తు డెంక పాప మునకైన వెనుదీయఁడు! (ప్ర) అమ్మా! నీవు నా వెంట రమ్ము. నా యింట నీ కేమియు లోటు రాఁబోవదు.

(తెర పడును)

పంచమాంకము

రంగము — దారి

(సోమపాదుఁడు ప్రవేశించి యుండును)

సోమ — దైవికముగా ధనము వచ్చి నారికేళసలిలమువలె మాయమై పోయినది. పోయినది పోక ప్రాణప్రాయముగు నా కళను గూడఁ దీసుకొని పోయినది. నే నింక దేనికని బ్రతుకఁగలను. అయ్యో!

చ కళ విడనాఁడి యీ పగిది ♦ కష్టపరంపరలందు రేబవల్
కలఁగి, కళావిహీనమతి ♦ గాసిలుచుంటి నిషిద్ధజీవితం
బలరఁ బ్రచండ దుఃఖశిఖి ♦ కాహుతికా కిటు మేన ప్రాణముల్
గలిగినఁ జావునున్ బ్రతుకు ♦ గాదిది యేమని చెప్పుకొంటకున్.

నా కళను దొంగ లెత్తుకొనిపోయినారు. ఇంక జీవితమందు ప్రధానమైన నా కళ జారిపోయినది. కళావిహీనుఁడ నైన నేను బ్రతికియు జీవచ్ఛవమునై యున్నాను. ఇంక నాకు శాంతి యెక్కడిది. ఆహా! ఆకళ యెంత సద్గుణకళాధురీణ.

సీ. పతిమాట కెప్పుడు ♦ ప్రత్యుత్తరం బిచ్చి
కలహింప నొల్లని ♦ కలికిమిన్న
పొరిగింటివారి నె ♦ వ్వరి నొవ్వనాడ కే
ప్రొద్దు సంభావించు ♦ పుణ్యశీల

ప్రతినిష్ఠ లన్న! సీ ♦ శ్వరుఁ డన్న ప్రాణార్థ
ములు ధారవోసెడు ♦ ముదితహృదయ
కలనైన సన్నృతంబు ♦ పలుకనేరని మహా
ధర్మాత్మ సాధ్వీ శిరం ♦ తప్రదీప
తే. గీ. సద్గుణంబుల కాణాచి ♦ సచ్చరిత్ర
అమృతసదృశ, సదానంద ♦ సమహితాత్మ
ఓర్పు నేర్పులు కలిగిన ♦ యువిదమిన్న
కళను బోలిన కాంత లీ ♦ యిలను గలరె.

ఇంక నే నెంత వగచినను ప్రయోజనము లేదు. ఆ దొంగలే తీసుకొని పోయి యుండవచ్చును. ఆమె నీజాడను లెవరైన నెఱుంగుదురే హా!

చ. అడుగదు తానె కొన్నొక ♦ టైన సరే; పొరిగిండ్ల కెప్పుడున్
వెడలదు మెట్టినింటి గడ ♦ వేగ ధైర్యమువీడ; దోపికన్
విడువదు; తప్పు నేను దొక ♦ వీసము నైనను బొంక; దట్టి నా
పడతి కళాకలాప యగు ♦ పడ్డదె యెవ్వరికైనఁ జెప్పరే.

ఆహా! నా కింక కళ దూరమైపోయినది. నే నీజన్మలో నా కళను జూడలేను. ఇంక నా మిగిలిన జీవనము భూభారమునకే గాని వేరు గాదు.

సీ. కళను చూచితిరేని ♦ కరుణార్ద్రహృదయులై
చూపింపరే చంద్ర ♦ సూర్యులార
కళను గాంచితిరేని ♦ కనికరం బెదఁ బూని
విడువరే ప్రొక్కెద ♦ విబుధులార
కళ నెఱింగితిరేని ♦ కాఠిన్యమును మాని
వచ్చి చూపరె మేఘ ♦ పంక్తులార
కళ గ్రహించితిరేని ♦ కపటంబు వర్జించి
దరిఁ జేర్పరే పుణ్య ♦ తరువులార
తే. గీ. కళను దొంగిలించిరె విహం ♦ గంబులార
కళను నాచికొంటిరె పన్న ♦ గంబులార

కళను జెరబట్టితిరె చోర ♦ గణములార
కళను బంధించితిరె నగ ♦ కులములార.

ఇంక నే నెంత యేడ్చినను ప్రయోజనము లేదు. ఈ దారి నూరి లోనికిఁ బోయెదను. (అని కొంత నడిచి) అదిగో నా పరిచితు లెవరో వచ్చుచున్నారు.

(వీరిసెట్టి — జంధ్యాలభట్టు ప్రవేశింతురు)

జం — ఓరే వీరిసెట్టి! దొంగ దొఱికినాఁడు.

వీరి — దొంగ దొంగ యనిన నా యొడలు కంపమెత్తిపోవును. అయ్యో! నా యిల్లు దోఁచుచున్నారా యేమి?

జం — లేదు. ఈ దొంగ యిదివఱకే దోచినాఁడు.

వీరి — ఎవరఁడీ.

జం — ఇదిగో! సోమపాదుఁడు.

వీరి — ఆహా! వాఁడీ! వాఁడీ! పట్టుకొనుఁడు, పట్టుకొనుఁడు.

జం — పట్టుకొన్న నేమున్నది, పట్టెఁడుదుమ్ములు.

వీ — (సమీపించి) సోమపాదా! మా డబ్బుమా కేమందువు?

సోమ — నాయనలారా! నేను బ్రతికి యున్న మీ ఋణము దీర్చుకొనక పోను.

జం — ఏమి సంగనాచికబుర్లు నేర్చుకొన్నావు.

వీ — నీ బ్రతుకు చావులతో మాకు పనిలేదు; మా ఋణము మా కిచ్చివేయుము.

సోమ — నాయొద్ద కాసైనలేదు. నే నెట్లు మీఋణము తీర్చఁగలను?

జం — భవాభవు లిచ్చిన గొడ్డం (క్షేమిచేసినావు?

సోమ — అయ్యో! అవే నాకొంప తీసినవి.

ఆ॰ కొత్తనీరు వచ్చి ♦ కొలనిగట్టును ద్రెంచి
ప్రాతనీరును గొని ♦ పాఱినట్లు

స్వర్గనాను లిడిన ♦ బంగారుగొడ్డలి
పెట్టి కళస బొట్టఁ ♦ బెట్టుకొనియె.

వీరి — ఏమి విచిత్రము!

జం — నీ బొంకు లెవరు నమ్ముదురు? దేవతలు దయతో నిచ్చిన ధనము నీ పెండ్లాని కిచ్చి యెక్కడో దాచి పైగా దొంగకబుర్లు చెప్పుచున్నావా?

వీరి — ఇవే ఋణము లెగఁగొట్టు మార్గాలు.

సోమ — హరహర! మీరు పాపము లాడవలదు.

చ. కళస హరించినార త్రాక ♦ కాసుపకన్ గొఱగానియట్టి నా
వలన ఋణంబు దీరు టెట్లు ♦ పట్టిది; ఓ ఋణదాతలార! మీ
రలుగక నన్ను నేపకుడు ♦ యట్టిలికొం డది చాలదేని కం
డలు తెగఁగోసి నా కళస ♦ దాచిన వీథిని విక్రయింపుఁడీ.

(అని నేలఁ బడిపోవును)

వీరి — ఇది మంచివేషమే.

జం — ఒరే వీరిసెట్టి! ఇదే మంచిసమయము. ఈ సోమపాదుని మన మిరువురము మోసికొనిపోయి యమ్మివేయుదము! నీవు కాళ్ళవైపు పట్టుకొనుము.

వీరి — తన్నునేమో!

జం — అలాగైతే తలవైపు పట్టుకొనుము.

వీరి — కఱవఁడా?

చంచల — (ప్రవేశించి) పాప మీతఁ డెవఁడో ఋణదాతల బాధ కోర్వలేక నేలఁబడిపోయినాఁడు. జీవచ్ఛవమువలె నున్న యీతనిని వీ రమ్మివేయఁ దలఁచుచున్నారు. ఈ యుత్తమర్ణు లెంతకఠినులు!

ఆ. వె. పడవుకూడుకంటె ♦ వడ్డివర్తకమే ని
షిద్ధ జీవనమని ♦ చెప్పవచ్చు;

వేశ్య యిచ్చుకవుల ♦ వెల కమ్ముచుండు
బాధపెట్టు వడ్డి ♦ వర్తకుండు.

జం — ఎవరో దస్యుములాగు వచ్చి నన్ను నిందించుచున్నది.

వీరి — ఇంకెవరు? చంచల!

జం — చంచలయా! ఇక్కడ కెందుకు వచ్చినది?

(అని తొందరపడును)

చం — ఓహో! ఈ నటనలా?

ఆ. వె. ఇంట నెంతధనము ♦ నీల్గుచు నుండిన
గడ్డితింద్రు కాసు ♦ వడ్డికొఱకు
కాటియొద్ద నక్క ♦ కైవడి పేదల
కల్యములను గోతికి ♦ చంపుచుంద్రు.

ఈ బడుద్ధాయివాండ్రు నా యింటిచుట్టు తిరిగి నా దయకై యేడ్చిన వాండ్రే. (చీపురు పట్టుకొని) ఓరీ! నరమాంసవిక్రేతలారా! బుద్ధిలేదా? ఋణమునకై సాటిమానవు నమ్మివేయుదురా (అని చీపురుతో బాదును)

జం — నా బ్రాహ్మణ్యము నేటితో మంట గలిసిపోయినది.

వీరి — చంచలా! నన్ను విడిచిపెట్టుము. నన్ను హానివర్తకుడని రాజభటుల కప్పగింపకుము. నీకు పదివేలు సమర్పించుకొందును (అని యిచ్చిపోవును).

జం — ఇంతకు దురాశచే గక్కురితిపడినందుకు మంచిశాస్తి జరిగినది. (ప్రక్కను జూచి) ఇదిగో యెవరో సన్యాసి వచ్చుచున్నాడు. నేను పోయెదను. (నిష్క్రమించును)

గుణదత్తుడు — (ప్రవేశించి, స్వ) నేను సన్యాసినిగాను గుణదత్తుడను. నా జీవితనాటకమున కిది చతుర్థ రంగము. దీనితో నా కథ ముగిసి పోవును. (తిరిగి చూచి) ఓహో! మహామాయావియైన చంచల యిచ్చటనే యున్నది.

చంచ — సోమపాదా! నీవు నా కమ్మురై పోయినావు. కావున నా యింటికి వచ్చి నా యాజ్ఞానుసారము వర్తించుము.

గుణ — (స్వ) ఉన్న నేమి? నన్నెవరు పోల్చుకొందురు. కళను విక్ర యించి కాసైన సంపాదింపలేక గాని బానిసవర్తకుఁ డనుపేరు వచ్చినది. నన్ను ప్రభుత్వమువారు పట్టి బంధించుటకు వెదకుచున్నారు. వారికి చిక్కకుండ నే నీ సన్యాసవేషము ధరింపవలసివచ్చినది. సరే ముందేమి కానున్నదో చూచెదఁగాక!

చంచ — సోమపాదా! నీవు నా యింటికిఁ బోయి వీధిగుమ్మము కాచియుండుము. నేటినుండి నీవు శరుఁడని పిలువఁబడవలయును.

సోమ — సరే. (స్వ) ఇదంతయు నా కర్మసూత్రముగాక వేరే మున్నది?

చ. బ్రతుకున కెన్నొ యిక్కటులు ♦ వచ్చును గల్గునులోటు లెన్నొ; సం
స్మృతిఁ గడతేఱువార లొక ♦ రేనియు నుండరు; గాని నావలెన్
వెతల మునింగి ప్రేయసిని ♦ వీడి కటా పొరిగింటిదాస్య జీ
వితమున గొప్పరెవ్వరు భు ♦ విన్ మనుబోంట్లకుఁ జావు లేనొకో.

గుణ — ఎట్టులైన నీ చంచలను వంచింపవలయును. దీనియొద్ద లెక్క లేనన్ని ధనరాసు లున్నవి. ఆ మహాధన మంతయు వంచనచేసి సంపా దించినదే కాని దీని కావంతయు ధనాశ పోలేదు. ధనాశా! ధనాశ యీ కులట కుండునన్న లెక్కేమి.

శా. ఆశాబద్ధము లోకజాలము జడ ♦ త్వావేశవిస్ఫూర్తి యే
కోశంబందునొ యంటియుండును మము ♦ ష్యుల్ బ్రహ్మవిద్వర్యులే
యాశన్ బాయఁగలే రటన్నను హిర ♦ ణ్యంబన్న సామాన్యులో
పాశంకన్ దలఁపోయరా దిదె నుమీ ♦ ప్రాణంబు నీక్షోణికిన్.

చంచ — (సమీపించి) ఎవరీసన్యాసి. మహానుభావునివలె నున్నాఁడే.

గుణ — అగును. నేను మహానుభావుఁడనే.

చంచ — స్వామీ నమస్కారములు. (స్వ) (అత్తడౌవరో దొంగవలె నున్నాడు).

గుణ — నీ వెవ్వతెవు?

చంచ — నే నీ పురపు వేశ్యను. నా పేరు చంచల.

గుణ — నీవు సత్యమార్గమునకు రా (బయత్నింపుము.

చంచ — నీవే నాకు సత్యమార్గము కావలెను.

గుణ — నీ యందు మా కట్టి (పేమ కలదు.

చంచ — అటులైన నే నెంతయు ధన్య నయ్యెదను.

గుణ — సరే! నాకు చాల ఆకలి యగుచున్నది. చేరెడుపాలు గొనిరాఁగలవా?

చంచ — మీకు కావలసినన్ని తెచ్చి యిచ్చెదను.

(అని వెడలిపోవును)

గుణ — దీని కాశ మెండు. ఈ యాశలోనే దీనిని నాశనము సేయ వలయును. చాలమంది యాశాబద్ధులు వేదాంతము నేర్చుకొనుచు మనుమనుఁగులో మనోరథము లాకాశవీధుల కెగయఁ బరువెత్తు చుందురు. సరే! నా కతుపాలపులో నున్న బంగారుతీఁగ లీ మత్తి యూడలలో (గుచ్చి యుంచి చంచలకు హేమము చేయుదునను నమ్మ కము పుట్టించెదఁగాక. ఇది యన్ని వేదాంతములకన్నను పైమీఱి పోయిన వశ్యావధము.

చంచల — ((ప్రవేశించి, కళ నెత్తిపై తినుబండారములు పెట్టి తెచ్చి దింపి) స్వామీ! యీ భక్ష్యము లారగించి నన్నాశీర్వదించి నా కేమైన వేదాంతరహస్యము లెఱింగించి నా జన్మ తరింపఁజేయుఁడు.

గుణ — సరే! చంచలా! నీవు మిగుల యోగ్యురాలవు! నీవు చేసిన సేవాపరాయణతకు మే మెంతయు సంతసించితిమి. చూడుము - ఈ వట వృక్షపు ఊడలు (తెంపి తెమ్ము.

చంచ — (తెచ్చును.)

గుణ—వానిపై నా కమండలూదకము చల్లి సమిథలతో పెట్టి కాల్చి వేయుము.

చంచ — (అట్లు చేయును.)

గుణ — ఆబూడిద నా కమండలూదకమునఁ గడిగి తీసికొనిపొమ్ము.

చంచ — (బూడిద కడుగ బంగారుతీఁగలు చేతికి వచ్చును. అవి తీసి చూచి) ఆహా! యేమి యీ యోగిమహామహిమ. క్షణములో నీ మట్టియూడలన్నియు బంగారుతీఁగలైపోయినవి. (అని కాళ్ళపైఁబడి) సామి, మీరు సాక్షాదీశ్వరుఁడు, కాని వేరుగాదు. (స్వ) ఈతఁడు గుణదత్తుఁడు. నన్ను తిరిగి మాయచేయ వచ్చినాఁడు. పేదరిక మెన్నియనర్థములకైన దారితీయును. ఇంక నీతనికి నా నిజరూపమును చూపి క్రమపద్ధతులఁ బ్రతుకు త్రింపెదను (ప్ర) స్వామి!

ఆ. పుట్లకొలఁది హేమ ♦ పుంజంబు లుండిన
  హేమవిద్యయున్న ♦ ఋషిపదాబ్జ
  రజముకైన పనికి ♦ రావు; రారాజు లా
  యోగి కాళ్ళక్రింద ♦ నుండువారె.

స్వామీ! నా మందిరమునకు వచ్చి నన్ను పవిత్రను జేయ వేఁడుచున్నాను.

గుణ — మాకు మీ వంటివారితో నేమిపని?

చంచ — నాకు మీరు వేదాంతము నేర్పుదుమన్నారు గాదా (అని కోరచూపులు చూచును).

గుణ — అగును. నా యాశ్రమమునకు రమ్ము.

చంచ — నా యిల్లు మీ ఆశ్రమముగాదా?

గుణ — (స్వ) ఈమె నా వలలోఁ బడిపోయినది. కాని నేను దీని

యింటికి వెళ్ళిన నా గుట్టు బయలుపడక పోదు. కావున దీని నిప్పటి కైన తీసుకొనిపోయి దీనిఆస్తి యంతయు వ్రాయించుకొననగాక. అప్పుడుగాని నా శ్రమలు తీరవు (ప్ర) చంచలా! నీకిష్టమైన నా వెంట గమ్ము. లేదా నేను వెళ్ళిపోయెదను.

చంచ — స్వామీ! మీరు పోవలదు. నేను మీావెన్నంటి వచ్చెదను. (స్వ) సమయము దాటితే నా కితఁడు చిక్కఁడు. ఎప్పటికైన భర్త తోడిదే లోకము.

గుణ — (స్వ) ఈ చంచల ధన మెట్లో దక్కించుకోవలయును.

చంచ — శరా! నీవు నా పుత్రి యీశ్వరిని పెండ్లి యాడవలయును.

శరు — (స్వ) నా కళ యుండఁగా నేనీ వేశ్యాపుత్రి యీశ్వరిని పెండ్లియాఁడుటెట్లు? అయ్యో! నేనీ జన్మమున నిట్టి యకార్యాచరణము నీ ప్రాణముండఁగఁ జేయఁగలనా? ఎప్పటికైన నెన్నిజన్మలకైన నా కళే నాకు కావలెను. (ప్ర) అమ్మా! నాకుఁ బెండ్లియేమిటి? నేనే బానిసను. ఆ మహనీయయగు ఈశ్వరి —

చంచ — నీవు మారుమాటాడవలదు. నా ఆన —

శరు — అయ్యో! ఏలికమాట యెట్లు దాఁటనగును?

చంచ — ఈశ్వరీ! నేను వేదాంతము నేర్చుకొనుటకు దేశాంతరము లకు పోఁబోవుచున్నాను. కావున నా భాగ్య మంతయు నీవు జాగ్రత చేయుము. ఈ శరుని పెండ్లియాడి నాయానఁ జెల్లింపుము.

కళ — (స్వ) హా! హతోస్మి! నేను కులకాంతను. ఈ యన్యపురుషు నెట్లు వరింపఁగలను. (అని నేల పడిపోవును).

సోమ — ఏమి యీా వైచిత్ర్యము. కుమ్మరావములో నిత్తడిముంత లనినట్లు కులటయింట కులకాంతయా? యిది కడుంగడుచిత్రముగనున్నది.

చంచ — ఈశ్వరీ! యిది నీకు తప్పదు. ఇదే నేను వెళ్ళిపోవు చున్నాను. నా యాన చెల్లింపుము.

(చంచల గుణదత్తుఁడు నిష్క్రమింతురు)

సోము — ఈశ్వరీ! నీ వీ చంచల పుత్రికవు కావా? నీకు సతీత్వమేమిటి?

కళ — ఓరీ! బహుభాషీ! నోరు కట్టుము. నేను మగవాలిని. నా జోలికి వచ్చితివా ఇదిగో కత్తి. (అసి చూపును).

సోము — ఇది మిగుల చిత్రముగ నున్నది.

కళ — ఓ యీశ్వరా!

ఉ. ఓ జగదీశ్వరా! పరమ ♦ పావనోజ్జ్వలతేజ! చరాచరైక వి
భ్రాజిత, సర్వలోకజన ♦ వందిత నీకు ననంతరూపమే
యోజ నెఱుంగరాని దయి ♦ యున్నను నాపదలందు నీవు రా
రాజులకన్న మేటివయి ♦ రాజిలి బ్రోచెదు; నిన్ను మ్రొక్కెదన్.

స్వామీ! నా మానము కాపాడుము! లేదా నా ప్రాణమైన దీసి వేయుము.

సోము — ఈశ్వరీ! యిట్టి పరమహాపతివ్రతవు వేశ్యయింట నెట్లు కాపురమున్నావు?

కళ — అది నా కర్మసూత్రము.

తే. గీ. రావణుని చెఱ లేదె సీ ♦ తావధూటి
నరకునింటను రాజక ♦ న్యకలు లేరె
అట్లు నీ వేశ్యయింట నే ♦ నలరవలసె
విధివిధానము మారెను ♦ విధము గలదె?

సోము — ఈశ్వరీ! నీ చరిత్రము మిగుల విచిత్రముగ నున్నది. నా మన వాలకించి నీ తలపై ముసుగొకసారి తీసి యీ బ్రహ్మాండ పరిభ్రాంతమహామహిమాన్వితరూప మొకసారి సాక్షాత్కరించుకొనుము. ఆ విశ్వమోహనమూర్తి నొకసారి ప్రేమగానమున గాఢాలింగన మొనరించి నీ నిజరూప మహాతేజోవిరాజిత దివ్యదర్శనమును గావించు

కొని కృతార్థవు కమ్ము. లెమ్ము. ఏల ఈ నేలఁబడి పొర్లాడెదవు. (అని చేతిని చేయి కలిపి లేవును).

కళ — (లేచి) ఓరీ! శఠాత్మా! పాపీ! నాకరగ్రహణమున నాశరీరము మిగుల కళంకభూయిష్ఠముగఁ జేసివైచితివి. అయ్యో! నిరపరాధిని నగు నన్నేల ముట్టుకొంటివి. నాభర్త నన్ను బాసినదిమొదలు నేనీ యొంటి వలువతో కంటికి మంటి కేకధారగా నేడ్చుచు కాలము బుచ్చునాకింకను మరణము రాలేదని వేచియున్నాను. దోషదూషితులైన మీవంటివారి వదనజ్వాలామాలిక లవలోకించుటకు మాబోటి ఖిన్నహృదయుల కేమి పని. కావున నీ విచ్చటినుండి వెడలిపొమ్ము. దూరముగా పొమ్ము. నేను నా ముసుగు తీయను. నా యెదుటనుండి లేచిపొమ్ము. (అని కత్తిఁ జూపును).

సోమ — ఓహో! యిది కేవలము కళాస్వరూపము.

(చంచల, గుణదత్తుఁడు ప్రవేశింతురు)

గుణ — నీ కేమి కావలయును?

చంచ — నీయొద్ద గల హేమవిద్య చెప్పివేయుము.

గుణ — తప్పక. ఈవిద్య నీదే. నీవు నాదేవివి. నా అంకముపైఁ గూర్చుండి నాకు నీ ప్రేమాస్పదమైన ముద్దుపలుకులతో నాలింగనము గావించుము.

చంచ — అయ్యో! ఇది యేమిసన్యాసము!

గుణ — వేశ్యలయొద్ద సన్యాసులు సరసు లగుచుందురు.

చంచ — అది నావల్లకాదు.

గుణ — నీవు వ్యభిచారిణివి కావా?

చంచ — నీ సన్యాస మెట్టిదో నా వేశ్యత్వ మట్టిదే.

గుణ — అఁగఁ?

చంచ — అనఘా! నీవు సన్న్యాసివై అగపడినను మనసునం దా వైరాగ్యము లేదు. నేను వేశ్యనై అగపడినను నామనసునం దారాగ లేశము లేదు.

గుణ — నీవు వేశ్యావృత్తి సేయలేదా?

చంచ — చేసితిని.

గుణ — ఇంకేమి?

చంచ — వేశ్యావృత్తి చేసితిని గాని వ్యభిచరింపలేదు.

గుణ — అది యెట్లు?

చంచ —

తే. గీ. జగమునకు రెండు ద్వారాలు ♦ నెగడుచుండు
పాప పుణ్యాల సూత్రాలు ♦ పట్టుకొనఁగ
నెవనికి విశుద్ధత గలదొ ♦ యెవనియందు
మచ్చ లున్నవొ వానికే ♦ స్వచ్ఛ మదియు.

ఆ. వె. అగ్ని మ్రింగవచ్చు ♦ హాలాహలము గొంతు
బంటి దాచి బ్రతుక ♦ వచ్చుఁగాని
ధర్మఁ బతివ్రతలను ♦ దాఁకి జీవింపఁగాఁ
గలరె మిడుత దీప ♦ కళికఁబోలె.

చంచ — (గుణదత్తుని కాళ్ళపైఁ దలయుంచి) స్వామి! నేనుసర్వ సంగపరిత్యాగినై నీవే సర్వమని నీ సన్నిధిఁ జేరినాను. సన్నిక నీవు నీళ్ళ ముంచినను పాల ముంచినను నీదే భారము. నీసేవ, నీధ్యానము తప్ప నాకు వేరుచింత లేదు- వేరుశరణ్యము లేదు. రక్షింపుము.

(రాజభటులు ప్రవేశింతురు)

రాజభటులు — ఏడీ గుణదత్తుఁడు?

ఒకభటుఁడు — అదుగో.

మరియొక భటుడు — సన్యాసివేషము వేసికొని మాయచేయుట కేవో యుపాయాంతరములు పన్నుచున్నాఁడు.

మొదటిభటుఁడు — ఆహా! ఏమి.

రెండవభటుఁడు — (జుట్టు పట్టుకొనును).

చంచ — (లేచి) ఇది యేమి ఘోరము. నా గురుమహనీయు నేల పరాభవించెదరు?

మొదటిభటుఁడు — ఈతఁడు నీకు గురువా? నీ వెట్లు వేదాంతినివో యాతఁ డట్టిదొంగలకు గురువు.

చంచ — ఆహా! ఏమి యీ దారుణము!

రాజ — ఓరీ! గుణదత్తా! పలుక వేమి?

చంచ — ఏమి? యీతఁడు గుణదత్తుఁడా?

రాజ — మరెవరనుకొన్నావు!

రాజ — ఈ గుణదత్తుడు స్త్రీల దొంగిలించి శానిసవర్తకము చేయుచున్నాఁడను నేరము మోపి ప్రభుత్వము బంధింపఁదలచినారు. ఎవరైన నీతని సద్వర్తనమునకుఁ జూచీ పడు నెడల నీతని విడిచివైచెదము.

చంచ — బాబూ! ఈ దుర్మార్గున కెవరును నీ ప్రపంచములోఁ జూచీపడరు. పడినను వారల నట్టేట ముంచివేయ సమకట్టును. కావున వెంటనే వీనిని చెరసాలలో బంధించి బుద్ధిచెప్పుఁడు. మీకు పదివేల నమస్కారములు.

గుణ — ఆహా! ఎట్టి దృశ్యములు చూచుచున్నాను. ఇంక నే నీ ధరాప్రపంచమున నొక్క మట్టికణమును గూడ కాను కాబోలును.

(గురువు ప్రవేశించును)

హా! గురుమహాశయా! నన్ను కాపాడుము. నీయెడ నే నేయపరాధము చేసినాను. నా తప్పులు మన్నించి నా కిప్పుడే సాక్షాత్కరించి నన్నీ యాపదలనుండి కాపాడుము. తండ్రీ! కాపాడుము.

చం. జడుఁడ నిరీశ్వరుండ నయి ♦ జారుల చోరులతోడఁ గూడి యే
ర్పడ నపరాధముల్ సలిపి ♦ పాపములన్ వడిగట్టుకొంటి నీ
కడకు ఫలంబు గల్గినది ♦ గాదు నిజంబుగ సత్త్వవర్తనల్
విడువనివారె బాగుపడి ♦ విశ్రుతి గాంచిరి నాఁడు నాటికిన్.

గురువు — పుత్రా! భయపడకుము. నీవు పశ్చాత్తాపమున తిరిగి పవిత్రుఁడవు కాఁగలవు. రాజభటులారా! గుణదత్తుని విడిచివేయుఁడు.

(విడిచివేయుదురు)

గుణ — గురువర్యా! నమస్కారశతములు.

(అని కాళ్ళపైఁ బడును)

చంచ — స్వామి! నే నపరాధిని గాను.

గురు — అగును. నీ నాథుని నీవు తిరిగి స్వీకరింపుము.

గుణ — ఈమె నాథుఁ డెవరు?

గురు — నీవే.

గుణ — (చకితుఁడై నేలఁ బడిపోవును.)

చంచల — (లేపి నమస్కరించి) నీకు నేను నేటినుండి దాసిని. (అని మోముపైగల ముసుఁగు తీసి) ఈశ్వరీ! నీ ముసుఁగుఁ దీయుము.

కళ — (ముసుఁగు తీయును.)

చంచ — ఈమె కళ.

గురు — సోమపాదా! నీ వీమె నేలుకొనుము.

సోమ — ఈమె నా కళ. ధన్యోస్మి (అని కౌఁగిలించుకొనును)

గుణ — జయా! నీకే జయము - నిన్ను చావుమని తిట్టితిని. ఆ స్థితి నాకే పట్టినది.

(భవుఁడు అభవుఁడు ప్రవేశింతురు)

భవుఁడు — గురువర్యా! నమస్కారశతములు. మీ శిష్యుల నెందఱినో పరీక్షించి విమర్శించి వెన్నాడి వారి పవిత్ర మహాధర్మ ప్రతిపాదకమైన శీలము, జ్ఞానసాధనసంపత్తి, దేవలోకమే గాక ఇలాతల రసాతలములలోఁ గూడ చాటించి వెల్లడించినారము. మమ్ము మీ శిష్యకోటిలోఁ జేర్చుకొనుఁడు స్వామీ!

గురు — తథాస్తు.

అభవు — సోమపాదా! మహాపతివ్రత యగు కళా! మీ కిప్పుడు మేము సోదరులము. ఇదిగో! ఈ యక్షయమగు ధనము పారితోషికముగాఁ గైకొనుఁడు. గుణదత్తుఁడా! నీవు సన్మార్గగామి వైతివి గావున, ఇదిగో! యీ నిక్షేపమును గైకొని సుఖ ముండుము.

భరత వాక్యము

తేటగీతి

శాంతశమదమాదిక శుభా • నంత సుగుణ
గణములను గల్గి జ్ఞాన సా • ధనము సేయు
ధర్మవిదులతో దేశంబు • దనరుఁగాత
వైహికాముష్మిక సుఖంబు • లగునుగాత!

సంపూర్ణము.

శ్రీ ఉమర్ అలీషాకవిగారి గ్రంథములు

విక్రయమునకు సిద్ధముగ నున్నవి.

ఖండకావ్యము 400 పేజీలు	వెల	4 – 8 – 0
ఉమర్ ఖయ్యాం పారశీక మూలమునకు అనువాదము		3 – 0 – 0
సూఫీవేదాంత దర్శము తత్త్వగ్రంథము		2 – 0 – 0
అనసూయాదేవి; కళ (రెండు నాటకములు)		2 – 0 – 0

పుస్తకములు వలయువారు

మేనేజరు

శ్రీ ఉమర్ అలీషాకవి గ్రంథమండలి

పిఠాపురము

(తూ. గోదావరి జిల్లా)